www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 | సంచిక : 262 | బుధవారం 14-03-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

నిలువెత్తు నిర్లక్ష్యం

కేంద్రనిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం

నోరుమెదపని బీజేపీ ఎమ్మెల్యేలు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి :
విభజన చట్టంలో హామీలపై కేంద్రం నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఏపీ శాసనసభ మంగళవారం ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించింది. ఈ తీర్మానాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శాసనసభలో ప్రవేశపెట్టారు. స్పెషల్ స్టేటస్‌లో ఇచ్చేవన్నీ ఏపీకి ఇస్తే తప్ప ఆందోళన ఆగదని ఆయన పేర్కొన్నారు. ప్రధాని ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేయాలని, ప్రత్యేక హోదా ఆంధ్రప్రదేశ్ హక్కు అని స్పష్టం చేశారు. సీఎం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మాన పూర్తి సారాంశమిది.

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014లోని అంశాలు, ఆనాటి ప్రధాని ఇచ్చిన హామీల అమలులో జరుగుతున్న జాప్యం, వీటి విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి పట్ల రాష్ట్ర శాసనసభ తీవ్ర అభ్యంతరాన్ని, నిరసనను వ్యక్తం చేస్తున్నది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అశాస్త్రీయంగా జరిగింది. నూతనంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్రం తీరని అన్యాయం చేసింది. ఆస్తుల అప్పుల విభజనలో, విద్యుత్ పంపిణీలో, పన్నుల వసూళ్ళు, తిరిగి చెల్లింపుల్లో మిక్కిలి నష్టం జరిగింది. విభజన చట్టం ప్రకారం అమరావతి నిర్మాణానికి కేంద్రం ఆర్థిక సాయం చేయాలి. విశాఖకు రైల్వే జోన్ ఇవ్వాలి. కడపలో ఉక్కు కర్మాగారం స్థాపించాలి. ఓడ రేవు రావాలి. పెట్రో కెమికల్ పరిశ్రమ ఏర్పాటుకావాలి. నియోజకవర్గాల సంఖ్య పెరగాలి. అనేక విద్యా, పరిశోధన సంస్థలు ప్రారంభించాలి. ఉమ్మడి రాష్ట్రంలోని సంస్థల విభజన పూర్తికావాలి. విభజన బిల్లు రాజ్యసభలో ఆమోదింప చేయడానికి ఆనాటి ప్రధానమంత్రి ఆరు హామీలతో కూడిన ప్రకటన చేసారు. అందులో ముఖ్యమైనవి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడం, ఆదాయం కోల్పోతున్న రాష్ట్రానికి రెవెన్యూ లోటును భర్తీ చేయడం, బుందేల్‌ఖండ్, కోరాపుట్-బోలాంగిర్-కలహండి తరహాలో వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక సాయాన్ని అందించడం. రైల్వేజోన్ ఇవ్వడం కుదరదంటున్నారు. ఉక్కు కర్మాగారం లాభసాటి కాదంటున్నారు. ఓడ రేవుకు అభ్యంతరాలు పెడుతూ తాత్సారం చేస్తున్నారు. పెట్రో కెమికల్ పరిశ్రమకు సుమారు ఐదు వేల కోట్ల రూపాయల వయాబిలిటీ గేప్ ఫండింగ్ భారం రాష్ట్రం భరించాలంటున్నారు. విద్యా సంస్థల పురోగతి మందంగా ఉంది. ఇప్పుడు ఇస్తున్న కేటాయింపులను చూస్తే ఇవి వచ్చే ఇరవై యేళ్ళకైనా పూర్తవుతాయా అన్న సందేహం కలుగుతుంది. ఉమ్మడి రాష్ట్రంలోని సంస్థల విభజన నత్తనడక నడుస్తోంది. నియోజకవర్గాల పునర్విభజన ఊసే లేదు. విజయవాడ, గుంటూరు పట్టణాలకు డ్రైనేజీ కోసం ఇచ్చిన డబ్బు కూడా

- మిగతా 2 లో

హోదా ముమ్మాటికీ సెంటిమెంటే !

ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే కాంగ్రెస్‌కు పట్టిన గతే !

ఆంధ్రాకు జరిగిన అన్యాయంపై కంటతడిపెట్టిన సీఎం



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి :
సెంటిమెంటుతో డబ్బులు రావని, యుద్ధం చేయట్లేదు కాబట్టి ఆడబ్బులు కూడా ఇవ్వమని అడుగుతారని ఏపీ ప్రజలను అవమానిస్తున్న కేంద్రమంత్రి అరుణ్ జైట్లీపై సీఎం చంద్రబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విభజన చట్టం అమలుపై మంగళవారం అసెంబ్లీలో చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి సుమారు రెండుగంటలపైగా సుదీర్ఘంగా మాట్లాడారు. సెంటిమెంట్లకి డబ్బులు రావన్న జైట్లీకి నాడు సెంటిమెంటుతోనే రాష్ట్రాన్ని విభజించిన సంగతి గుర్తులేదా? అని చంద్రబాబు ప్రశ్నించారు. ప్రత్యేక హోదా ఏపీ ప్రజలకు ముమ్మాటికీ సెంటిమెంటేనని స్పష్టం చేశారు. మాది కోరుకున్న విభజన కాదు, అన్యాయంగా,అశాస్త్రీయంగా రాష్ట్రాన్ని విభజించారు. ప్రజలు తీవ్ర ఆవేదనగా వున్న ఈ పరిస్థితుల్లో విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను, సాక్షాత్తూ మాజీ, ప్రస్తుత ప్రధానమంత్రులు కూడా ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే వారికి ఎలా వుంటుందో అర్థం చేసుకోవాలన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ కూడా అలాగే చేస్తే 125 సంవత్సరాల చరిత్ర కల్గిన పార్టీకి ప్రజలు

- మిగతా 2 లో



ప్రతీకార దాడి

9 మంది జవాన్లు మృతి

చత్తీస్‌ఘడ్‌లో మందుపాతర పేల్చిన నక్సల్స్

పేలుడు ధాటికి గాల్లోఎగిరిపడిన మైన్‌ప్రూఫ్ వాహనం

విశాలాంధ్ర-చింతూరు/ చర్ల :
తడపలగుట్ట ఎన్‌కౌంటర్‌కు ప్రతీకారం తీర్చుకోవటానికి తహతహలాడిన మావోయిస్టులు అదను చూసి మంగళవారం పంజా విసిరారు. భీకర మందుపాతర పేల్చారు. పేలుడు దాటికి మైన్ ప్రొటెక్టెడ్ వాహనం తునాతునకలు కాగా, ఈ దాడిలో 9 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు దుర్మరణం చెందారు. కిస్తారాం రోడ్డులో మావోయిస్టులు మాటు వేసి ఈ దాడికి పాల్పడ్డారు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దు రాష్ట్రమైన చత్తీస్‌ఘడ్‌లోని సుక్మాజిల్లా గొల్లపల్లి కిష్టారం గ్రామ సమీపంలోని పలోడి అడవుల వద్ద మంగళవారం మందుపాతరను అమర్చారు. 212 సీఆర్‌పీఎఫ్ బెటాలియన్‌కు చెందిన జవాన్లు ఏంటీలేండ్ మైన్‌ప్రూఫ్ వాహనంలో ఉదయం కూంబింగ్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా మందుపాతర పేల్చటంతో వాహనం గాలిలో తేలిపోయి కిందకు పడటంతో తొమ్మిది మంది జవాన్లు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. జవాన్ల శరీరాలు దూరంగా చెల్లాచెదురుగాపడ్డాయి. మృతి చెందిన వారిలో ఏఎస్ఐ ఆర్‌కెఎస్ తోమార్, హెడ్‌కానిస్టేబుల్ అజయ్‌కుమార్ యాదవ్,

- మిగతా 2 లో

నైపుణ్యం కరవు

- అర్హులైన గ్రాడ్యుయేట్లు 30శాతం
- ఇంజినీరింగ్‌లో పరిస్థితి దారుణం
- ఏడాదికి 2.5లక్షల ఇంజినీర్లు
- 15,000 మంది డాక్టర్లు



విశాలాంధ్ర -అమరావతి :
ఆంధ్రప్రదేశ్‌లో నిపుణులైన సిబ్బందికొరత వేధిస్తోంది. కొత్తకొత్త పరిశ్రమలు రావాలంటే వాటిలో పనిచేసేందుకు సాంకేతిక పరిజ్ఞానంతోపాటు ఇతర నైపుణ్యాలు కలిగిన సిబ్బంది అవసరం ఎంతైనా ఉంది. అయితే నిపుణులైన సిబ్బంది కొరత తీవ్రంగాఉందని ప్రభుత్వం అంచనాలే తెలియజేస్తున్నాయి. 2022 నాటికి కోటిమంది నిపుణులైన సిబ్బంది, కార్మికులు అవసరముండవచ్చునని ప్రభుత్వం అంచనావేసింది. అలాగే 15ఏళ్ల కాలానికి 2కోట్లమంది సిబ్బంది అవసరంకావచ్చు. రాష్ట్రాన్ని నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతానని ప్రభుత్వం చెబుతున్నమాటలు సాకారం కావాలంటే, అన్ని రంగాలలో నిపుణులకొరత లేకుండా చూసుకోవలసిందే... రాష్ట్రంలో ఏడాదికి దాదాపు రెండున్నర లక్షలమంది ఇంజినీర్లు కాలేజీలనుండి బైటకు వస్తున్నారు. అలాగే 15,000 మంది డాక్టర్లు తయారవుతున్నారు. ఇంకా గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఇతర స్థాయి చదువులు పూర్తిచేసుకున్న యువత అనేక లక్షలమంది ప్రతి సంవత్సరం నిరుద్యోగుల జాబితాలో చేరుతున్నారు. అయితే వీరందరిలోనూ ఒక ఉమ్మడి సూత్రం కనిపిస్తోంది. 30శాతం గ్రాడ్యుయేట్లు మాత్రమే ఉద్యోగఅర్హత ఉన్నవారు లభిస్తున్నారు. అంటే తక్కిన 70శాతం మంది ఏ రంగంలోనూ నైపుణ్యం సాధించలేక చిన్నచితక పనులతో జీవిస్తున్నారు లేదా నిరుద్యోగులుగా కొనసాగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధిని సాధించేందుకు ఏడు వివిధ రకాల మిషన్లను ఏర్పాటుచేసింది. అనుకున్న అభివృద్ధి జరగాలంటే లక్షలాదిమందిని నైపుణ్యంకల సిబ్బందిగా తయారుచేయవలసిఉంది. 2016 నుండి ఇంతవరకు ప్రభుత్వం 44,604 మందికి మాత్రమే వివిధ రంగాలలో స్కిల్ డెవలెప్‌మెంట్,

- మిగతా 2 లో

దిగొచ్చిన ఎస్‌బీఐ

కనీస నిల్వలపై ఛార్జీలు తగ్గింపు



ఢిల్లీ :
కనీస నిల్వలు లేకపోతే వీపరీతంగా ఛార్జీలు బాదేస్తున్న ప్రభుత్వ రంగ అతిపెద్ద బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) వెనక్కు తగ్గింది. పొదుపు ఖాతాల్లో కనీస నిల్వలు లేకపోతే వసూలుచేసే ఛార్జీలను 75శాతం వరకు తగ్గించింది.

ప్రస్తుతం మెట్రో, అర్బన్ కేంద్రాల్లోని ఎస్‌బీఐ పొదుపు ఖాతాల్లో కనీస నిల్వలు లేని ఖాతాదారుల నుంచి నెలకు రూ. 50(జీఎస్‌టీ కాకుండా) చొప్పున, సెమీ- అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లోని ఖాతాదారుల నుంచి నెలకు రూ. 40(జీఎస్‌టీ కాకుండా) వసూలు చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ ఛార్జీలను 75శాతం వరకు తగ్గించింది.

దీని ప్రకారం.. ఇకపై మెట్రో, అర్బన్ కేంద్రాల్లోని పొదుపు ఖాతాల్లో కనీస నిల్వలు లేకపోతే

- మిగతా 2 లో

ఐక్యమవుదాం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ. పక్కన చలసాని, శివాజీ, దోనేపూడి తదితరులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం ఆంధ్రులంతా ఏకమవ్వాలని ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. విజయవాడలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఇద్దరు కేంద్ర మంత్రులతో రాజీనామా చేయించి, ప్రజల్ని మభ్యపెట్టే ప్రయత్నాలను టీడీపీ

- మిగతా 2 లో

- హోదా కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలి
- ఎన్డీయే నుంచి టీడీపీ వైదొలగాలి
- 19న అఖిలపక్ష రౌండుటేబుల్ సమావేశం
- ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి నేత రామకృష్ణ
- హోదా ప్రకటించకుంటే ఆమరణ నిరాహార దీక్ష: హీరో శివాజీ

ఫిరాయింపు ఎమ్మెల్యేలకు కోర్టు నోటీసులు
- వివరాలు 3 లో

రేపటి నుంచి టెన్త్ పరీక్షలు
- వివరాలు 3 లో

ఆధార్ అనుసంధానానికి బ్రేక్

- తదుపరి తీర్పు వరకు గడువు పెంపు
- అప్పటి వరకు తప్పనిసరి కాదు
- సంక్షేమపథకాలు, రాయితీలకు వర్తిస్తుంది : సుప్రీం



ఢిల్లీ:
బ్యాంకు ఖాతాలకు, మొబైల్ ఫోన్లకు ఆధార్ అనుసంధానంపై సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం తీసుకుంది. ఆధార్ చెల్లుబాటుపై సర్వోన్నత న్యాయస్థానం రాజ్యాంగ ధర్మాసనం తీర్పు వెల్లడించే వరకు నిరవధికంగా అనుసంధాన గడువును పొడిగిస్తున్నట్టు వెల్లడించింది. అప్పటివరకు బ్యాంకు ఖాతాలకు, మొబైల్ ఫోన్ నంబర్లకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి కాదని తెలిపింది. ఈ మేరకు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ఐదుగురు సభ్యులతో కూడిన

- మిగతా 2 లో

పేట్రేగిన పెత్తందార్లు

పూసపాటిరేగలో దళితులపై దాడి

పలువురికి గాయాలు

దాడి అనంతరం సామాజిక ఆంక్షలు



విశాలాంధ్ర బ్యూరో-విజయనగరం :
విజయనగరం జిల్లాలో పెత్తందారులు మరోసారి పెట్రేగిపోయారు. పూసపాటిరేగ మండలం ఎరుకొండలో దళితులపై దాడికి దిగారు. దొరికిన వారిని దొరికినట్టు చితకబాదారు. బాధితులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పరుగులు పెట్టారు. ఈ దుశ్చర్యలో గాయపడ్డవారు ఇప్పుడు జిల్లా కేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కొద్ది నెలల క్రితం డెంకాడ మండలం మోదవలసలో దళితులపై జరిగిన దాడిని పూర్తిగా మర్చిపోకుండానే మరో సంఘటన చోటుచేసుకోవడం సభ్యసమాజాన్ని నివ్వెరపరిచింది. ఎరుకొండ సంఘటనకు సంబంధించి బాధితుల కథనం ప్రకారం....సోమవారం సాయంత్రం ఆటోలో జరిగిన చిన్న సంఘటన ఈ వివాదానికి

- మిగతా 2 లో

పాలస్తీనా ప్రధాని లక్ష్యంగా పేలుడు



జబాలియా (గాజాస్ట్రిప్) : గాజాస్ట్రిప్ ప్రాంతంలోకి పాలస్తీనా ప్రధానమంత్రి ప్రవేశించిన కొద్దిసేపటికే ఆయన కాన్వాయ్‌ను లక్ష్యంగా చేసుకుని మిలిటెంట్లు పేలుడు జరిపారు. అయితే ఆయనకు ఎటువంటి గాయాలు తగలలేదని తెలుస్తోంది. ప్రధానమంత్రి రమీహమ్‌దల్లా ఈ ప్రాంతంలో ఏర్పాటుచేసిన మురుగునీటిని శుభ్రపరిచే ప్లాంటును ప్రారంభించేందుకు వచ్చారు. ఇస్లామిక్‌హమాస్ పాలకులు ఈ పేలుడుకు కారకులని ప్రధాని నాయకత్వంలోని ఫతాహ్ పార్టీ ఆరోపించింది. పేలుడువల్ల కాన్వాయ్‌లోని మూడు వాహనాలు దెబ్బతిన్నాయి. హమ్‌దల్లా వెస్ట్‌బ్యాంక్ ప్రాంతంలో ఉంటారు. హమాస్ సంస్థ గాజాప్రాంతాన్ని పరిపాలిస్తోంది. ఇరుపక్షాలకు చాలాకాలంగా తీవ్ర విభేదాలు, వైరుధ్యాలున్నాయి.

రొమేనియా, బల్గేరియా, గ్రీసు మధ్య సహకారం



బుకారస్ : రొమేనియా, బల్గేరియా, గ్రీసు మధ్య సహకారాన్ని పటిష్టం చేసుకోవాలని ఆయా దేశాల విదేశాంగమంత్రుల సమావేశం నిర్ణయించింది. రొమేనియా విదేశాంగమంత్రి టియోడర్‌మెలిస్కను విలేకరులతో మాట్లాడుతూ మూడు దేశాల మధ్య రాజకీయ చర్చలకు, యూరోపియన్ ప్రాజెక్టును మరింత పటిష్టం చేసుకునేందుకు అవకాశం కలిగిందని అన్నారు. విలేకరుల సమావేశంలో బల్గేరియా, గ్రీకు విదేశాంగమంత్రులు కూడా పాల్గొన్నారు. యూరోపియన్ యూనియన్‌తో సహకారాన్ని కొనసాగిస్తూనే తమకు తూర్పు ప్రాంతంలోవుండే ఆర్మేనియా, అజర్‌బైజాన్, బెలారస్, జార్జియా, మాల్డోవా, ఉక్రెయిన్ దేశాలతోను స్నేహసంబంధాలు కొనసాగిస్తామని ముగ్గురు మంత్రులు తెలిపారు.



ఇథియోపియానుంచి వేలాదిమంది వలస

అడిస్‌అబాబా : ఇథియోపియాలో సైనికులు పొరపాటున 9 మంది పౌరులను కాల్చి చంపివేశారని ఈనేపథ్యంలో ప్రజలు భీతిల్లిపోయారని, దాదాపు 8500 మంది పొరుగునవున్న కెన్యాకు వలసవెళ్లారని సైన్యం తెలియజేసింది. ఒరోమో జాతి శరణార్థులు ఈనెల 10వ తేదీనుంచి కెన్యా ఉత్తరప్రాంతంలోకి ప్రవేశించడం ప్రారంభమైందని ప్రభుత్వ ప్రతినిధి తెలిపారు. వలసవస్తున్న వారిలో అత్యధికులు మహిళలు, పిల్లలు ఉన్నారు. సైనికులు పొరపాటున జరిపిన కాల్పుల్లో 9 మంది చనిపోగా 12 మంది గాయపడ్డారని, గాయపడిన వారికి ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నట్టు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. తుపాకి కాల్పులు వినిపించాయని ఆ తరువాత చూస్తే 9 మంది పౌరులు మరణించి వున్నారని ఈ విషయం స్కూళ్లు, చర్చిలు, మసీదులు, ఆయా కుటుంబాలకు విస్తృతంగా తెలియడంతో ఎక్కువమంది కెన్యాకు వలసవెళ్లారు. గత రెండేళ్లుగా ఒరోమియా, హమ్‌హరా ప్రాంతాలలో నిరసనలు వెల్లువెత్తాయి. ఈ రెండు ప్రాంతాల ప్రజల మధ్య జరిగిన ఘర్షణల్లో వందలాదిమంది చనిపోయారు. అలాగే ఒరోమియా, సొమాలి ప్రాంతాల మధ్య తీవ్ర ఘర్షణలవల్ల 9,00,000 మందకిపైగా ప్రజలు తమ ఇళ్లు వదిలిపెట్టి దూరప్రాంతాలకు వలసవెళ్లిపోయారని తెలుస్తోంది. ఈ రెండు ప్రాంతాల ప్రజల మధ్య ఘర్షణతో ఇథోపియా ప్రభుత్వం తీవ్ర సవాళ్లను ఎదుర్కొంటోంది. దాదాపు 25 ఏళ్ల క్రితం ఇథోపియాలో ప్రభుత్వం ఏర్పడింది. తాజాగా పౌరులపై జరిగిన కాల్పులు తప్పుడు సమాచారం రావడంవల్లనే జరిగాయని సైన్యం తెలియజేసింది.

వాగ్దానాలు నెరవేరిస్తేనే కిమ్‌తో భేటీ

అమెరికా కొత్త మెలిక



వాషింగ్టన్ : ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్‌ఉన్‌తో చర్చలు జరపాలంటే ఆయన తన వాగ్దానాలను నెరవేర్చినప్పుడే సాధ్యమవుతుందని అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ తెలిపింది. అమె రికా అధ్యక్షుడు ట్రంప్ కిమ్ మధ్య శిఖరాగ్ర సమా వేశాన్ని ఏర్పాటు చేసేందుకు దక్షిణకొరియా గణనీ యమైన కృషి చేసింది. అయితే సానుకూలమైన వాతావరణం ఏర్పడేందుకు చైనా అధ్యక్షుడు చర్చలు జరపడంవల్లనే సాధ్యమయ్యిందని దక్షిణకొరియా తెలియజేసింది. కిమ్ కూడా ట్రంప్‌తో చర్చలకు అంగీకరించారు. కొరియా ద్వీపకల్పంలో సైనిక విన్యాసాలను రద్దుచేయడం, ప్రాంతంలో అమెరికా తన సైనిక స్థావరాలను ఎత్తివేయడం ద్వారా మాత్రమే ప్రశాంతత నెలకొంటుందని గతంలోనే చైనా, రష్యాలు తెలియజేశాయి. అయినప్పటికీ ట్రంప్ దక్షిణకొరియా, జపాన్ సైనికదళాలతో కలిసి విన్యాసాలు నిర్వహించేందుకే ప్రాధాన్యతనిచ్చారు. ఉత్తరకొరియా క్షిపణుల ప్రయోగాన్ని నిలిపివేయడం, అణు పరీక్షలను ఆపివేయడం జరిగితేనే చర్చలకు ట్రంప్ హాజరవుతారని వైట్‌హౌస్ షరతుపెట్టింది. వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి సారాశాండర్స్ విలేకరులతో మాట్లాడుతూ ఈ అంశాన్ని తెలియజేశారు. గత వారం దక్షిణకొరియా జాతీయ భద్రతా సలహాదారు నాయకత్వంలో ఉత్తరకొరియాకి ఒక బృందంవెళ్లి కిమ్‌తో చర్చలు జరిపిన అనంతరం ఆ అంశాలను ట్రంప్‌కి వివరించింది. చర్చలకు రావలసిందిగా ట్రంప్‌ను ఆహ్వానించగా ఆయన అందుకు అంగీకరించారు. అయితే ఇంతలోనే అమెరికా తన వైఖరిని మార్చుకున్నట్టు కనిపిస్తోంది. సమావేశానికి రావటానికి ట్రంప్ అంగీకరించినట్టుల దక్షిణకొరియా ప్రకటించింది. ఈ ప్రయత్నాలు ఒకవైపు జరుగుచుండగానే మళ్లీ ఆంక్షలు విధిస్తామని అటు ట్రంప్, అమెరికా విదేశాంగమంత్రి రెక్స్‌టిల్లర్సన్ పలుమార్లు ప్రకటించడం విశేషం.అత్యధికంగా ఉత్తరకొరియాపైన ఒత్తిడి తీసుకురావడానికే ప్రాధాన్యత ఇస్తామని శాండర్స్ అన్నారు.

బాల్కన్ దేశాలలో నాటో సైనికులతో ముప్పు

గ్రీసు, టర్కీ కమ్యూనిస్టుల హెచ్చరిక



ఏథెన్స్ : బాల్కన్ దేశాలలో నాటో సైనిక దళాలు స్థావరాలు ఏర్పాటు చేసుకునివున్నాయని వీటితో ప్రజలకు ఆయా దేశాలకు ముప్పు కలుగుతుందని గ్రీసు, టర్కీ కమ్యూనిస్టు పార్టీలు ఒక సంయుక్త ప్రకటనలో హెచ్చరించాయి. ఈ సైనిక స్థావరాలు విధ్వంసకరమైన యుద్ధాలకు వ్యూహాలు పన్నుతుంటాయని వాటికి వ్యతిరేకంగా ప్రజలు ఆందోళన చేయాలని పిలుపునిచ్చాయి. సోమవారం టర్కీ కమ్యూనిస్టు యూత్ నాయకత్వంలో ప్రదర్శనలు జరిగాయి. టర్కీ పశ్చిమదేశాలకు తాము వ్యతిరేకంగా ఉన్నామని చెప్పేందుకు కపటనాటకాన్ని కొనసాగిస్తున్నదని, వాస్తవంగా అది సామ్రాజ్యవాద మనస్తత్వంతోనే ఉన్నదని కమ్యూనిస్టు పార్టీలు తెలియజేశాయి. ఫిబ్రవరి 27వ తేదీన గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఏథెన్స్‌లో భారీ నిరసన ప్రదర్శన జరిగింది. అమెరికా రాయబార కార్యాలయాన్ని దిగ్బంధించేందుకు ప్రయత్నం చేశారు. సామ్రాజ్యవాదంతో ఘర్షణకు దిగకుండా దానిపై విజయం సాధించడం సాధ్యంకాదని రెండు కమ్యూనిస్టు పార్టీలు తెలిపాయి. గ్రీసు కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి డిమిట్రిస్ కౌట్‌సౌంబస్ మాట్లాడుతూ ఇక్కడ ఏర్పడిన సిర్జా-ఎఎన్‌ఇఎల్ ప్రభుత్వం అమెరికా, నాటో కూటమి బ్యానర్ను పట్టుకొని పాలిస్తున్నదని విమర్శించారు. గ్రీకు పెట్టుబడిదారుల ప్రయోజనాలకోసమే సిర్జా ప్రభుత్వం పనిచేస్తున్నదని, ఏజియన్, బాల్కన్ ప్రాంత దేశాల్లో నాటో అస్థిరీకరణకు పూనుకుంటున్నదని కమ్యూనిస్టులు హెచ్చరించారు. నాటో విచ్ఛిన్నకర ఎత్తుగడలను తిప్పికొట్టేందుకు సహ విద్యార్థులంతా కలిసిరావాలని అంకారా యూనివర్శిటీలో కమ్యూనిస్టు విద్యార్థుల సంఘం ఈనెల 1వ తేదీన నిరసన ప్రదర్శన జరిపింది. అలాగే టర్కీ కమ్యూనిస్టు యూత్ ఇస్తాంబుల్‌లో ఈనెల 3వ తేదీన నిరసన ప్రదర్శన నిర్వహించింది.

మహిళలపై హింస

తీవ్ర మానవహక్కుల సమస్య

ఐరాస ప్రధాన కార్యదర్శి గుటెర్రస్



ఐరాస : మహిళలపై హింస ప్రపంచంలో అత్యంత తీవ్రమైన మానవ హక్కుల సమస్యగా ఉన్నదని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ అన్నారు. తనను మహిళల పక్షపాతిగా పిలవటాన్ని గర్వంగా భావిస్తానని ఆయన చెప్పారు. స్త్రీ, పురుషుల మధ్య సమానత్వాన్ని, మహిళల హక్కులను కాపాడేందుకు పురుషులంతా మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. మహిళలపట్ల వివక్ష ప్రజాసమూహాలను, సమాజాలను, సంస్థలను, కంపెనీలను, ఆర్థిక వ్యవస్థలను నష్టపరుస్తుందని గుటెర్రస్ అన్నారు. మహిళల, బాలికల మానవ హక్కులను కాపాడటం అత్యంత ముఖ్యమైన అంశమని చెప్పారు. ఈ సమస్యపై ప్రపంచమంతటా చర్చలు జరగాలని ఆయన అన్నారు. మహిళల హక్కుల రక్షణకు ఉద్యమాలు నిర్వహించాలన్నారు. పురుషాధిక్య ప్రపంచం, పురుషాధిక్య సంస్కృతి మారవలసిన అవసరం ఎంతైనావుందని గుటెర్రస్ చెప్పారు. మహిళలు ఆది శాస్త్రవేత్తలని, గణాంకవేత్తలని అయినప్పటికీ పరిశోధన అలాగే ఉద్యోగరంగాల్లో 30 శాతం మాత్రమే మహిళల ప్రాతినిధ్యం వుందని ఆయన చెప్పారు. మహిళలను, బాలికలను ఇంకా అణచివేస్తూనే ఉన్నారని గుటెర్రస్ అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో మహిళలు ఎంతో శ్రమ చేస్తారు. అయితే ఆ ప్రాంతాలలో లేదా పట్టణ ప్రాంతాలలో ఉండే స్త్రీ, పురుషులకంటే వారి పరిస్థితి దారుణంగా ఉంటుంది. 13 శాతం భూములు మాత్రమే మహిళల పేరుతో ఉన్నాయి. ప్రపంచమంతటా మహిళలకు, పురుషులకు చెల్లించే వేతనాల్లో 23 శాతం అంతరం ఉంది. ఇదే గ్రామీణ ప్రాంతాల్లో వ్యత్యాసం 40 శాతం ఉందని గుటెర్రస్ అన్నారు.

జర్మనీలో పాలనకు ప్రాధాన్యతల గుర్తింపు

బెర్లిన్ : ఎన్నికలు జరిగిన 6 నెలల తరువాత జర్మనీలో మూడుపార్టీల కూటమి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడనున్నది. క్రిస్టియన్ డెమోక్రటిక్ యూనియన్ (సిడియు), క్రిస్టియన్ సోషల్ యూనియన్ (సిఎస్‌యు), జర్మన్ సోషల్‌డెమోక్రటిక్ పార్టీ (ఎస్‌పిడి) కలిసి ప్రభుత్వం ఏర్పాటుచేయాలని నిర్ణయించిన తరువాత తాజాగా పరిపాలనకు సంబంధించి ముఖ్యమైన ప్రాధాన్యతలను గుర్తించారు. ఈ ప్రాధాన్యతలకు సంబంధించిన ఒప్పందంపైన సంతకం చేసిన తరువాత ప్రభుత్వం ఏర్పాటుకు పూనుకుంటారు. లాంఛనంగా ప్రభుత్వ ఏర్పాటు ఉంటుందని ఛాన్సలర్ ఏంజిలామర్కెల్ తెలియజేశారు. విధానపరమైన ప్రతిపాదనల జాబితాకూడా ముఖ్యమైన ప్రాధాన్యతల పత్రంలో భాగంగానే వేగంగా అమలుచేయడానికి నిర్ణయించామని మర్కెల్ తెలిపారు. 6 నెలలుగా మర్కెల్ వివిధ పార్టీలతో సమావేశమై ఎట్టకేలకు సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుకు విజయం సాధించారు.

9 మంది జవాన్లు మృతి

(మొదటిపేజీ తరువాయి)



మనోరంజన్ లక్రా, జితేంద్రసింగ్, షోబిత్‌కుమార్ శర్మ, లక్ష్మణ్, మనోజ్‌సింగ్, దర్మేంద్రసింగ్, హెచ్‌ఎస్ చంద్ర ఉన్నారు. మడకం కుమార్, రాజేష్ కుమార్‌లకు తీవ్రగాయాలయ్యాయి. వీరిని చికిత్స కోసం హెలీకాప్టర్ ద్వారా రాయ్‌పూర్ తరలించారు. ఈనెల 5 వతేదీన తెలంగాణ రాష్ట్ర జయ శంకర్ జిల్లాలో తొండపాల్ అడవీ ప్రాంతంలో పదిమంది మావోయిస్టులను గ్రేహౌండ్ బలగాలు హతమార్చారు. ఈ ఘటనలో సునీల్ అనే జవాను కూడా మృతిచెందాడు. ఈ ఎన్‌కౌంటర్‌కు నిరసనగా మావోయిస్టులు ఈ నెల 9వ తేదీన చత్తీస్‌గడ్, తెలంగాణా రాష్ట్రాల బంద్‌కు పిలుపునిచ్చారు. మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో బంద్ విజయవంతం అయింది. నాటి నుండి ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్న మావోయిస్టులు మంగళవారం మెరుపు దాడి చేసి మందుపాతర పేల్చారు. ఈ ఘటనా నంతరం చత్తీస్‌గడ్‌లోని బీజాపూర్, సుక్మా తదితర జిల్లాల్లో విస్తృతంగా కూబింగ్ నిర్వహిస్తున్నారు. మృతదేహాలను రాజధాని రాయ్‌పూర్‌కు తరలించే ఏర్పాట్లు చేశారు. ఈ ఘటన పట్ల చత్తీస్‌గడ్ ముఖ్యమంత్రి రమణ్ సింగ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

ఐక్యమవుదాం

(మొదటిపేజీ తరువాయి)

చేస్తోందని విమర్శించారు. హోదా కోసం మొదట్నుంచి ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యాన తాము దశల వారీగా ప్రజా ఉద్యమాల్ని నిర్వహిస్తున్నామన్నారు. నాలుగేళ్ల నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచుతున్నామని చెప్పారు. టీడీపీకి చిత్తశుద్ధి వుంటే ఎన్డీయే నుంచి వైదొలగాలని కోరారు. ఈ దిశగా టీడీపీపై రాష్ట్ర ప్రజలు ఒత్తిడి తేవాలని అన్నారు. ఢిల్లీలో ఎంపీలు ప్లకార్డులు చేబూని హడావుడి చేయడం వల్ల ఫలితం లేదన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యాన ఈ నెల 19న విజయవాడలో నిర్వహించనున్న రౌండుటేబుల్ సమావేశానికి పార్టీలకు అతీతంగా తరలిరావాలని రామకృష్ణ కోరారు. మేధావులు ఫోరం ప్రతినిధి ప్రొఫెసర్ శర్మ మాట్లాడుతూ, రాష్ట్రానికి 11 ఉన్నత విద్యా సంస్థల్ని కేటాయించి, ఇంతవరకూ ప్రకటించలేదని అన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ కేటాయింపుల్లో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రజలంతా ఏకమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాలని కోరారు.

ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎయిమ్స్, నిట్‌కు రాష్ట్రంలో స్థలాలు కేటాయించినప్పటికీ అక్కడ భవన నిర్మాణ పనులు కొనసాగలేదన్నారు. హోదా ఉద్యమంలో ఎవరైతే కలసి ఉద్యమించరో..వారిని బహిష్కరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పార్లమెంటు సమావేశాల్లోగా హోదా, విభజన హామీల అమలును ప్రకటించాలని కోరారు. లేకుంటే ఉద్యమంతో సత్తా చూపుతామని చలసాని శ్రీనివాస్ కేంద్రాన్ని హెచ్చరించారు.

సినీహీరో శివాజీ మాట్లాడుతూ, పార్లమెంటు సమావేశాల్లోగా ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలును ప్రకటించకుంటే అమరావతి కేంద్రంగా ఆమరణ నిరహార దీక్షకు దిగుతానని చెప్పారు. తనతోపాటు ప్రొఫెసర్లు సదాశివరావు, జి.అప్పలనాయుడు, రిటైర్డు న్యాయమూర్తి గుర్రప్ప తదితరులు దీక్ష చేపడతారని తెలిపారు. రాష్ట్రం నుంచి పన్నులను కేంద్రం తీసుకుంటూ హోదా, విభజన హామీల్ని ఎందుకు అమలు చేయట్లేదని ప్రశ్నించారు. ఏపీకి ఇంత అన్యాయం జరుగుతున్నా ఇంకా కేంద్రంలోని బీజేపీతో కొందరు దోస్తీతో వుండటం తగదని, వారికి ప్రజలు సమాధి కడతారని హెచ్చరించారు. ఇది రాష్ట్ర ప్రజలందరి సమస్యనీ, రాబోయే తరాలకు అన్యాయం చేయొద్దని కోరారు. సాధన సమితి విజయవాడ నగర కన్వీనర్ దోనేపూడి శంకర్ మాట్లాడుతూ, ఎన్డీయే నుంచి టీడీపీ వైదొలగాలని, ప్రత్యేక హోదా ఉద్యమంలో సీఎం చంద్రబాబు ప్రత్యక్షంగా పాల్గొనాలని కోరారు.

దిగొచ్చిన ఎస్‌బీఐ

(మొదటిపేజీ తరువాయి)

రూ. 15(జీఎస్‌టీ కాకుండా) చొప్పున, సెమీ-అర్బన్ అయితే రూ. 12(జీఎస్‌టీ కాకుండా), గ్రామీణ ప్రాంతాల్లోని ఖాతాలకైతే రూ. 10(జీఎస్‌టీ లేకుండా) చొప్పున వసూలు చేయనున్నట్లు ఎస్‌బీఐ ఓ ప్రకటనలో తెలిపింది. సవరించిన ఛార్జీలు ఏప్రిల్ 1. 2018 నుంచి అమల్లోకి రానున్నట్లు వెల్లడించింది.

కనీస నిల్వలపై ఛార్జీల పేరుతో ఎస్‌బీఐ రూ.వేల కోట్ల ఆదాయాన్ని గడిస్తోందంటూ ఇటీవల విమర్శలు వెల్లువెత్తిన విషయం తెలిసిందే. ఆ బ్యాంకు ఛార్జీల ద్వారా కేవలం ఎనిమిది నెలల్లోనే రూ. 1,771 కోట్లు గడించిందని కొందరు ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఛార్జీలను తగ్గిస్తూ ఎస్‌బీఐ తాజాగా నిర్ణయం తీసుకుంది.

నైపుణ్యం కరవు

(మొదటిపేజీ తరువాయి)

ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ జాతీయ విధానం క్రింద శిక్షణ ఇచ్చారు.

ఒక ప్రాంతంలేదా రాష్ట్రం అభివృద్ధిని, పురోగతిని సాధించాలంటే..వివిధ రంగాలలో నైపుణ్యశిక్షణ ఇవ్వడం ఎంతైనా అవసరం. ఐటి కంపెనీలలోనూ నిపుణుల కొరత ఉందని చెబుతున్నారు. రోజురోజుకూ సాంకేతికలో మార్పులు రావడంతో నూతన పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోలేని వారు వెనుకబడిపోతున్నారు. 2016 నుండి 2020వరకు ప్రధానమంత్రి కౌశల్ వికాస్‌యోజన పథకం క్రింద స్వల్పకాలిక శిక్షణను 60లక్షలమందికి ఇవ్వాలని తలపెట్టారు. అయితే ఇంతవరకు ప్రభుత్వం తలపెట్టిన లక్ష్యంలో 25శాతం మాత్రమే నెరవేరిందనీ ఆయా రాష్ట్ర ప్రభుత్వాలద్వారా కేంద్రం ఈ పథకాన్ని అమలుచేస్తోంది. ఈ పథకం క్రింద వాస్తవంగా ఆంధ్రప్రదేశ్ 64,608 మంది యువతకు శిక్షణ ఇచ్చేందుకు రూ.94.74కోట్ల ను ఏపీకి కేటాయించింది. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అంచనాప్రకారం, 24 అత్యధిక ప్రాధాన్యత గల రంగాలలో 2020నాటికి దాదాపు 58కోట్ల మంది నిపుణుల గల సిబ్బంది అవసరముంటుంది. అయితే ఆ నాటికి పదిరంగాలలో 80శాతం మంది సిబ్బంది అవసరం కావచ్చునని కూడా అంచనా..

ఆధార్ అనుసంధానానికి బ్రేక్

(మొదటిపేజీ తరువాయి)

రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం ఈ తీర్పు వెలువరించింది.

పలు సంక్షేమ పథకాలు, సేవలకు ఆధార్ అనుసంధానాన్ని తప్పనిసరి చేస్తూ గతేడాది కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అయితే దీనిపై కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆధార్ అనుసంధానం విశ్వసనీయం కాదని పేర్కొంటూ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై గతంలో విచారణ చేపట్టిన న్యాయస్థానం ఆ తర్వాత వీటిని రాజ్యాంగ ధర్మాసనానికి అప్పగించింది. గతేడాది డిసెంబరులో జరిగిన విచారణ సమయంలో ఆధార్ అనుసంధాన గడువును మార్చి 31వరకు పెంచుతామని కేంద్రం న్యాయస్థానానికి తెలిపింది.

అయితే, తాజాగా మరోసారి విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. ఆధార్ గడువును నిరవధికంగా పొడగించింది. దీనిపై కోర్టు తీర్పు వెల్లడించేంతవరకు గడువును పెంచుతున్నట్లు స్పష్టం చేసింది.

అప్పటిదాకా మొబైల్ నంబర్లు, బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం తప్పనిసరేం కాదని తెలిపింది. అయితే సంక్షేమ పథకాలు, సేవలు, రాయితీలకు మాత్రం ఆధార్‌ను తప్పనిసరిగా అనుసంధానించాలని.. ఆ నిబంధన కొనసాగుతుందని పేర్కొంది.

ఇదీ లోకం!



పేట్రేగిన పెత్తందార్లు

(మొదటిపేజీ తరువాయి)

కారణమయ్యింది. గ్రామానికి చెందిన దళిత వర్గానికి రాజు అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన పెత్తందారులు ఆటోలోనే రాడ్డుతో దాడిచేసి గాయపరిచారు. అనంతరం ఆటో గ్రామానికి చేరుకున్న తరువాత విషయం బయటకు పొక్కడంతో గ్రామస్తులు రెండు వర్గాలుగా విడిపోయారు. పెత్తందారులంతా కలిసి దళిత వాడకు చెందిన బూర సతీష్‌కుమార్, బూర సంతోష్‌కుమార్, బూర రమణమ్మ, నిక్కి రాము, బూర కొండమ్మ, సొంత్యాన శివలపై దాడి చేశారు. దొరికినవారిని దొరికినట్టు చితకబాదారు. మహిళలను సైతం విడిచిపెట్టలేదు. రమణమ్మ దుస్తులను చించేశారు. శివను రాళ్లతో కొట్టి గాయపరిచారు. సతీష్‌కుమార్‌ను చెట్టుకు కట్టి మరీ కొట్టారని బాధితులు బావురుమంటున్నారు. ఈ దాడి కారణంగా పలువురికి తీవ్రంగా గాయాలయ్యాయి. అనంతరం బాధితులను జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామి అనుచరులుగా చెప్పబడుతున్న గొర్లె శ్రీను తన సహచరులు అల్తి శ్రీను, గొర్లి రాములు, గొర్లి సత్యవతమ్మ, తాడివాడ పైడిరాజు,నడిపేన రామునాయుడు ఈ దాడికి దిగినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. కాగా దాడి అనంతరం మంగళవారం దళితులపట్ల గ్రామంలో తీవ్ర వివక్ష కొనసాగుతోంది. వారికి పాలు, కిరాణా సామాన్లు సైతం విక్రయించకుండా పెత్తందారులు నిర్భంధం విధించినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. బాధితులను ఆసుపత్రికి తరలించిన అనంతరం గ్రామంలో పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేశారు. ఈ దాడి సంఘటన తెలిసిన వెంటనే దళిత హక్కుల పోరాట సమితి నాయకులు గోక రమేష్‌బాబు,ఎపి గిరిజన సమాఖ్య నాయకులు తుమ్మి అప్పలరాజుదొర, మాలమహానాడు నాయకులు లోగిశ రామకృష్ణ తదితరులు గ్రామాన్ని సందర్శించి సంఘటనకు కారణాన్ని తెలుసుకున్నారు. ఈ దాడిని వివిధ కుల, ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండించాయి.

నిలువెత్తు నిర్లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

రాజధాని అమరావతికి ఇచ్చినట్లు చూపిస్తున్నారు. యుటిలైజేషన్ సర్టిఫికేట్లు ఇచ్చినా ఇవ్వలేదన్నట్లు ప్రకటనలు ఇచ్చి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ఇస్తున్న సాయం నామమాత్రంగా ఉంది.రాష్ట్రం పట్ల కేంద్రం అవలంబిస్తున్న ఈ నిర్లక్ష్య ధోరణిని శాసనసభ తీవ్రంగా ఖండిస్తోంది.పోలవరం మన రాష్ట్రానికి జీవనాడి. మన ప్రజల చిరకాల స్వప్నం. ఏడు ముంపు మండలాలను మనకు బదలాయించిన తర్వాత కేంద్రం నుంచి అందాల్సిన సాయం మందగించడం దురదృష్టకరమని శాసనసభ భావిస్తోంది. మనం ఖర్చు చేసిన సుమారు రెండున్నర వేల కోట్ల రూపాయలకు పైగా మొత్తం కేంద్రం నుంచి ఇంకా రావాల్సి ఉంది.పదునాల్గవ ఆర్థిక సంఘం సిఫార్సుల దరిమిలా ప్రత్యేక హోదా ఇవ్వడం సాధ్యం కాదని, ఇప్పుడు హోదా కలిగి ఉన్న రాష్ట్రాలకు కూడా కొనసాగించబోమనీ కేంద్రం చెప్పింది. హోదా బదులు దానికి సరిసమానమైన ప్రయోజనాలు కలిగించే ప్రత్యేక సహాయాన్ని ఇస్తామన్నారు. అయితే ఈ ప్రత్యేక సహాయం నుంచి మన రాష్ట్రానికి రావాల్సిన నిధులు పెద్దగా రాకపోగా, ప్రత్యేక హోదా రాష్ట్రాలకు పన్ను రాయితీలు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు కొనసాగిస్తున్నారు. పదునాల్గవ ఆర్థిక సంఘం రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇవ్వద్దంటూ ఎక్కడా చెప్పలేదనీ, అది తమ పరిధిలోని అంశం కాదనీ ఆ సంఘం అధ్యక్షులు, సభ్యులు బహిరంగంగా చెప్పారు. ప్రత్యేక హోదా ఇవ్వద్దని ఆర్థికసంఘం చెప్పనప్పుడు, రాయితీలు ప్రోత్సాహకాలు ప్రస్తుత హోదా రాష్ట్రాలకు కొనసాగిస్తున్నపుడు మన రాష్ట్రానికి ఎందుకు నిరాకరిస్తున్నారని కేంద్రాన్ని ఈ శాసనసభ ప్రశ్నిస్తోంది.చట్టంలో పేర్కొన్న అంశాలు, రాజ్యసభలో ఇచ్చిన హామీల అమలు అసంపూర్తిగా, ఆలస్యంగా జరగడం పట్ల రాష్ట్ర ప్రజానీకం తీవ్ర ఆగ్రహంతో ఉంది. రాష్ట్ర ముఖ్యమంత్రి 29 సార్లు ఢిల్లీ వెళ్లి ఈ విషయాలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి పదేపదే తీసుకువెళ్లినా కేంద్రం ఉదాసీనత ప్రదర్శించింది. రాష్ట్రానికి చట్టపరంగా దక్కాల్సిన అంశాల పట్ల కేంద్ర ప్రభుత్వంలోని బాధ్యతాయుత స్థానాల్లో ఉన్నవారు హేళనగా మాట్లాడడాన్ని ఈ శాసనసభ తీవ్రంగా పరిగణిస్తోంది.కేంద్రానికి రాష్ట్రం పట్ల బాధ్యత ఉంది. మరీ ముఖ్యంగా రాష్ట్ర ప్రజల అభీష్టానికి విరుద్ధంగా, అన్యాయంగా విభజన జరిగి కష్టాలలో ఉన్న మన రాష్ట్రం పట్ల ఆ బాధ్యత మరింత ఎక్కువ. మనం నిలదొక్కుకుని, దక్షిణ భారతంలోని ఇతర రాష్ట్రాలతో సమానంగా ఎదిగేంత వరకు కేంద్రం చేయూత అందించాలి. చట్టంలో లేనివీ, పార్లమెంటు సాక్షిగా ప్రధాని ఇచ్చిన హామీలలో లేనివీ మనం అడగడం లేదు. మనవి చట్టబద్ధమైన డిమాండ్లనీ, న్యాయమైన కోరికలనీ కేంద్రం గుర్తించి వ్యవహరించాలని కోరుతూ శాసనసభ తీర్మానించింది. కాగా అప్పటివరకు కేంద్ర ప్రభుత్వ సహకారం వల్లే రాష్ట్రప్రభుత్వం డబుల్‌డిజిట్ సాధించిందని, కేంద్రం అన్నివిధాలా సహకరించిందని ఊదరగొట్టిన బీజేపీ ఎమ్మెల్యేలు తీర్మానం ఆమోద సమయంలో నిశ్శబ్దంగా కూర్చుండిపోయారు.

హోదా ముమ్మాటికీ సెంటిమెంటే !

(మొదటిపేజీ తరువాయి)

డిపాజిట్లు గల్లంతు చేశారన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని బీజేపీ నేతలను హెచ్చరించారు. ప్రత్యేక హోదాకు వచ్చే ప్రయోజనాలన్నీ ఇస్తామని హామీ ఇస్తేనే ఆనాడు ప్రత్యేక ప్యాకేజీకి ఒప్పుకున్నామని చెప్పారు. రాష్ట్రానికి సంబంధించి నా కంటే ఎక్కువగా ఎవరికీ తెలియదు. దేశంలోనే సీనియర్ రాజకీయ నేతల్లో నేనూ ఒకడిని. ఆర్థిక సంస్కరణల వల్ల లాభాలు వస్తాయని మొదటిసారిగా చెప్పింది నేనే. అలాంటి నాకు రాష్ట్ర ప్రయోజనాల గురించి తెలియదంటారా ? అంటూ బీజేపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విభజన హామీలపై బీజేపీ నేతలు అన్యాయంగా మాట్లాడుతున్నారు. 60ఏళ్లు కష్టపడి సంపాదించిన మీ ఆస్తి వేరెవరికో ఇచ్చేస్తే మీకు బాధ కలగదా? ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌ది అదే పరిస్థితి. అంటూ సభలో బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును చూస్తూ నిలదీశారు. ప్రత్యేక హోదా వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని చెప్పడం సరికాదు. హోదా ఉన్న రాష్ట్రాలకు ఏటా రాయితీలు, నిధులు ఇస్తున్నారు. విభజనతో నష్టపోయిన రాష్ట్రానికి అవి అవసరం లేదని బీజేపీ నేతలు భావిస్తున్నారా ? అని చంద్రబాబు ప్రశ్నించారు. రాష్ట్రం విభజన జరిగినప్పుడు మోదీ స్పందిస్తూ 'కాంగ్రెస్ ప్రభుత్వం బిడ్డకు జన్మనిచ్చి తల్లిని పురిట్లోనే చంపేసింది. మేం అధికారంలో ఉంటే రెండు రాష్ట్రాలకు సమాన న్యాయం చేసేవాళ్లం' అని వ్యాఖ్యానించిన పేపర్ క్లిప్పింగ్స్‌ను చదివి వినిపించారు. మరి మీరు అధికారంలోకి వచ్చాక ఏం చేశారు? మీరు చెప్పిన విషయాలనే మేం అడుగుతున్నాం, ఆ తల్లిని పట్టించుకోవాలని కోరుతున్నామని చెప్పారు. ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీసేలా కేంద్రప్రభుత్వ వైఖరి వుందని చంద్రబాబు మండిపడ్డారు.

కంటతడిపెట్టిన చంద్రబాబు

విభజనాంశాల అమల్లో కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని వివరిస్తున్న సమయంలో సీఎం చంద్రబాబు తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు.రాజధాని నిర్మాణంపై మాట్లాడుతూ ప్రధాని మోడీ స్వయంగా ఢిల్లీని తలదన్నే రాజధాని నిర్మాణానికి సహకరిస్తామని చెప్పారు. నాలుగేళ్ళలో కేవలం రూ.1500 కోట్లు ఇచ్చారు. రాజధాని కోసం రైతులు దాదాపు 40వేల కోట్ల విలువైన భూములిస్తే ప్రభుత్వాలుగా మనం చేసిందేంటి ? పైగా "రాజధాని అంటే డ్రీమ్ సిటీ అని హేళన చేస్తారా?. రాజధానికి సహకరించాల్సిన బాధ్యత కేంద్రానికి లేదా? ఆర్థికంగా బలంగా ఉన్న బెంగళూరు మెట్రోకు రూ.17వేల కోట్లు ఇచ్చారు.

ముంబై, బెంగళూరుకు నిధులిచ్చి ఏపీకి ఎందుకివ్వడం లేదు? అమరావతి రాజధాని నిర్మాణం పూర్తయితే కేంద్రానికే ఎక్కువ ఆదాయం. వాస్తవానికి ఇప్పుడున్న అసెంబ్లీ, సచివాలయం సరిపోతాయి. కాని పొరుగు రాష్ట్రాల కంటే గొప్పగా రాజధాని నిర్మించాలని, ఆంధ్రులు గర్వపడేలా వుండాలన్నది నా కల" అని చంద్రబాబు చెపుతూ కంట తడిపెట్టారు.

19తో ఇంటర్ పరీక్షలు పూర్తి

ఏప్రిల్ రెండో వారంలో ఫలితాల విడుదలకు కసరత్తు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ ఇంటర్మీడియట్ పరీక్షలు ఈ నెల 19వ తేదీతో ముగియనున్నాయి. పరీక్షల ఫలితాలను ఏప్రిల్ రెండో వారంలో ప్రకటించేందుకు అధికారులు కసరత్తు చేపట్టారు. ఫిబ్రవరి 28వ తేదీ నుంచి ఇంటర్ ఫస్టియర్, మార్చి 1వ తేదీన ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి.రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల్లో నిర్వహిస్తున్న పరీక్షలకు ప్రతిరోజూ 13వేల నుంచి 14వేల వరకూ విద్యార్థులు గైర్హాజరవుతున్నారు. ఎంసెట్, నీట్, డైట్‌సెట్ తదితర విద్యా పోటీ పరీక్షలను దృష్టిలో వుంచుకుని వేగవంతంగా పరీక్షా ఫలితాల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది.ఈ పరీక్షా ఫలితాల అనంతరం నెల రోజుల్లో ఇంటర్ ఇన్‌స్టెంటివ్ పరీక్షలను నిర్వహిస్తారు.ఇంటర్‌మీడియట్ కమిషనర్ వి.ఉదయలక్ష్మి పర్యవేక్షణలో పరీక్షా ఫలితాలను వేగవంతంగా విడుదల చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ఏపీ టెట్ తుది కీ విడుదల : 16న పరీక్షల ఫలితాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) ఫైనల్ కీను విడుదల చేశారు.ఫిబ్రవరి 21వ తేదీ నుంచి మార్చి 2వరకూ పేపర్ పేపర్-1,2,3 పరీక్షలను 190 కేంద్రాల్లో ఆన్‌లైన్లో నిర్వహించగా, మొత్తంగా 4,10,828 మంది(91.94శాతం) అభ్యర్థులు పరీక్ష రాశారు.ఈ నెల 4వ టెట్ పరీక్షల ప్రశ్నాపత్రాలు, ప్రాథమిక కీ వివరాలను వెబ్‌సైట్లో అందుబాటులో వుంచారు. ప్రాథమిక కీపై అభ్యంతరాలను 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ స్వీకరించగా, 16వేల అభ్యంతరాలు వచ్చాయి.వాటిన్ని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ పరిశీలించి సోషల్ స్టడీస్, గణితం ప్రశ్నాపత్రాలలో అభ్యంతరాలుగా గుర్తించిన ప్రశ్నలకు అదనపు మార్కులు కలిపారు.సెషన్ల వారీగా నిర్వహించిన టెట్ పేపర్-1,2,3 ప్రశ్నాపత్రాలు, కీ వివరాలను 'సిఎస్‌ఇ.ఎస్.ఇన్' వెబ్‌సైట్లలో అందుబాటులో వుంచారు.ఈ నెల 16వ తేదీన ఫలితాలను రాష్ట్ర మానవ వనరులశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు విడుదల చేయనున్నారు.టెట్ పరీక్షలలో అత్యధికంగా పేపర్-1(ఎస్జీటీ) పరీక్షకు అభ్యర్థులు హాజరయ్యారు.

స్థానికేతరులైన టీచర్లకు అంతర్‌రాష్ట్ర బదిలీల్లో అవకాశం

కల్పించాలని కోరుతూ సీపీఐ రామకృష్ణ సీఎంకు లేఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : స్థానికేతులైన టీచర్లకు అంతర్‌రాష్ట్ర బదిలీల్లో అవకాశం కల్పించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకి మంగళవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ లేఖ రాశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నిర్వహించిన డీఎస్సీల్లో టాప్-20 (అన్ రిజర్వ్‌డ్) కోటాలో వివిధ జిల్లాల్లో స్థానికేతర ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. రాష్ట్ర విభజనానంతరం స్పౌజ్, మ్యూచ్‌వల్ పోగా ఇరు రాష్ట్రాలకు చెందిన 645 మంది ఉపాధ్యాయులు కుటుంబాలకు దూరమై విధులు నిర్వర్తించవలసిన పరిస్థితి దాపురించింది. దీనికి తోడు ఆంధ్రాకి చెందిన 20కి పైగా వెనుకబడిన కులాలని తెలంగాణాలో ఓసీలుగా పరిగణించారు. ఫలితంగా వీరు రిజర్వేషన్లు కోల్పోయారు.అంతర్‌రాష్ట్ర బదిలీలు ఒక్క రాష్ట్రస్థాయి ఉద్యోగులకు తప్ప జిల్లా, జోనల్, మల్టీ జోనల్ వారికి వర్తించవన్న నిర్ణయం వలన జిల్లా కేడర్‌కి చెందిన ఉపాధ్యాయుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఆయా ఉపాధ్యాయులను వారి స్వరాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలకు స్థానికత ఆధారంగా పంపినట్లయితే వారి కుటుంబాలకు ఎంతో మేలు కలుగుతుంది.తెలంగాణా నుండి ఆంధ్రాకు 445 మంది, ఆంధ్రా నుండి తెలంగాణాకు 200 మంది ఉపాధ్యాయులు అంతర్ రాష్ట్ర బదిలీలకై ఎదురుచూస్తున్నారు. ఈనేపథ్యంలో వీరికి అంతర్ రాష్ట్ర బదిలీలకు అవకాశం కల్పించేందుకు తక్షణం చర్యలు చేపట్టాలని రామకృష్ణ కోరారు.



రేపటి నుంచి టెన్త్ పరీక్షలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ పదో తరగతి(ఎస్ఎస్‌సి) పరీక్షలు ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభమవుతాయి. ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకూ పరీక్షలు కొనసాగుతాయి. 2017-18 విద్యా సంవత్సరానికిగాను బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ ఆధ్వర్యాన నిర్వహించనున్న పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఏర్పాట్లు చేపట్టారు. డీఈవోల పర్యవేక్షణలో ప్రత్యేక అధికారులు, ఇన్విజిలేటర్లు, స్క్వాడ్‌లను నియమించారు.రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 6,36,831 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.గత ఏడాది 6.5లక్షల మంది పరీక్ష రాశారు.ప్రతిఏటా రెండు విడతలుగా ఎస్ఎస్‌సీ పరీక్షలను నిర్వహించనుంది.ఈ నెల 29వ తేదీతో పరీక్షలు పూర్తవుతాయి.పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల హాల్ టిక్కెట్లను, టైమ్ టేబుల్ వివరాలను 'బీఎస్‌సి.ఏపీ.గౌవ్.ఇన్'వెబ్‌సైట్లో అధికారులు అందుబాటులో వుంచారు.

24న 12వేల ఇళ్ల ప్రారంభం

- 15 నెలల్లో 5 లక్షల ఇళ్ల పూర్తి లక్ష్యం : శాసనసభలో మంత్రి నారాయణ



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్రంలో పట్టణ ప్రాంతాల్లోని నిరుపేదల కోసం నిర్మిస్తున్న ఇళ్లలో ఈనెల 24వ తేదీన 12,500 ఇళ్లను ప్రారంభిస్తున్నట్లు మున్సిపల్ శాఖమంత్రి పి.నారాయణ తెలిపారు. రానున్న 15 నెలల కాలంలో 5 లక్షల ఇళ్లను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా మంగళవారం జరిగిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో పట్టణాలు, నగరాలలో మౌలిక సదుపాయాలు అంశంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. పట్టణాలు, నగరాల్లో 29 శాతం మాత్రమే జనాభా ఉన్నారని, మిగిలిన జనాభా గ్రామీణ ప్రాంతాల్లోనే ఉంటున్నారని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో జి ప్లస్ 3 విధానంలో నిర్మించేందుకు భూ సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పేదలు నివాసం ఉండే ఇళ్లకు బాహ్య, అంతర్గత మౌలిక సదుపాయాలను కల్పించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షలకు అనుగుణంగా గృహ నిర్మాణాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. పలు పట్టణాలు, నగరాల్లో ప్రాథమిక సదుపాయాలను కల్పించేందుకు ప్రణాళికలను రూపొందించినట్లు సభ్యులకు వివరించారు. రాష్ట్రంలో పట్టణస్థాయి సంస్థల్లో రూ. 2887.04 కోట్లతో అమృత్ ప్రాజెక్టు కొనసాగుతోందన్నారు. అలాగే ఏఐఐబీ సమకూర్చిన రూ.3723.30 కోట్లతో నీటి సరఫరాలో సేవా స్థాయిలను పెంచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇక కీలక మౌలిక సదుపాయాల పెట్టుబడి ప్రణాళికగా రూ.10,742 కోట్లు, విశేష మౌలిక సదుపాయాల పెట్టుబడి ప్రణాళికగా రూ. 17,692 కోట్ల ప్రతిపాదనలతో పలు ప్రాజెక్టులను చేపడుతున్నట్లు మంత్రి వివరించారు.

ఇక తరచూ సమీక్షలు

గుంటూరులో తాగునీరు కలుషితం కావడంపై మంత్రి నారాయణ స్పందిస్తూ ఇక తరచూ సమీక్షలు నిర్వహిస్తామని సభకు హామీ ఇచ్చారు. 'గుంటూరు పట్టణంలో కలుషిత తాగునీరు' అంశంపై ఏపీ శాసనసభ కార్యవిధాన కార్యక్రమ నిర్వహణ నియమావళిలోని 344వ నియమం కింద సభలో ప్రస్తావించేందుకు ఎమ్మెల్యేలు నరేంద్రకుమార్, రాజేంద్ర ప్రసాద్, జీవీ ఆంజనేయులు ఇచ్చిన నోటీసును సభాపతి కోడెల శివప్రసాద్ అనుమతించారు. రాజధానికి 30 కిలోమీటర్ల దూరంలోని గుంటూరులో ఇటువంటి ఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరమని సభ్యులు పేర్కొన్నారు. తొలుత ఈ ఘటనపై స్పందించిన అధికార యంత్రాంగం ఎందుకు జరిగిందో అర్థంకావడంలేదని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడాన్ని తీవ్రంగా ఖండించారు. దశాబ్దాల క్రితం వేసిన పైప్‌లైన్ల స్థానంలో నూతన పైప్‌లైన్లను ఏర్పాటు చేయాలని సభ్యులు కోరారు. దీనిపై కోడెల స్పందిస్తూ తాగునీటి, మురుగునీటి పైపులైన్లు ఒకదానినొకటి దాటి వెళుతున్న ప్రదేశంలోనే నీరు కలుషితమైనట్లు స్పష్టమైందన్నారు. ఈ సంఘటన పర్యవేక్షణలోపం, నిర్లక్ష్యం వల్లే జరిగిందన్నారు. దీనిపై సీరియస్‌గా యాక్షన్ తీసుకోవడంతోపాటు మొత్తం వ్యవస్థను కౌన్సిలింగ్ చేయాలన్నారు.

ఒప్పంద ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి



విశాలాంధ్ర - అమరావతి : రాష్ట్రంలో ప్రస్తుతం ప్రధాన సమస్యలపై శాసన మండలిలో ప్రస్తావించినట్లు ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి చెప్పారు. అసెంబ్లీ మీడియా పాయింట్లో మంగళవారం ఆయన మాట్లాడుతూ జీఓ నెంబర్ 58, 38 అమలుచేయాలని డిమాండ్ చేస్తున్నానని, సభలో కూడా ఈ విషయం పై చర్చించినట్లు తెలిపారు. అయితే ఈ విషయమై హెచ్‌ఆర్డీ మంత్రి గంటా శ్రీనివాసరావు జీవోలు అమలుచేస్తామని మాట ఇచ్చారని తెలిపారు. యూనివర్సిటీ, పాలిటెక్నిక్ కాలేజీలలో పని చేసే కాంట్రాక్టు లెక్చరర్‌లకు న్యాయం చేయమని మండలి ద్వారా కొరటం జరిగిందన్నారు.కాగా ఈ విషయంలో రేపు ఎమ్మెల్సీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని మంత్రి చెప్పారని వివరించారు. 25000 మంది సర్వ శిక్ష అభియాన్ సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామాలలో ఇళ్ళ స్థలాలు లేని పేదలకు భూమిని ప్రభుత్వం కొనుగోలు చేసి ఇవ్వాలని కోరగా, అందుకు మంత్రి అంగీకరించారని తెలిపారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.


అవినీతికి అంబాసిడర్ వైఎస్ జగన్..



విశాలాంధ్ర -అమరావతి : రాష్ట్ర సంక్షేమాన్ని సొంత ప్రయోజనాల కోసం తాకట్టు పెడుతున్న జగన్‌మోహన్‌రెడ్డి అవినీతికి బ్రాండ్ అంబాసిడరని ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ పచ్చ కామెర్లు వచ్చిన వాడికి లోకమంతా పచ్చగా కనబడుతుందని. విలన్ల కంటికి హీరోలు కూడా విలన్ల వలే కనబడుతారని ఎద్దేవా చేశారు. 2014 ఎన్నికల్లో జగన్ విలన్ కాబట్టి ప్రజలు చిత్తుగా ఓడించారని, చంద్రబాబు హీరో కాబట్టి ప్రజలు చంద్రబాబు ని గెలిపించారని అన్నారు. జగన్ అవినీతిలో కొత్త సిద్ధాంతాలు కనిపెట్టి 6 దేశాల్లో మనీ లాండరింగ్ నిర్వహించాడని మండిపడ్డారు. ఈ రోజు హార్వార్డ్ యూనివర్సిటీ లో జగన్ అవినీతి పై పాఠాలు భోదిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ దక్షిణాది రాష్ట్రాలకి రావలసిన నిధులను ఉత్తరాధి రాష్ట్రాలకు మళ్లిస్తుందని, దక్షిణాది రాష్ట్రాల నోట్లో మట్టి కొడుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. రైల్వే జోన్ విభజన చట్టం లో స్పష్టంగా ఉన్నప్పటికి కేంద్రం అధికారులచేత ఇవ్వటం కుదరదని చెప్పిస్తుందని విమర్శించారు. అవినీతి పరుడైన జగన్ కి మోడీ రెడ్ కార్పెట్ వేసి స్వాగతం పలుకుతున్నారని ఆరోపించారు. 29 సార్లు చంద్రబాబు ఢిల్లీ వెళ్లినా ప్రధానిని కలిసేందుకు అవకాశం ఇవ్వని పరిస్థితి ఉండటం దేనికి సంకేతమని ప్రశ్నిం చారు. బీజేపీ తో జగన్ రహస్య ఒప్పందం కుదుర్చుకున్నారని, జగన్ అండ చూసుకుని కేంద్రం రాష్ట్రానికి మొండి చేయి చూపించిందని ధ్వజమెత్తారు. రాష్ట్ర సంక్షేమం కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి ప్రజల మద్దతు ఎప్పుడు ఉంటుందని వెల్లడించారు.

ఆటోలు, ట్రాక్టర్లకు లైఫ్‌టాక్స్ యోచన

శాసనసభలో మంత్రి అచ్చెన్నాయుడు



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్రంలో ఆటోరిక్షాలు, ట్రాక్టర్లకు లైఫ్‌టాక్స్ విధానాన్ని అమలు చేయాలని యోచిస్తున్నట్లు రవాణాశాఖమంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా మంగళవారం జరిగిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, వెలగపూడి రామకృష్ణబాబు స్వల్ప వ్యవధి ప్రశ్నలో ఆటోడ్రైవర్ల సమస్యలను లేవనెత్తారు. వాహనాల ఫిట్‌నెట్‌కు సంబంధించి సర్టిఫికెట్ లేకపోవడం వల్ల రోజుకు రూ. 50ల చొప్పున పెనాల్టీ విధిస్తుండడంతో అనేక మంది ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొన్ని సందర్భాల్లో నెలకు రూ.1500 వరకూ చెల్లించుకోవాల్సి వస్తోందన్నారు. ఒకప్పుడు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌కు రూ. 330లు వసూలు చేసేవారని, దీనినిన రెట్టింపు చేయడంలో ఆటోడ్రైవర్లకు భారంగా మారిందన్నారు. కేంద్రం ఇచ్చిన మెమో 184/3 ప్రకారం ఆయా రాష్ట్రాలు భారం అనిపిస్తే తగ్గించవచ్చనే వెసులుబాటును కల్పించిందన్నారు. ఈ ప్రకారం ఫిట్‌నెస్ ఫీజు తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కర్ణాటక, తెలంగాణ ప్రభుత్వాలు ఇప్పటికే ఈ ఫీజులను తగ్గించిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే చదువుకోని డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్ ఇచ్చే విధానంలో పదవ తరగతి పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలనే నిబంధన స్థానంలో చదవడం,రాయడం తెలిసుంటే చాలనే నిబంధన విధించాలని కోరారు. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ.. పెనాల్టీల విషయమై ఇప్పటికే రవాణాశాఖ కమిషనర్ నేతృత్వంలో కమిటీ వేసామని. కమిటీ అందచేసిన నివేదికను ఆర్థికశాఖకు పంపించామన్నారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తప్పనిసరిగా చర్యలు చేపడుతుందన్నారు. ఆటోలు, ట్రాక్టర్లకు లైఫ్‌టాక్స్ విధించే విషయమై కూడా త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు.

జనజీవనజ్యోతి' ద్వారా 14.24 లక్షల ఎస్సీలకు లబ్ధి

రాష్ట్రంలో 'జనజీవనజ్యోతి' కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల 74 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ వాడకం ద్వారా 14.24 లక్షల మంది ఎస్సీలు లబ్ధిపొందుతున్నారని మంత్రి కాల్వ శ్రీనివాసులు తెలిపారు. ఉచిత గృహ సంబంధిత విద్యుత్ వినియోగం అంశంపై స్వల్ప వ్యవధి ప్రశ్నను వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రశ్నించారు. ఎస్సీలకు కులధృవీకరణ పత్రాలు ఇవ్వడంలో జాప్యం జరుగుతున్నందున సమస్యను పరిష్కరించాలన్నారు. పాత బకాయిల పేరుతో కొన్ని చోట్ల ఉచిత విద్యుత్‌ను వినియోగించుకున్న ఎస్సీలను అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ ఎస్సీలకు ఉచిత విద్యుత్‌ను ఇవ్వడంతో ప్రభుత్వంపై రూ. 206 కోట్లు భారం పడుతోందన్నారు.

విశాఖకు రైల్వే జోన్ ఇవ్వాల్సిందే..



విశాలాంధ్ర -అమరావతి : విభజన హామీలు అమలు చేసి రాష్ట్ర ప్రయోజనాలకి కేంద్రం సహకరించాలని ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్లో మంగళవారం మాట్లాడుతూ విభజన హామీ లను అనుసరించి విశాఖకు రైల్వే జోన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జగన్ మోహన్ రెడ్డి తన పాదయాత్రలో చంద్రబాబుని విమర్శి స్తున్నాడు గానీ, ప్రధాని మోడీని విమర్శించటం లేదని, కారణం వారిది చీకటి ఒప్పందం కాబట్టి అని విమర్శిం చారు. దేశంలోనే అత్యున్నత వ్యక్తి చంద్రబాబుని కొనియా దారు. చంద్రబాబుని టార్గెట్ చేస్తూ, రాష్ట్రానికి నిధులు రాకుండ కేంద్రం కుటిల యత్నాలు చేస్తుందని మండి పడ్డారు. మోడీ ఎందుకు కక్ష సాధింపు చర్యలు చేస్తు న్నారని ప్రశ్నించారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి అయిన చంద్రబాబుకి సమయం కేటాయించలేని ప్రధాని, ఆర్థిక నేరస్తులకు తనని కలిసేందుకు సమయం ఇవ్వటం శోచనీయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశం లో మైనార్టీ పక్షాన నిలిచి వారి సంక్షేమానికి కృషి చేస్తున్న ఏకైక నాయకుడు చంద్రబాబు అని కొని యాడారు. చంద్రబాబుకి 97 లోనే ప్రధాన మంత్రి అయ్యే అవకాశం వచ్చిందని, దానిని కాదను కొని తెలుగు ప్రజల కోసం ఆయన రాజకీయ జీవితాన్ని త్యాగం చేశారని చెప్పారు. వైసీపీ పార్టీ వైఎస్సార్ పార్టీ అనే పేరు కన్నా వైఎస్సార్ బీజేపీ, అని పేరు పెట్టుకుంటే బాగుండేదని ఎద్దేవా చేశారు. బీజేపీ, వైసిపి చీకటి ఒప్పందాలు ఎవరికీ తెలియనివి కావని వ్యాఖ్యానించారు. ఆటలో అరటి పండులా ఉనికిని కాపాడుకునేందుకు వైసీపీ ఇలా ప్రవర్తిస్తుందని విమర్శించారు. ప్రజల మనోభావాలతో రాజకీయం చేస్తున్న రాజకీయ పార్టీలకు త్వరలో ప్రజలు చరమ గీతం పాడుతారని అన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ప్రధాన లక్ష్యమని వెల్లడించారు.

స్టాన్ ఫోర్ట్ ఇన్నోవేషన్ ఫెలోస్ పోగ్రామ్‌కు 57 మంది తెలుగు విద్యార్థులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమెరికాలోని ప్రతిష్టాత్మక స్టాన్ ఫోర్ట్ యూనివర్శిటీ ఇన్నోవేషన్ ఫెలోస్ పోగ్రామ్‌కు ఈ ఏడాది రాష్ట్రం నుంచి 57 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ మంగళవారం ప్రకటించింది.స్టాన్‌ఫోర్ట్ యూనివర్శిటీ హస్సోప్లాటర్న్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (డీస్కూల్) నిర్వహించే యూనివర్శిటీ ఇన్నోవేషన్ ఫెలోస్‌కు కార్యక్రమానికి (యూఐఎఫ్) ప్రపంచ వ్యాప్తంగా 9 దేశాల్లోని 64 మంది ప్రతిష్టాత్మక సంస్థల నుంచి 258 మంది విద్యార్థులు హాజరవుతారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 మంది ఇంజనీరింగ్ కళాశాలల నుంచి విద్యార్థులను ఎంపిక చేసి 6 వారాలపాటు శిక్షణ ఇచ్చారు.వారంతా మరో రెండు రోజుల్లో కొనసాగే సిలికాన్ వాలీ మీటప్‌లో పాల్గొని. వివిధ కార్యక్రమాలకు హాజరవుతారు.

రాష్ట్రాన్ని మోసం చేసిన కేంద్రం..

విశాలాంధ్ర - అమరావతి : రాష్ట్ర ప్రయోజనాలకు కేంద్రం ఏ మాత్రం సహకరించకపోవటం వారి ధోరణిని తెలియచేస్తుందని అమలాపురం ఎమ్మెల్యే ఐతా బత్తుల ఆనందరావు విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్లో మంగళవారం ఆయన మాట్లాడుతూ రాజధాని శంకుస్థాపనకు వచ్చిన మోడీ మట్టి నీళ్లు తీసుకు వచ్చిన వేళ మోసం గ్రహించలేకపోయామని వ్యాఖ్యానించారు. బీజేపీ తన మ్యానిఫెస్టోలో రైల్వేజోన్, ప్రత్యేక హోదా ఇస్తానని హామీలు ఇచ్చి నేడు తన అసలు స్వరూపం బయట పెట్టిందని విమర్శించారు. కమలానికి చివరికి మిగిలేది, రాలిపోయిన రేకులు, కాండం మాత్రమేనని ఎద్దేవా చేశారు. విభజన చేసిన కాంగ్రెస్‌ని తెలుగు ప్రజలు ఏ విధంగా భూ స్థాపితం చేశారో రాబోవు రోజుల్లో బీజేపీని అదే విధంగా భూస్థాపితం చేయటం ఖాయమని ఎద్దేవాచేశారు.

ప్రత్యేక హోదా సాధనే వైసీపీ లక్ష్యం..

విశాలాంధ్ర - అమరావతి : రాష్ట్ర ప్రయోజనాలే ప్రధమావదిగా వైఎస్ జగన్ నేతృత్వంలో తన వంతు కృషిచేస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్లో మంగళవారం ఆయన మాట్లాడుతూ రాజ్యసభ నామినేషన్ పరిశీలనకు వచ్చామని చెప్పారు. రాజ్యసభ సభ్యునిగా గెలుపు లాంఛనమేనని 23 వతేదీన అధికారంగా ప్రకటిస్తారని తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించిన జగన్‌కి ఎప్పుడు రుణ పడి ఉంటానని చెప్పారు. ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియ చేస్తున్నానని అన్నారు. నాకు అప్పగించిన బాధ్యతకు నేను నాయ్యం చేస్తానని తెలిపారు. వైఎస్సార్ పార్టీ ప్రజాఅభిప్రాయాలకు అనుగుణంగా నడుస్తుందని చెప్పారు. జగన్ చేస్తున్న సంకల్పయాత్ర చాలా కష్టమైనదని, మాములు మను షులు ఎవరు అలాంటి యాత్ర చేయలేరని అన్నారు. ప్రత్యేకహోదా కోసం జగన్ పోరాటం చేస్తున్నారని, ఈ పోరాటంలో రాజ్యసభ సభ్యుడుగా నేను సైతం భాగస్వామిగా ఉండి రాష్ట్ర సంక్షేమం కోసం కృషి చేస్తానని వివరించారు. రాజ్యసభ సభ్యుడుగా నా ముందున్న ప్రధాన లక్ష్యం మా రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించటమేనని ఈ సందర్భంగా ఆయన స్పష్టంచేశారు. వేమిరెడ్డి వెంట వైసీపీ శాసన సభ్యులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ఉన్నారు.

చలసానికి బిట్స్ ఫిలానీలో డాక్టరేట్



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు చలసాని వెంకట రామారావు కుమారుడు అజయ్‌ఘోష్ బిట్స్ పిలానీలో డాక్టరేట్ అందుకున్నారు. బయాలజీలో 'యాంటీ మైక్రోబియల్ కాంపౌండ్స్' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రధానం చేశారు. వైద్య రంగంలో మర్సా(ఎం.ఆర్.ఎస్.ఎ) ఇన్‌ఫెక్షన్స్ నివారణకు వినియోగించేందుకు గల అవకాశాలపై ఆయన విస్తృత పరిశోధన చేశారు. భవిష్యత్తులో దీనిని ఇంకా అభివృద్ధి చేయడం ద్వారా నూతన యాంటీ బయాటిక్‌గా వైద్య రంగంలో వినియోగించవచ్చని అజయ్‌ఘోష్ తెలిపారు.ప్రొఫెసర్ ఉత్పల్‌రాయ్ పర్యవేక్షణలో బిట్స్ ఫిలానీ, గోవా క్యాంపస్ కేంద్రంగా పరిశోధన సాగింది. అజయ్‌ఘోష్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని 'ఎక్సెల్‌రా నాలెడ్జి సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్'లో సీనియర్ రిసెర్చి అసోసియేట్‌గా పనిచేస్తున్నారు.కృష్ణాజిల్లా నూజివీడు మండలం వెంకటాద్రిపురం గ్రామంలో రైతు కుటుంబంలో జన్మించిన చలసాని అజయ్‌ఘోష్ నూజివీడు సెయింట్ అన్స్ స్కూలులో ప్రాథమిక విద్యను, తుక్కులూరులోని క్రియేటివ్ స్కూలు, వైజాగ్ రామకృష్ణ స్కూలు నందు హైస్కూలు విద్యను, శ్రీచైతన్య విజయవాడలో ఇంటర్మీ డియేట్, విజయవాడ లయోలా కాలేజీలో బయోటెక్నా లజీలో గ్రాడ్యుయేషన్, మద్రాసు యూనివర్సిటీ పరిధిలోని జయా కాలేజి (చెన్నై)లో బయోటెక్నాలజీలో పోస్ట్ గ్రాడ్యూషన్ విద్యను అభ్యసించారు. సీపీఐ సీనియర్ నాయకులు చలసాని జగన్నాధరావు వీరికి తాతగారు. కాగా తండ్రి చలసాని వెంకట రామారావు ప్రస్తుతం సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షునిగా పని చేస్తున్నారు. వీరి పెద తాత రాజగోపాలరావు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని జైలు జీవితం అనుభవించారు. బాబాయి చలసాని రాఘవేంద్రరావు విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షునిగా పనిచేస్తున్నారు. అనేక సామాజిక, రాజకీయ ఉద్యమాలలో వీరి కుటుంబం ప్రముఖపాత్ర వహించింది.

ఫిరాయింపుదారులకు..


హైకోర్టు నోటీసులు టీడీపీకి చెంపపెట్టు

తీర్పు వచ్చే వరకూ టీడీపీ ఆగకుండా రాజీనామాలు చేయించాలి : బొత్స సత్యనారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ నుంచి టీడీపీలోకి ఫిరాయించిన 23 మంది ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులివ్వడం ఆ పార్టీకి చెంపపెట్టులాంటిందని వైసీపీ రాష్ట్ర నేత బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. విజయవాడ వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాసన సభ ఔన్నత్యానికి భంగం కలిగిన నేపథ్యంలో నోటీసులు వచ్చా యని ఆయన స్పష్టం చేశారు. తీర్పు వచ్చే వరకూ ఆగకుండా ఫిరాయింపు ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు రాజీనామా చేయించాలని సూచించారు. వైసీపీ ఎమ్మె ల్యేలను సంతలో పశువులకన్నా హీనంగా టీడీపీ కొనుగోలు చేసిందని దుయ్యబట్టారు ఈ నెల 21వ తేదీన ఏపీకి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని అంశాలను అమలు చేయాలని డిమాండు చేస్తూ కేంద్రంపై అవిశ్వాసం తీర్మానాన్ని వైసీపీ ప్రవేశపెట్టనుందని వెల్లడించారు. టీడీపీకి చిత్తశుద్ధి వుంటే తాము ప్రవేశపెట్టబోయే అవిశ్వాసానికి మద్దతివ్వాలని కోరారు.గుంటూరులో అతి సారాతో మృతులు ప్రభుత్వ హత్యలేనని విమర్శించారు. ఈ సంఘటనపై రాష్ట్ర మున్సిపల్ మంత్రి నారాయణ పైనా, గుంటూరు మన్సిపల్ కమిషనర్లపైనా చర్యలు తీసు కోవాలని ఆయన డిమాండు చేశారు.ఎమ్మెల్యేల కొను గోలు, అవినీతిపై వున్న శ్రద్ధను ప్రజల ప్రాణాలపైనా, ఆరోగ్యంపైనా, పరిపాలనపైనా ప్రభుత్వం చూపట్లేదని ఎద్దేవా చేశారు.

సాగునీటి ప్రాజెక్టుల వ్యయం రూ. 11,291.80 కోట్లు

శాసనసభలో మంత్రి దేవినేని ఉమ



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్రంలో 2017-18 సంవత్సరానికిగాను సాగునీటి ప్రాజెక్టులకు రూ. 12,779.26 కోట్లను కేటాయించి రూ. 11,291.80 కోట్లను ఖర్చు చేసినట్లు జలవనరుల శాఖమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తెలిపారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా మంగళవారం ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 29.79 లక్షల ఎకరాలకు అదనంగా సాగునీటిని అందచేసినట్లు వివరించారు. అలాగే పోలవరం నిర్వాసితులకు పునరావాసం కల్పించడంపై వేరొక ప్రశ్నకు సమాధానంగా ఆయన మాట్లాడుతూ 2013 భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ చట్టం ప్రకారం పోలవరం సాగునీటి ప్రాజెక్టు వల్ల నష్టపోయిన ప్రజలకు 2014 జనవరి ఒకటో తేదీ నుంచి పునరావాసం కల్పించినట్లు తెలిపారు. నూతన చట్టం వచ్చిన తర్వాత సేకరించిన భూముల కోసం నూతన చట్టంలోని నిబంధనలు, సంబంధిత నియమాలు, మార్గదర్శకాల ప్రకారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలు, పరిహారాన్ని చెల్లిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టుకు 2013-14 సంవత్సరంలో ధరల స్థాయిలో 2014 ఏప్రిల్ 1వ తేదీ నాటికి ఉన్న మిగులు పనుల కోసం సవరించిన అంచనాను సీడబ్ల్యూసీకి సమర్పించినట్లు తెలిపారు. పోలవరం ప్రాజెక్టును ఎట్టిపరిస్థితుల్లో 2019 నాటిని పూర్తి చేసే విధంగా కార్యక్రమాన్ని రూపొందించినట్లు మంత్రి స్పష్టం చేశారు. కాగా కర్నూలుజిల్లా గాజులదిన్నె ప్రాజెక్టు గేట్ల నిర్వహణ కష్టంగా మారినందున నీరు-చెట్టు కార్యక్రమంలో భాగంగా మరమ్మతుల కోసం రూ. 19.60 కోట్లను కేటాయించినట్లు సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఇక రెండవ దశ ఎలిమెంట్లకు బదులుగా ఉంచేందుకు ఫ్యాబ్రికేషన్ స్టాప్ లాగ్ గేట్ ఎలిమెంట్ల నిర్మాణం కోసం డిజైన్లను రూపొందించినట్లు వివరించారు. సాగునీటి అంతరాన్ని భర్తీ చేసే క్రమంలో ఐఎన్‌బీఐజీ పథకం కింద ఈ ప్రాజెక్టును రూ. 128 కోట్ల వ్యయంతో ఆధునీకరించాలని ప్రతిపాదించినట్లు మంత్రి తెలిపారు.

స్టార్ రేటింగ్‌తో ప్రోత్సాహకర పోటీ: నారా లోకేష్

పట్టణలతో సమానంగా గ్రామాలను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం 10 స్టార్ రెటింగ్ ప్రాతిపదికన గ్రామాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖమంత్రి నారా లోకేష్ తెలిపారు. గ్రామాలు, జనవాసాలతో గ్రామ పంచాయితీ స్థాయిలో ప్రోత్సాహకర పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. వ్యక్తిగత గృహ మరుగుదొడ్లు, గృహసంబంధ విద్యుత్ కనెక్షన్లు, గ్యాస్ కనెక్షన్లు, నీటి పంపు కనెక్షన్లు, ఘనవ్యర్థ పదార్థాల నిర్వహణ, రోడ్ కనెక్టివిటీ, ఫైబర్‌నెట్‌వర్క్. వంటి అంశాల్లో స్టార్ రేటింగ్ ఇస్తామన్నారు. ఇదిలా ఉండగా ఇంధనశాఖకు సంబంధించి 'వినియోగదారుల ఇబ్బందుల నివారణ ఫోరం, విద్యుత్ అంబుడ్స్‌మన్, వినియోగదారుల సహాయ రెగ్యులేషన్ చట్టం' పత్రాన్ని సభలో మంత్రి కిమిడి కళావెంకట్రావు సమర్పించారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలకు కోర్టు నోటీసు

అన్నా రాంబాబు పిటిషన్‌కు స్పందన

విశాలాంధ్ర-మార్కాపురం : ఒక పార్టీ తరపున గెలిచి మరో పార్టీలో చేరిన శాసనసభ్యులపై ఎందుకు చర్యలు తీసుకోకూడదని ప్రకాశం జిల్లా గిద్దలూరు మాజీ శాసనసభ్యులు అన్నా రాంబాబు హైకోర్టులో ప్రజాప్రయోజనాల క్రింద పిటిషన్ వేశారు. దీంతో హైకోర్టు స్పందించి వైసిపి నుండి టిడిపిలోకి చేరిన 22 మంది శాసన సభ్యులకు మంగళవారం నోటీసులు జారీ చేసింది. 2014 శాసనసభ ఎన్నికల్లో వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించి అనంతరం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 22 మంది శాసనసభ్యులు అధికార తెలుగు దేశం పార్టీలో చేరారు. ఒక పార్టీ నుండి గెలిచి మరో పార్టీలోకి చేరడం క్షమించరాని విషయమని వైసిపి పార్టీతో పాటు వామపక్ష పార్టీలు కూడా పలు సందర్భాల్లో పేర్కొనడం జరిగింది. తమ ప్రభుత్వ విధానాలు నచ్చడం వల్లనే వైసిపి ఎమ్మెల్యేలు తమ పార్టీలోకి స్వచ్ఛందంగా చేరారని ఈ ఫిరాయింపుల్లో ఎలాంటి అవకతవకలు జరగలేదని స్పందించింది. ఫిరాయింపు దార్లలో కొందరు మంత్రుల పదవులు సైతం పొంది రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నారని వీరందరినీ అనర్హులుగా ప్రకటించాలని అన్నా రాంబాబు హైకోర్టును ఆశ్రయించారు. అందుకు స్పందించిన హైకోర్టు పార్టీ ఫిరాయించిన 22 మంది శాసనసభ్యులకు హైకోర్టు బుధవారం నోటీసులు జారీ చేయడమే కాకుండా రెండు వారాల్లోపు వీరిపై చర్యలు తీసుకోవాలని లేనిచో తామే తగు చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హైకోర్టు మంగళవారం పేర్కొనడంతో ఒక్కసారిగా ఫిరాయింపు దారులతో పాటు టీడీపీలో కలకలం రేగింది. ప్రకాశం జిల్లాకు చెందిన అద్దంకి, కందుకూరు, గిద్దలూరు, యర్రగొండపాలెం శాసనసభ్యులు గొట్టి పాటి రవికుమార్, పోతుల రామారావు, ముత్తుముల అశోక్‌రెడ్డి, పాలపర్తి డేవిడ్ రాజులు ఉన్నారు. ఫిరాయించి వారిలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన ఎమ్మెల్యేలకు హైకోర్టు నోటీసులు జారీ చేయడంతో పిటిషనర్ అన్నా రాంబాబు వర్గంతో పాటు వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సంపాదకీయం

ఎన్‌డీఏ శిబిరంలో ప్రకంపనలు

అంతా సజావుగా వుంటే అన్నీ మంచిగానే జరిగిపోతాయి. అది పార్టీలు, ప్రభుత్వాలు, కుటుంబం విషయంలో సైతం కావచ్చు. భారతీయ జనతాపార్టీ ఇప్పుడు మిత్రపక్షాల నుండి ఎత్తులు.. జిత్తుల పరిస్థితులను ఎదుర్కొంటున్నది. దీంతో బీజేపీ సారధ్యంలోని ఎన్డీఏ శిబిరంలో ప్రకంపనలు మొదలయ్యాయి. ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలు కాపాడనందుకు అసమ్మతిగా మోడీ మంత్రివర్గం నుండి తన మంత్రులను తెలుగుదేశం పార్టీ రాజీనామా చేయించింది. దక్షిణాది రాష్ట్రాల్లో జయకేతనం ఎగురవేయాలన్న బీజేపీ కాంక్ష తీరనిదిగానే మిగిలిపోతుందన్నది స్పష్టం. ఇటీవల మూడు ఈశాన్య రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో విజయం సాధించిన తరువాత బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా మాట్లాడుతూ "ఒడిశా, పశ్చిమ బెంగాల్, కేరళలో బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడే వరకు, కర్నాటకలో తాము విజయం సాధించే సమయం వరకు మంచికాలం రానట్లే" అని చెప్పుకున్నారు. దక్షిణాది రాష్ట్రాల్లోకి చొచ్చుకుపోయేందుకు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ సంకీర్ణ భాగస్వామిగా పార్టీపాలన సాగించింది నిస్సందేహంగా ఆంధ్రప్రదేశ్ ఒక్కటే. ఇప్పుడు బీజేపీ మంత్రులు రాజీనామా చేసి తెలుగుదేశం ప్రభుత్వం నుండి బయటకు వచ్చేశారు. 2008లో దక్షిణాదిలో ప్రప్రథమంగా ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పుడు బీజేపీకి కర్నాటక తొలి ముఖద్వారమైంది. అయితే, అనతికాలంలో కర్నాటకలో బీజేపీ ప్రభుత్వం అవినీతి ఆరోపణలతో సుహృద్భావాన్ని కోల్పోయింది. 2014లో సాధించిన విజయం ఎక్కువగా మోడీ హవాకే ఆపాదించబడింది. బీజేపీ తన పునాదిని విస్తరించుకోవడానికి బదులుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రెండు రాష్ట్రాలను కోల్పోయింది. బీజేపీయేతర, కాంగ్రెసేతర తృతీయ సంఘటనకు సారథ్యం వహించడానికి తాను అంగీకరిస్తున్నానని తెలంగాణ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖరరావు (కేసీఆర్) గతవారం ప్రకటించాడు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ నామమాత్రంగానే కొనసాగుతోంది. సంప్రదాయంగా, 1980లో బీజేపీ ఏర్పడిన తరువాత విస్తరించడానికి అది ప్రయత్నించింది. రాజకీయ వేత్తగా మారిన సినీనటుడు ఎన్టీ రామారావు 1982లో రాజకీయ రంగప్రవేశం చేసిన తరువాత ఉన్న కొద్దిపాటి అవకాశాన్ని కూడా బీజేపీ కోల్పోయింది. 1995లో మామ ఎన్టీఆర్‌ను పదవి నుండి తొలగించి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన తరువాత కాంగ్రెస్-టీడీపీల మధ్య అధికారం ప్రత్యామ్నాయం అవుతూ వచ్చింది. 1998 నుండి 2004 వరకు కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి చంద్రబాబు మద్దతిచ్చారు. బీజేపీ పరిస్థితి కూడా మెరుగుపడింది. బీజేపీ సొంతంగానే 20 శాతం ఓట్లు సాధించింది. కోస్తా ఆంధ్రలో రెండు, తెలంగాణలో రెండు స్థానాలను బీజేపీ గెలుచుకుంది. రాజులు, కాపులు బీజేపీ వైపు మొగ్గు చూపారు. 2014 ఎన్నికల్లో బీజేపీ తిరిగి టీడీపీతో పొత్తుపెట్టుకుంది. ఇప్పుడు చంద్రబాబు మోడీ ప్రభుత్వాన్ని ఇప్పుడు తెలివిగా ప్రతినాయకుడిని చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవాలన్న బీజేపీ ఉద్దేశాన్ని నిష్ఫలం చేశారు. మతం కన్నా కులం మరింత ప్రధాన పాత్ర పోషిస్తుండటంతో రాయలసీమలో ఆధిపత్య గ్రూపు వైసీపీని, కోస్తా ఆంధ్రలో రెండు ఆధిపత్య గ్రూపులు టీడీపీని కోరుకొంటున్నాయి. అయితే, 2019 ఎన్నికల నాటికి రాజకీయ పరిణామాలు, సమీకరణాలు ఏ రూపం తీసుకుంటాయో ఇప్పుడే చెప్పడం తొందరపాటే అవుతుంది.

తెలంగాణ విషయానికొస్తే, కేసీఆర్ ప్రతిపక్షాన్ని బలహీనపర్చాడు. ప్రత్యేక తెలంగాణ లక్ష్యసాధనకు అన్నీ పార్టీలు తమవంతు పాత్ర పోషించినప్పటికీ రాష్ట్ర విభజన ఘనత తమ పార్టీదేనని కేసీఆర్ చెప్పుకొన్నారు. బీజేపీకి ప్రస్తుతం ఐదుగురు ఎమ్మెల్యేలు మాత్రమే వున్నప్పటికీ, 2019 శాసనసభ ఎన్నికల్లో 60 మంది ఎమ్మెల్యేలు గెలవాలన్న అత్యాశతో కూడిన లక్ష్యాన్ని ఆ పార్టీ ప్రకటించింది. కర్నాటకకు సంబంధించి అధికారాన్ని కాంగ్రెస్ నుండి హస్తగతం చేసుకోగలమన్న ఆశాభావంతో బీజేపీ వుంది. అయితే ఇది అంత సులువు కాకపోవచ్చు. ఆ రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ, జేడీ(ఎస్) మూడు ప్రధానమైన పార్టీలు. జేడీ(ఎస్) ఎక్కువగా మైసూరుకే పరిమితమైంది. ఆ పార్టీకి ఒక్క లింగాల తోడ్పాటు వుంది. 190 నియోజక వర్గాలు గల ఇతర ప్రాంతాల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్య పోటాపోటీ వుంటుంది. సామాజిక, కులాల కాంబినేషన్, ధన, కండబలాన్ని పూర్తిగా ఉపయోగించుకోవాలని బీజేపీ భావిస్తోంది. కర్నాటక శాసనసభ ఎన్నికలు కాంగ్రెస్‌కు కూడా జీవన్మరణ సమస్యే. ఈ దక్షిణాది రాష్ట్రంలో కాంగ్రెస్ ఓడిపోతే, ఈశాన్య రాష్ట్రాల తరువాత దక్షిణాదిలో కూడా కాంగ్రెస్ జీరోగా మిగులుతుంది. ఇక కేరళ విషయానికొస్తే, బహుళమత సామాజిక దృశ్యం గల ఆ రాష్ట్రంలో ఎల్లప్పుడూ బీజేపీకి పట్టుదొరకని పరిస్థితే వుంటుంది. ఆ రాష్ట్రంలో 53 శాతం మంది హిందువులు, 28 శాతం మంది ముస్లింలు, 19 శాతం మంది క్రైస్తవులు వున్నారు. బీజేపీకి 10 శాతం వరకు ఓటు వుంది. ఇప్పటి వామపక్ష పార్టీల నేతృత్వంలోని వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డీఎఫ్), కాంగ్రెస్ నేతృత్వంలోని ఐక్యప్రజాతంత్ర సంఘటన (యూడీఎఫ్) ప్రత్యామ్నాయంగా అధికారంలోకి వస్తున్నాయి. పాలక సీపీఐ(ఎం) - బీజేపీ కార్యకర్తల మధ్య తరచుగా జరుగుతున్న ఘర్షణలు వాతావరణాన్ని చెడగొట్టాయి. కేంద్ర అధికారాన్ని దుర్వినియోగపర్చి 2019 ఎన్నికలకు ముందు బీజేపీ ఏ మేరకు లబ్ధి పొందుతుందో వేచి చూడవలసిందే. 235 శాసనసభ స్థానాలు గల తమిళనాడు 39 సీట్లు వున్న బీజేపీకి మరో కీలకమైన దక్షిణాది రాష్ట్రం. అయితే, తమిళనాడు రాజకీయాలు విభిన్నమైనవి. ఈసారి ఇద్దరు సూపర్‌స్టార్లు రజనీకాంత్, కమల్‌హాసన్‌లు రాజకీయ రంగ ప్రవేశం చేయడంతో తమిళనాట రాజకీయ దృశ్యం పూర్తిగా మారిపోతుందనే చెప్పాలి. బీజేపీ దక్షిణాదిన కాలు మోపడానికి రాజకీయ అవకాశవాదానికి పాల్పడుతుందనడం నిస్సందేహం. అయితే దానికి మరిన్ని మిత్రపక్షాలు అవసరం వుంటుంది. ఇప్పటికే కొన్ని మిత్రపక్షాలు బీజేపీ నుండి వైదొలిగిన నేపథ్యంలో కొత్తమిత్రులు బీజేపీతో చేతులు కలుపుతారని చెప్పలేము. ఇప్పటికే ఎన్డీఏ శిబిరం ప్రారంభమైన ప్రకంపనల ప్రభావం 2019 ఎన్నికల ఫలితాలపై కచ్చితంగా వుండి తీరుతుందనడంలో ఎటువంటి అనుమానం వుండవలసిన అవసరం లేదు.

చురక

ఎదలు మండే ఎజెండాల
ఎర్ర రక్త చందనం
మహారాష్ట్ర రైతు పోరు
లాంగ్ మార్చ్ వందనం

అన్నదాన రైతు బతుకు
ఆత్మహత్య, అప్పు పాలు
పట్టకుంటే దేశమంతా
ప్రభుత్వాలు కుప్పకూలు

- వేల్పుల నారాయణ

అంతర్జాతీయం

వాణిజ్య యుద్ధం ప్రారంభమైంది


బుద్ధిగ జమిందార్

ప్రపంచీకరణ, సరళీకృత ఆర్థిక విధానాలు ఒకప్పటి మాటలు. ఈ నయా ఉదారవాద విధానాలతో పశ్చిమ-తూర్పుల మధ్య, ఉత్తర-దక్షిణ దేశాల మధ్య, ఆర్థిక వ్యత్యాసాలు పెరిగాయి. బలమున్నంతమేర బలవంతుడు దోచుకోగా, కార్పొరేట్ శక్తులు విపరీతంగా పుంజుకొన్నాయి. కార్పొరేట్ కంపెనీలు దేశ సెంట్రల్ బ్యాంకులను లూటీ చేసాయి. ప్రభుత్వాలు బెయిల్‌అవుట్‌లు ప్రకటించి బ్యాంకుల్ని ఆదుకున్నాయి. రుణ ఎగవేతదారులు హాయిగా నిద్రపోగా బెయిల్‌అవుట్లకు ప్రభుత్వాలు ప్రకటించిన లక్షలాది కోట్ల డాలర్లు ప్రభుత్వ ఖజానా నుండి చెల్లించారు. అంటే ప్రజల నడుం విరిచి వసూలు చేసిన పన్నుల మొత్తమిది. ఇది చాలక కార్పొరేట్ కంపెనీల సంపద పన్నును చాలా దేశాల్లో తగ్గిస్తూ వస్తున్నారు. అంటే ప్రభుత్వం ప్రత్యక్షపన్నులు కార్పొరేట్ల నుండి తగ్గగా ప్రభుత్వం బడ్జెట్లకు కావాల్సిన ఆదాయాన్ని ప్రజలపై భారం మోపి పరోక్ష పన్నుల ద్వారా వసూలు చేయనారంభించారు. అయినప్పటికీ కార్పొరేట్ కంపెనీలకు ప్రభుత్వాలు ప్రకటిస్తున్న 'నజరానాలు' ఇంకా సరిపోవటం లేదు. ఇంకా లాభాలు కావాలి. ఏమిచేస్తే కార్పొరేట్ కంపెనీల ఉత్పత్తులు స్వదేశాల్లో అమ్ముడైపోవాలా అని ఆలోచించాడు మన ట్రంప్. సెంటిమెంట్‌తో వర్క్ చేయాలనుకున్నాడు. 'అమెరికాఫస్ట్' నినాదం ఇచ్చాడు. అంటే 'అమెరికా కార్పొరేట్స్ ఫస్ట్' అని అర్థం. ట్రంప్‌కు ఒక బ్లిడ్స్ ఆలోచన వచ్చింది. విదేశీ వస్తువులపై సుంకాలు పెంచాలనే ఆలోచన. తక్షణమే మార్చి 1న సంతకం చేసాడు. మరొక వారంలోపు నూతన సుంకాల విధానాలు అమలుకు రానున్నాయి. ఇవి స్టీలు, అల్యూమినియంకు సంబంధించినవి. (అంటే పరోక్షంగా స్టీలు, అల్యూమినియం ముడి పదార్థాలతో తయారు చేసిన వస్తువులపై సుంకాలు అని అర్థం). ఇంకేముంది స్టీలుపై 25% సుంకాల్ని, అల్యూమినియంపై 10% సుంకాల్ని పెంచేసాడు. ఈ విధానం ద్వారా అమెరికాతో నాఫ్టా ఆర్థిక ఒడంబడికపై సంతకం చేసిన మెక్సికో, కెనడాలు కొద్ది వెసులుబాటుతో జపాన్ ఆస్ట్రేలియాలు తప్ప మిగతా దేశాలన్నీ అమెరికాకు ఎగుమతి చేస్తే అటువంటి స్టీలు, అల్యూమినియంపై అధిక సుంకాలు విధించబడతాయి. ముఖ్యంగా 28 ఈయూ దేశాలు (జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ వంటి దేశాలు), చైనాలను ఉద్దేశించి చేయబడిన సంతకమది. ఇది ఒక విధమైన పరోక్షయుద్ధం. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత సోషలిస్టు బ్లాకుకు వ్యతిరేకంగా అమెరికా మిత్రపక్షాలు చేసిన బ్లొకాడ్ (నిర్బంధం) వంటి కోల్డ్ వార్ ఇది. ఒక విషయం సుస్పష్టం, ప్రపంచ పఠంలో ఏకధృవ ఆర్థిక అమెరికా వ్యవస్థ బలహీనపడింది. ఈయూ దేశాల ఆర్థిక వ్యవస్థ ఒకవైపు, చైనా ఆర్థిక వ్యవస్థ మరొకవైపు బలపడినవి. ఇవి అమెరికాను పరుగులు తీయిస్తుంటే అమెరికా ఆర్థిక వ్యవస్థకు నీరసమొస్తున్నది. కనుక ఈయూ చైనాలకు చెక్ పెట్టటానికే ఈ ఎత్తు.

ప్రపంచ మిలిటరీ కూటమి నాటో (నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్)లో అమెరికాకు జర్మనీ ప్రధాన భాగస్వామి. జర్మనీ వంటి దేశాలు నాటో భాగస్వామ్యంగా ఉంటూ మిలటరీ కూటమికి జీడీపీలో 2 శాతం ఖర్చు చేయాలనే నిబంధన పాటించటం లేదని తెలివిగా జర్మనీ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని గ్రహించాడు ట్రంప్. కనుకనే స్టీలు, అల్యూమినియంపై సుంకాలంటున్నాడు. కానీ ఈయూ దేశాలు తమ సొంత మార్కెట్లను ఆఫ్రికా, ఆసియా ఖండాల్లో ముఖ్యంగా మధ్యప్రాశ్చ్యం, చైనా భారత్ వంటి దేశాల్లో వెతుక్కుంటున్నాయి. తద్వారా ఈయూ దేశాలు బలపడుతున్నాయి. 18 లక్షల టన్నుల జీడీపీలో అగ్రగామి దేశంగా ప్రపంచంలోనున్న అమెరికాకు చైనా మార్కెటు, చైనా ఆర్థికాభివృద్ధి పెద్ద తలనొప్పిగా తయారైంది. సిల్కురోడ్డు అభివృద్ధిలో చైనా అనేక దేశాలలో వాణిజ్యాన్ని పెంచుకొంటుంది. విదేశీ వాణిజ్యంలో చైనాతో 2017 సంవత్సరంలో 37.500 కోట్ల డాలర్లు లోటు వాణిజ్యంలో అమెరికా ఉన్నది. ఏటా ఈ లోటు 20 శాతం పెరుగుతూ వస్తున్నది. దీనర్థం చైనా ఉత్పత్తుల ఎగుమతులతో అమెరికా ఆర్థిక వ్యవస్థ, మార్కెట్టు పోటీపడలేకపోతుంది. దీనికి గల ప్రధాన కారణం స్పెక్యులేషన్ మార్కెట్లోనైతే అమెరికా అడ్డదారిలో వాల్‌స్ట్రీట్ గుండా



సంపాదించగలదు. కానీ ఎగుమతులు దిగుమతుల ద్వారా పై చేయి సాధించటం చైనాతో జరగని పని అని స్పష్టమవుతోంది. రెండు దేశాల మధ్య వాణిజ్య యుద్ధం అనేది ఇరుదేశాలకు, దేశ ప్రజలకు హానికరమని చైనా వాణిజ్యమంత్రి జోంగ్‌షాంగ్ అంటూ, 'చైనా మాత్రం వాణిజ్య యుద్ధానికి దిగక దేశ భద్రతను పటిష్టపరుచుకొని సరైన జాగ్రత్తలు తీసుకోగలం' అని అంటున్నారు. మన దేశంతో కూడా అమెరికా వాణిజ్యం 2017 సంవత్సరంలో 2,290 కోట్ల డాలర్ల లోటును సూచిస్తుంది. ఈ లోటు లేకుండా ఉండటమే తమ ధ్యేయమని ట్రంప్ అంటున్నాడు. ఏ దేశమైనా ఇటువంటి లోటును జీరో చేయటానికి గాని లేదా తన దేశం వాణిజ్య లోటులో ప్రవేశించటానికి గాని ఎందుకు ఒప్పుకొంటుంది.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో 3 లక్షల కోట్ల డాలర్ల విదేశీ రిజర్వు కరెన్సీతో చైనా వ్యవస్థ ఆరోగ్యకరంగా ఉండగా అమెరికా ఆర్థిక వ్యవస్థకు 20లక్షల కోట్ల డాలర్ల అప్పులు కళ్లెదుట కనబడుతున్నాయి. పైనా పటారం లోన లొటారం లాంటిది అమెరికా ఆర్థిక వ్యవస్థ. వాల్‌స్ట్రీట్‌లో డాలర్ ఎక్చేంజ్‌ని తనకు అనుకూలంగా మరల్చుకోవటం, అవసరమనుకుంటే కావల్సినన్ని డాలర్ల నోట్లను అనధికారికంగా ముద్రించుకోవటం. లేదంటే నూతన యుద్ధాలను ప్రోత్సహించి సామాన్య ప్రజల్ని చంపుతూ భయభ్రాంతుల్ని చేస్తూ, మధ్యప్రాశ్చ్యం, ఆఫ్రికా, ఆసియా, దక్షిణఅమెరికా ఖండాల్లోని ఖనిజసంపదను స్వాహా చేయటమే అమెరికా పని దీనికిగాను కావల్సినన్ని మిలిటరీ నిధులు వెచ్చించటానికి అమెరికా వెనుకాడుటలేదు. ప్రతిఏటా 8 శాతం వరకూ ఖర్చులు పెంచి ప్రపంచ మిలిటరీ ఖర్చులో 40 శాతం తనేచేస్తూ రికార్డు సృష్టిస్తుంది. "20వేల డాలర్లు ఖరీదుచేసే ఒక అమెరికా బాంబును 2కోట్ల డాలర్ల విలువైన విమానం ఎగురవేసుకొంటూ పోతూ, గంట ఎగరటానికి 6వేల డాలర్లను ఖర్చు చేస్తూ ఎమెన్‌లో రోజుకు 1 డాలరు సంపాదించే సామాన్య ప్రజల్ని చంపుతుంది" అని సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇంతకీ ఈ అమాయక సామన్య ప్రజల్ని ఎందుకు చంపుతుంది? కేవలం ముడిచమురు కోసం అమెరికా వాణిజ్య లాభాల కోసమేగా!

రెండు ప్రపంచ యుద్ధాలతో లాభపడిన అమెరికా పెట్టుబడీదారి వ్యవస్థ ఆ యుద్ధాల మధ్య 1930 దశకంలో తీవ్ర ఆర్థిక మాంద్యానికి గురైంది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత బ్రెటెన్ ఉడ్ సిస్టమ్ ద్వారా డాలర్ కరెన్సీ, ప్రపంచ బ్యాంకు-ఐఎంఎఫ్‌లతో లబ్ధి పొంది, 1970 దశకం నాటికి సరిపడలేని బంగారంతో అమెరికా ఫ్లోట్‌డాలర్‌కు మార్చి నిక్సన్ షాక్‌తో తిరిగి బట్టకట్టింది. నూతన మార్కెట్ల స్పెక్యులేషన్ అన్వేషణల్లో ప్రచ్ఛన్నయుద్ధం ద్వారా సోవియట్ యూనియన్ సోషలిస్టు దేశాల్ని కూల్చి 2010 వరకూ లబ్ధి పొందింది. ఆ తరువాతి పరిణామాల్లో బలపడుతున్న రష్యా, బలపడిన చైనాలతో ఏక ధృవపట్టును కోల్పోయింది. ఒబామా ట్రాన్స్ పసిఫిక్ ఒప్పందం (టి.పి.పి.) ఈయూ దేశాలతో కూడిన ట్రాన్స్ అట్లాంటిక్ (టి.టి.పి.) ఒప్పందాలు రద్దు కావటంతో అమెరికా స్వేచ్ఛా మార్కెట్ల చొరబాట్లకు అడ్డు తగిలింది. దీనితో ప్రస్తుతం అమెరికా అభివృద్ధి రేటు స్వల్పంగా తగ్గుతుంది గాని పెరగటం లేదు. జీవన ప్రమాణాలు నానాటికి తగ్గుతున్న అమెరికా ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతున్నది. అమెరికా వస్తువులు విదేశాల్లో పోటీని తట్టుకోలేని పరిస్థితి ఏర్పడింది. అమెరికా పరిశ్రమ సంక్షోభంలోకి నెట్టబడుతుంది. కనుకనే నూతన వాణిజ్య యుద్ధాన్ని ప్రకటించింది. దీనివలన కూడా భవిష్యత్తులో అమెరికాలో తయారైయ్యే వస్తువుల తయారీ ఖర్చులు పెరిగిన సుంకాల భారమవుతాయి. గనుక అమెరికా పరిశ్రమ మరింత గడ్డుకాలాన్ని ఎదుర్కొంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. పెట్టుబడీదారి ఆర్థిక వ్యవస్థ సంక్షోభాలకు పుట్టినిల్లు గనుక ఇది సహజమే. నిజమైన సోషలిస్టు ఆర్థిక ఉత్పత్తి వ్యవస్థ మాత్రమే ప్రత్యామ్నాయం కాగలదు. అపారమైన వనరులు ముడిసరుకులు గల దేశం అమెరికా, ఇప్పటి వరకూ తన గుత్తాధిపత్యంలో ప్రపంచ వనరుల్ని తక్కువ ధరలకు దోచుకొని వర్థమాన దేశాలను నలిపి పిప్పి చేసింది. చమురు విషయంలో షెల్ ఆయిల్ ద్వారా అంతర్జాతీయ మార్కెట్లను ముఖ్యంగా వెనుజులా, రష్యాల ఆర్థిక వ్యవస్థల్ని ఏ విధంగా నలిపిందో మనం చూసాము. ఇప్పుడు తనదగ్గరున్న ముడిసరుకుల్ని ఒక్కొక్కటి బయటకు తీస్తూ చాలా దేశాల ఆర్థిక వ్యవస్థలను చిత్రవధ చేసి చిన్నాభిన్నం చేయజూస్తుంది సామ్రాజ్యవాదం.

- వ్యాస రచయిత : ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యవర్గ సభ్యులు.
సెల్ : 9849491969

జనసేనకు ఇది పరీక్షా సమయం!

నేడు జనసేన ఆవిర్భావదినోత్సవం


కంచల జయరాజ్

రాష్ట్రంలో రాజకీయ అనిశ్చితి ఏర్పడి చాలా రోజులయింది. దీన్ని జనసేన భర్తీ చేస్తుందనే ఆశతో చాలా మంది మేధావులు, రాజకీయ ప్రత్యామ్నాయం కోరుకునే వారు ఎదురు చూస్తున్నారు. ప్రాంతీయ పార్టీలను తుదముట్టించే దిశగా కేంద్రంలోని బీజేపీ వ్యూహాత్మకంగా పావులు కదుపుతుంటే, ప్రాంతీయ పార్టీలు ఇప్పటికే దేశంలో చాలా చోట్ల అమిత్‌షా-మోడీ తాకిడికి భయపడి ఇష్టం లేకపోయినా అనుసరిస్తున్నాయి. దక్షిణాది రాష్ట్రాల్లో పరిస్థితులు దీనికి భిన్నంగా ఉంటున్నాయి. ముఖ్యంగా రాజకీయ ప్రాధాన్యం కలిగిన ఆంధ్రప్రదేశ్‌లాంటి రాష్ట్రంలో పరిస్థితులు కేంద్రానికి ఏమాత్రం మింగుడు పడటం లేదు. నాలుగేళ్లుగా మిత్రపక్షంగా ఉన్న తెలుగుదేశం పార్టీని చావుదెబ్బ తీశామని బీజేపీ సంబరాలు చేసుకునే సందర్భమే రాకుండా ఉండటం బీజేపీకి అంతుబట్టని ప్రశ్నగా మారింది. అయితే ఒకవైపు తెలుగుదేశం, మరో వైపు వైసీపీలు ప్రజావిశ్వాసాన్ని పూర్తిస్థాయిలో పొందలేకపోతున్నాయి. అనూహ్యరీతిలో రాష్ట్రవిభజన తర్వాత నవ్యాంధ్ర ప్రదేశ్‌కి తొలిముఖ్యమంత్రి అయిన నారా చంద్రబాబునాయుడు 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటే అమలు చేస్తూ ప్రజావిశ్వాసాన్ని పొందాల్సిందిపోయి వాటిని విస్మరిస్తూ ప్రజావ్యతిరేకతను సొంతం చేసుకున్నారు.మరో వైపు వైసిపి సైతం నిర్మాణాత్మకమైన ప్రతిపక్ష పాత్రపోషించడంలో పూర్తిగా విఫలం అయింది. ఇలాటి పరిస్థితుల్లో రాజకీయ ప్రత్యామ్నాయం ఏమిటి అనేది పెద్దచర్చ జరుగుతోంది. వామపక్షాలు చేసే పోరాటాలకు ప్రజల నుంచి ఆశాజనకమైన స్పందన లభిస్తున్నప్పటికీ ప్రభుత్వం చేసే వేధింపుల వల్ల అన్ని స్థాయిల్లోనూ భయాలు అలముకుంటున్నాయి. అయినా సరే వామపక్షాలు రాజీలేని పోరాటం చేస్తూనే ఉన్నాయి.

సామాన్యుల హక్కుల కోసం పోరాటం చేసే పార్టీగా, ప్రజా సైన్యంగా పేర్కొంటూ నాలుగేళ్ల క్రితం జనసేన ఆవిర్భవించింది.2014 మార్చి 14వ తేదీన జనసేన ప్రశ్నించే పార్టీగా, సామాన్యులకు అండ ఉంటుందని పార్టీ అధినేత, సినీనటుడు పవన్‌కళ్యాణ్ ప్రకటించారు. పవన్‌కు ఉన్న సినీగ్లామర్, సామాజిక నేపథ్యం 2014 ఎన్నికల్లో కొంత మేర ఓటర్లను ప్రభావితం చేయగలిగింది. అప్పటి ఎన్నికల్లో బీజేపీ తరపున ప్రచారం లోకి దిగిన జనసేన అధినేత, రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ తరపున ప్రచారం చేశారు. రాష్ట్ర విభజన జరిగి ఉండటం, విభజన వేడి కాంగ్రెస్‌కు తీవ్రంగా తగలడంతో ప్రధానంగా రెండే పార్టీలు రాష్ట్రంలో ఎన్నికల బరిలో హోరాహోరీగా తల పడ్డాయి. తెలుగుదేశం, వైసీపీ నువ్వా, నేనా అన్నట్లుగానే గత ఎన్నికల బరిలో నిలిచాయి. ఆఖరు నిమిషం వరకూ వైసీపీ అధికారంలోకి వస్తుందని అందరూ అంచనాలు వేశారు. అనూహ్యరీతిలో తెలుగుదేశం పార్టీ విజయం సాధించింది. ఈ విజయానికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కృషి ఎక్కువగానే ఉందని చెప్పాలి. రాష్ట్ర విభజనపైన, ఆంధ్రులకు జరిగిన అన్యాయం పైనా పవన్ పెద్ద ఎత్తునే ప్రశ్నించారు. ప్రచారంలోనూ ప్రస్తావించారు. పవన్‌కు ఉన్న సినీ గ్లామర్‌తో పాటు ఆయన సామాజిక అంశం కూడా రాష్ట్రంలో ఓటర్లపై ఎక్కువ ప్రభా వాన్నే చూపింది. సుమారు 2శాతం మేర అదనపు ఓట్లు జనసేన వల్ల సమకూరాయన్నది అంచనా. ఇది తెలుగుదేశం పార్టీకి కలిసి వచ్చింది. వైసిపిపై తెలుగుదేశం పార్టీ పెద్ద మెజార్టీతో గెలవలేదు. వచ్చిన ఓట్లలో జనసేన ప్రభావం కూడా ఎక్కువగానే ఉంది. బిజెపి తరపున ఎన్నికల బరిలోకి దిగినా, టీడీపీ తరపునే ప్రచారం చేశారు. దీనివల్ల అటు బీజేపీతోనూ, ఇటు టీడీపీతోనూ పవన్‌కు మంచి సంబంధాలు ఏర్పడ్డాయి. ఎన్నికల్లో ఆయన పోషించినపాత్రను బీజేపీ, టీడీపీ ఇరు పార్టీలు గుర్తించాయి. వచ్చిన ఫలితాల్లో జనసేన వాటా కూడా ఉందని నమ్మాయి. 2014 ఎన్నికల్లో జనసేన సొంతగా ఎన్నికల బరిలోకి దిగకపోయినా, విలువైన అనుభవాన్ని మాత్రంసొంతం చేసుకుంది.

విలువైన సమయం వృధా!

రాజకీయాల్లో నాలుగేళ్లసమయం అంటే చాలా ఎక్కువ. కేవలం 9నెలల వ్యవధిలో పార్టీని స్థాపించి, అనూహ్యమైన విజయాన్ని సొంతం చేసి, ప్రాంతీయ పార్టీలు సైతం సత్తా చాటగలవని తెలుగుదేశం పార్టీ ద్వారా ఎన్టీరామారావు నిరూపించారు. అయితే ఆరోజు ఉన్న పరిస్థితులు, సమీకరణాలు వేరు. ఇప్పటి పరిస్థితులు, రాజకీయ పరిణామ క్రమం వేరుగా ఉంది. ఇపుడున్న సమకాలీన రాజకీయాలను అంచనా వేయడమే కత్తిమీద సాములా ఉంది. రెండు దశాబ్దాలకుపైగా వెండితెరను ఏలి, స్టార్ హోదాను సంపాదించుకొని, దేశవిదేశాల్లో ప్రాణాలను ఇచ్చే అభిమానులను సొంతం చేసుకొన్న పవన్ కళ్యాణ్ జనసేనను స్థాపించారంటే అంతర్జాతీయ వార్తగానే నిలిచింది. అయితే ఆరంభంలో ఉన్నంత వాడీ, వేడి రాను రాను తగ్గిపోయాయి. అందివచ్చిన అనేక అవకాశాను పార్టీ వినియోగించుకోవడంలో వెనుకబడింది. నాలుగేళ్లసమయంలో పార్టీని ప్రజల దగ్గరకు తీసుకెళ్లి పూర్తిస్థాయి రాజకీయాన్నినెరపే సాహసం, వ్యూహం కలిగే అనుభవాన్ని సొంతం చేసుకునే అవకాశాన్ని జనసేన సంపాదించుకోలేకపోయింది. పార్టీ స్థాపిం చిన తర్వాత మూడు సినిమాలు తీశారు. ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం జిల్లాలో ఉద్దానం కిడ్నీ బాధితుల కథనాలపై స్పం దించి నేరుగా వారిని కలవడం ద్వారా ప్రభుత్వం స్పందిం చింది. వారికి కొంత మేర మేలు జరిగింది. తెలంగాణాలో ఛలో రే చలోరే వంటి కార్యక్రమాన్ని నిర్వహించింది. అయితే వాటికంటే ముందు ఆంధ్రప్రదేశ్‌లో అనేక ప్రజాసమస్యలపై స్పందించిన పవన్, ప్రజలకు ఇచ్చిన హామీలను తర్వాత కాలంలో మర్చిపోయారు. అమరావతి రాజధాని కోసం రైతుల నుంచి ప్రభుత్వం బలవంతంగా తీసుకున్న భూములకు సంబంధించి రైతులను పరామర్శించడానికి వచ్చారు.వారికి బాసటగా ఉంటానని భరోసా ఇచ్చారు. తర్వాత మర్చిపో యారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు, ఫాతిమా మెడికల్ కాలేజీ విద్యార్థులు, అగ్రిగోల్డు బాధితులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఫాతిమా మెడికల్ కాలేజీ విద్యార్థుల సమస్యలు వారంలోగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇంతవరకూ ఆ సమస్యల అలాగే ఉంది. విద్యార్థుల్ని ప్రభుత్వం బెదించినా పవన్ కళ్యాణ్ స్పందించకపోవడంపై అనేక విమర్శలు వచ్చాయి. అదే విధంగా విద్యుత్ కాంట్రాక్టు కార్మి కుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తర్వాత పట్టించుకోకపోగా, విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు 20రోజుల పాటు సమ్మె చేసినా, ప్రభుత్వం స్పందించలేదు. 24వేల మంది కార్మికులు రోడ్లమీద పడినా పవన్ స్పందించకపోవడంపై అనేక విమర్శలు వచ్చాయి. అదే విధంగా కేంద్రం రాష్ట్రానికి ఇస్తానన్న అనేక హామీలను విస్మరించినా సరే పవన్ సరైన రీతిలో స్పందించకపోవడంపైన కూడా అనేకవిమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాలుగేళ్లు అయినా సరే జనసేన ఇంకా తప్పటడుగులు వేసే స్థితిలోనే ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. రాజకీ పార్టీని స్థాపించిన పుడు తెగింపు చాలా అవసరం. అధికారంలో ఉన్నపార్టీని, ప్రభుత్వాన్ని తెగనాడాలి. ప్రజాసమస్యలపై పోరాడాలి. అధికార పక్షం చేసే తప్పుల్ని ఎండగట్టాలి. కానీ ఈ విషయంలో పవన్ కళ్యాణ్ చాలా మౌనంగా ఉంటున్నారు. ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఇది రాజకీయ పార్టీకి, అందులోనూ కొత్తపార్టీకి ఏమాత్రం మంచిది కాదు. 2008 ఆగస్టు 26వ తేదీన ప్రజా రాజ్యం పార్టీని చిరంజీవి స్థాపించి, 2009 ఎన్నికల్లో పోటీ చేసి 19స్థానాలు సొంతం చేసుకున్నారంటే అప్పట్లో ఆయన ప్రత్యా మ్నాయం అనే భావన ప్రజల్లో తేగలగట్టే జరిగింది. ఇపుడు పవన్ కళ్యాణ్‌కంటే కూడా చిరంజీవి సభలకు ఎక్కువ మంది ప్రజలు, అభిమానులు హాజరయ్యారు. చిరంజీవి తిరుపతి వేదికగా చేసిన సభ, తరలివచ్చిన జనసందోహాన్ని చూసి జాతీయపార్టీలు సైతం ఆందోళన చెందాయి. తర్వాత చిరంజీవి ఎక్కడకు వెళ్లినా తరలి వచ్చే ప్రజల్ని చూసి ప్రజారాజ్యం అధికారంలోకి రావడం ఖాయం, చిరంజీవి ముఖ్యమంత్రి అవ్వడాన్ని ఎవరూ ఆపలేరు అనే భరోసా ఇచ్చారు. కానీ పవన్ కళ్యాణ్‌పై అటు బీజేపీ ముద్ర, ఇటు తెలుగుదేశం పార్టీ ముద్ర పడింది. ఇప్పటికీ అవే ముద్రలు కొనసాగుతున్నాయి. బీజేపీ కంటేకూడా తెలుగుదేశం పార్టీ ప్రభావం ఎక్కువగా పవన్‌పై ఉందనే అభిప్రాయం బలపడుతోంది. చిరంజీవి ప్రజారాజ్యాన్ని ఒక ఎన్నికలో పోరాడి, సీట్లు సొంతంగా సంపాదించుకొని, 2001 ఫిబ్రవరి6వ తేదీన కాంగ్రెస్ పార్టీలో విలీనం చేశారు. కానీ జనసేన భవిష్యత్ ఏమిటి? తెలుగుదేశం పార్టీ అండదం దలతోనే ముందుకు వెళుతుందనే అభిప్రాయం బలపడేలా పరిస్థితులు మారుతున్నాయి. పవన్ మనోడే అని ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం పేర్కొనడాన్ని ఏమనాలి? ప్రత్యేకహోదా, విభజన చట్టంలోని అంశాలపై నాలుగేళ్లపాటు మౌనంగా ఉండి, ఇప్పటికి ఎన్డీయేలో భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం పార్టీని పన్నెత్తు మాట అనకుండా, ప్రతిపక్షంలో ఉన్న వైసీపీని, కనుమరుగైన కాంగ్రెస్‌ను తూర్పారపట్టడం వల్ల జనసేనకు నెగిటివ్ మైలేజ్ వస్తుంది. ప్రత్యేకహోదాపై మాట తప్పిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 8వ తేదీన వామపక్షాలు ఇచ్చిన బంద్‌కు తెలుగుదేశం పార్టీతో పాటు జనసేన కూడా దూరంగానే ఉంది. ఇది జనసేన రాజకీయ భవితవ్యానికి ఏమాత్రం మంచిదికాదు.

భవిష్యత్ నిర్ణయం నేడే!

జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం నాడు అమరావతి రాజధాని ప్రాంతంలో నిర్వహిస్తున్నారు. పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. లక్షలాదిమంది అభిమానులు దీనికి హాజరవుతున్నారు. అయితే హాజరయ్యేవారిలో ఎక్కువ మంది పవన్ కళ్యాణ్ సినీ అభిమానులే ఉంటారు. జనసేనకు ఇంకా సభ్యత్వం గానీ, నాయకత్వం గానీ పూర్తిస్థాయిలో ఏర్పడలేదు. పవన్ కళ్యాణ్ బుధవారం నాడు చేసే ప్రసంగంపై అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇన్నాళ్లు అధికార పక్షాన్ని ఆచితూచి మాట్లాడే పవన్ కళ్యాణ్ బుధవారం నాటి సభలో ఎలా మాట్లాడతారు? రాష్ట్ర ప్రయోజనాలకు తీవ్ర భంగం వాటిల్లే



పరిస్థితుల నేపథ్యంలో అమీ తుమీ తేల్చడానికి పవన్ సిద్ధమయ్యారా? 2019 ఎన్నికల గోదాలోకి దిగుతానని ఆయన ఈపాటికే ప్రకటించారు. అయితే దీనికి పునాది బుధవారం నాటిసభే అవుతుంది. ఆయన చేసే ప్రకటనను బట్టి ప్రజలు ఇపుడున్న రాజకీయాలకు జనసేన ప్రత్యమ్నామయమా? కాదా అన్నది తేల్చుకుంటుంది. ఇప్పటి వరకూ జరిగిన సభలు, పవన్ ప్రసంగాలు పేలవంగానే ముగిశాయి. అనంతరపురం, కాకినాడ సభల్లో ఆయన చేసిన ప్రసంగాలు ప్రత్యామ్నాయ రాజకీయాలను నెరుపుతారనే భరోసాను ఇవ్వలేకపోయాయి. ఇదే ఒరవడి కొనసాగితే జనసేనకు నష్టమే ఎక్కువ జరుగుతుంది. ఇపుడు యువత ఎక్కువ శాతం జనసేన వైపు మొగ్గుచూపుతోంది. వారిని రాజకీయ తెరమీదకు తీసుకు రావాల్సిన బాధ్యత జనసేన మీదే ఉంది. అటు తెలుగుదేశం, ఇటు వైసీపీలో సీట్లన్నీ భర్తీ అయి పోయాయి. ఇపుడు అక్కడకు వెళ్లి కొత్తతరం రాజకీయాలు నెరపే అవకాశం లేదు. ఓటర్లలో 85 శాతం మంది యువకులే ఉండటం గమనించాల్సి ఉంది. వారిని ప్రభావితం చేయడం మిగతా పార్టీలకంటే పవన్‌కే ఎక్కువగా సులభమైన పని. ఈ వియాన్ని పవన్ గుర్తించాల్సి ఉంది. ప్రసంగంలో వాడి వేడి ఉండాలి. అధికార పక్షాన్ని కడిగి పారేయాలి. ప్రత్యేకహోదా విషయంలో కేంద్రాన్ని ఏమీ అనకుండా, తెలుగుదేశం ప్రభుత్వంపై కారాలు మిరియాలు నూరే వైసీపీపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బిజెపితో తెరవెనుక మైత్రీ బంధం కొనసాగించడం వల్లనే ఆపార్టీని ఏమీ అనడం లేదనేదివైసిపికి తీరని రాజకీయనష్టమే. ఇపుడు జనసేనకు అటు తెలుగుదేశం పార్టీతోనూ, ఇటు బీజేపీతోనూ ఇదేసమస్య వస్తుంది. ఇప్పటికీ తెలుగుదేశంతో జనసేన మైత్రీ బంధం కొనసాగుతుందనే భావనప్రజల్లో ఉంది. దీన్నుంచి బయటపడాలంటే బుధవారంనాటిసభలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను తూర్పారపడితేనే జనసేన 2019 నాటి ఎన్నికలకు క్లియర్ లైన్ ఏర్పడుతుంది. ఇప్పటివరకూ ఉన్న అపోహలు, అనుమానాలు పటాపంచలు అవుతాయి. ఈపనిచేయడానికి జనసేన సాహసిస్తుందా? లేదా చూడాలి!

- వ్యాస రచయిత : అధ్యక్షులు : విజయవాడ ప్రెస్ క్లబ్
సెల్ : 9848992299

ఆహా! ఆహారం దొరికేసింది!!



దర్జీ దర్జా ఎక్కడ!

పెళ్ళిళ్ళ సీజన్ నడుస్తోంది. పెళ్ళిళ్ళు అంటే ప్రధానంగా చెప్పకునేది వస్త్రాల గురించే. ఒకప్పుడు ఈ సీజన్ వచ్చిందంటే టైలరింగ్ షాపులన్నీ కళకళాడుతుండేవి. ఈ వేసవి నాలుగు నెలలు చేతినిండా పనే. దర్జీలకు అదనపు ఆదాయం అందించే సీజన్‌గా ఉండేది. కుటుంబ పోషణకు సంవత్సరానికి సరిపడ డబ్బు ఒక్క పెళ్ళిళ్ళ సీజన్‌లోనే వచ్చేదంటే అశ్చర్యం లేదు, అతిశయోక్తి అంతకన్నా కాదు. ఇంత దర్జాగా జీవితాన్ని గడిపిన దర్జీల బతుకులు ఇప్పుడు తారుమారయ్యాయి. మామూలు సమయంలో కాదు అసలు పెళ్ళిళ్ళ సీజన్‌లోనూ చెప్పకోదగిన స్థాయిలో పనే దొరకడం లేదు. దీంతో బతుకులు భారమయ్యాయి. కుట్టు వృత్తిని వదిలి కూలి పనులకు వెలుతున్నారు. ఏదోరూపంలో ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు టైలర్లు.

ఓ ఇరవై, పాతికేళ్ళ వెనక్కి వెళితే....ఎవరైనా హుందాగా డ్రస్ చేసుకున్నవాళ్ళు కనిపించారనుకోండి....ఎక్కడ కుట్టించారండీ...ఎవరు కుట్టారండీ అని అడిగేవాళ్ళు. ఇదీ టైలర్ గొప్పతనం. దర్జీ పనితనం అంతా అక్కడే తెలిసిపోయేది. బట్టలు కుట్టడంలో ఒక్కొక్కరిదీ ఒక్కో శైలి. వారు కుట్టే పద్ధతిని బట్టే డిమాండ్ కూడా ఉండేది. ఇలాంటి దర్జీ ఇప్పుడు రోడ్డున పడ్డాడు. ఎంత బాగా కుట్టినా పని ఇచ్చేవాళ్ళే కరువయ్యారు. దీంతో కనీసం పిల్లలను చదివించలేని పరిస్థితికి చేరుకున్నారు టైలర్లు. నగరాలు, పట్టణాలే కాదు గ్రామాలు, పల్లెల్లోని టైలర్ల పరిస్థితీ ఇలాగే ఉంది. విశాఖ జిల్లా రాంబిల్లి మండల ప్రాంతంలోని టైలర్ల స్థితీ ఇందుకు అతీతంగా ఏమీ లేదు. తమ దురవస్థలు పట్టించుకునే నాథుడే లేడని వాపోతున్నారు ఈ టైలర్లు.

రెడీమేడ్ దెబ్బ!

టైలరింగ్‌కి ఆదరణ తగ్గడానికి ప్రధాన కారణం రెడీమేడ్ దుస్తులే. డబ్బులు పట్టుకుని షాపునకు వెళితే కావలసిన మోడల్‌లో వెంటనే దుస్తులు అమరిపోతున్నాయి. ఇంక కుట్టించుకోవడానికి నిరీక్షించాల్సిన అవసరం ఏముంది? పైగా కుట్టినదానికంటే అందంగా, అంతకంటే మోడల్‌గా అందుబాటులోకి వస్తుంటే ఇంకా దర్జీ దగ్గరికి ఎందుకు వెళతాం అంటున్నారు జనాలు. ఒకప్పుడు తమదైన కుట్టు శైలితో ప్రత్యేకమైన గౌరవం పొందిన దర్జీకి ఇప్పుడు అసలు విలువే లేకుండా పోయింది.

కూలీ పనులకు...

కుట్టడానికి బట్టలు ఇచ్చేవాళ్ళు లేక, చేతికి పని దొరక్క చాలామంది టైలర్లు ఖాళీగా ఉంటున్నారు. దీంతో తినడానికి తిండి కూడా లేని పరిస్థితుల్లో దుర్భరమైన జీవితాలను గడుపుతున్నారు. కుట్టు వృత్తిని వదిలేసి కూలీ పనులకు వెళుతున్నారు. రెడీమేడ్ దుస్తుల కారణంగా టైలర్ల పరిస్థితి మరింత దయనీయంగా మారింది.

పెరిగిన ముడిసరుకుల ధరలు

చొక్కా కుట్టాలంటే కాలరు దగ్గర వేసే పట్టీ కొనాలి, గుండీలు కొనాలి. ఫ్యాంట్లు కుట్టాలంటే జిప్‌లు తీసుకురావాలి. జాకెట్లు కుట్టాలంటే హుక్కులు కావాలి. అసలు ఏది కుట్టాలన్నా దారం కావాలి. ఇవన్నీ టైలర్లకు కావాల్సిన ముడి సరుకులే. వీటి ధరలు ఇంతకుముందు 30 శాతమే ఉండేవి. ఇవి ఇప్పుడు ఏకండా 70శాతానికి పెరిగింది. దీంతో కుట్టుకూలీ కూడా పెరిగింది. ఒక్కో జతకు రూ. 700 నుంచి వెయ్యి రూపాయలు ఇవ్వాల్సిన పరిస్థితి. ఇంత కుట్టుకూలీ ఇచ్చే బదులు తక్కువ ధరలోనే రెడీమేడ్ దుస్తులు వచ్చేస్తున్నాయిగా అంటున్నారు జనం. ఈ పరిస్థితే దర్జీల పొట్ట కొడుతోంది.

అద్దె కూడా ఇవ్వలేని దుస్థితి

ప్రస్తుతం టైలర్లు తమ షాపులకు కనీసం అద్దె కూడా కట్టలేని దుస్థితిలో ఉన్నారు. ఈ అద్దెలు వేలల్లో ఉంటున్నాయి. అద్దె మాత్రమే కాదు కనీసం కరెంట్ బిల్లు ఇవ్వలేకపోతున్నాం అంటున్నారు టైలర్లు.



మామూలు దుస్తులే కాదు పుట్టినరోజులు, వివాహాలు, ఇతరత్రా ఫంక్షన్లు ఏవైనా కూడా రెడీమేడ్ దుస్తులవైపే మొగ్గు చూపడం టైలర్ల జీవితాలను తలకిందులు చేసింది. టైలరింగ్‌కి ఇస్తే కనీసం వారం, పది రోజులు ఆగాలి. హడావుడి జీవితంలో అంత టైమెక్కడ? రెడీమేడ్ దుస్తులు అయితే వెంటనే వేసేసుకోవచ్చు అనేవాళ్ళూ ఉన్నారు. టైలరింగ్ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నవారికి రెడీమేడ్ దుస్తుల దుకాణాలు శాపంగా మారాయి.

అనారోగ్యాలూ...

టైలరింగ్ వల్ల సమస్యలూ తక్కువేం కాదు. గంటల కొద్దీ మిషన్ మీద కూర్చోవడం వల్ల కంటిచూపు మందగిస్తుంది. నిరంతరం మిషన్‌ను కాళ్ళతో తొక్కడం వల్ల కాళ్ళ వాపులు, నొప్పులు ఉంటాయి. టైలరింగ్ చేసేవాళ్ళు ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. తినడానికి తిండే లేని పరిస్థితుల్లో ఇంక ఆరోగ్యంపై శ్రద్ధ ఎక్కడ?

పట్టించుకోని ప్రభుత్వం

ఆది నుంచీ టైలరింగ్‌పై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు చాలానే ఉన్నాయి. ఈ కుటుంబాలు ఇప్పుడు చేసేందుకు పని లేక, ఆదుకునే నాధుడు లేక అల్లాడిపోతున్నాయి. రుణాల కోసం బ్యాంకుల చుట్టూ కాళ్ళరిగేలా తిరిగినా ఫలితం కనిపించడం లేదని వాపోతున్నారు. టైలర్లకు రుణాలు ఇచ్చేది లేదని బ్యాంకు అధికారులు బాహాటంగానే చెబుతున్నారు. పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్నా పట్టించుకోవడం లేదు. దీంతో పిల్లలను చదివించుకోలేక, కుటుంబాలను పోషించుకోలేక దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి టైలర్ల కుటుంబాలు. ఎన్ని అవస్థలు పడినా ఇల్లు గడిచే మార్గమే కనిపించడం లేదని ఆవేదన చెందుతున్నారు.



రెడ్డిపల్లి. రాము, రాంబిల్లి
విశాఖ జిల్లా

రుణాలు ఇవ్వండి!

ఆధునిక కుట్టు మిషన్లు కొనుగోలు చేసేందుకు బ్యాంకులు రుణాలు ఇవ్వాలని, టైలర్లుగా పనిచేసే వారికి 45 ఏళ్లకే రూ. 2 వేలు పెన్షన్ మంజూరు చేయాలని, ప్రతి పేద టైలరుకు ప్రభుత్వం ఇంటిని నిర్మించి ఇవ్వాలని, టైలర్లను కార్మికులుగా గుర్తించి ఇన్సూరెన్స్ ఇవ్వాలని, ఉచిత వైద్యసేవలు అందించాలని కోరుతున్నారు.





గతంలో వేలాది మంది టైలరింగ్ వృత్తిపై ఆధారపడి జీవించేవారు. ప్రస్తుతం రెడిమేడ్ దుస్తుల దుకాణాలు ఎక్కువగా రావడంతో టైలర్లతో బట్టలు కుట్టించుకునేవారు తక్కువయ్యారు. మెటీరియల్ ధరలు పెరగడంతో జత దుస్తులు కుడితే రూ. 50 మిగలడం కష్టంగా ఉంది. రుణాలు కోసం బ్యాంకులకు వెళితే టైలర్లు అంటేనే చులకనగా చూస్తున్నారు.

జాగు సత్తిబాబు, ఏటికొప్పాక

చాలామంది టైలరింగ్‌ను మరిచిపో తున్నారు. గిట్టుబాటు ధరలు లభించక పోవడంతో టైలరింగ్ మానేసి కూలి పనులకు వెళుతున్నారు. కొంతమంది టైలరింగ్ మానేసి ఏటిఎంల వద్ద సెక్యూరిటి గార్డులుగా పనిచేస్తున్నారు.

వియ్యపు సత్తిబాబు, యలమంచిలి



కనీసం పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చదివించలేకపోతున్నాం. ప్రస్తుతం చాలామంది మహిళలు టైలరింగ్‌పై ఆసక్తి చూపుతున్నా ప్రభుత్వం టైలర్ల కోసం ఎలాంటి పథకాలు అమలు చేయలేదు. బ్యాంకులు టైలర్లకు 50శాతం సబ్సిడీతో రుణాలు ఇవ్వాలి.

– మహిళా టైలర్లు

ఒంటికే కాదు వంటకు కూడా..!



దక్షిణాది వారిని ఎవరిని కదిలించినా ప్రపంచంలోనే అత్యుత్తమ నూనె కొబ్బరినూనె అని చెబుతారు. ఇది ఆలివ్ ఆయిల్ కంటే కూడా మంచి ఆయిల్ అని అంటారు. మరి ఇది నిజమేనా? లేదంటే ఇది ఉత్తుత్తి ప్రచారమేనా? అంటే నిజమేనంటున్నాయి అధ్యయనాలు కూడా. ఈ విషయాన్ని గణాంకాలతో సహా నిరూపించాయి కూడా. మరి ఈ అధ్యయనాలన్నీ ఏ విషయంలో జరిగాయో తెలుసా? వంటకి కొబ్బరి నూనె ఉపయోగించడంలో. అవును మీరు చదివింది కరక్టే. కొబ్బరినూనెను ఒంటికి రాసుకోవడం వల్ల 66 రకాల ప్రయోజనాలు అందుతాయనే విషయం ఇప్పటికే చాలాసార్లు రుజువైంది. ఇప్పుడు తాజాగా అధ్యయనాల్లో తేలిన విషయం, అన్ని ఆయిల్స్ కంటే ఉత్తమమైందని చెప్పిందీ వంట విషయంలోనే. కొబ్బరినూనె శరీరానికి రాసుకోవడం వల్ల ఎన్ని రకాల ప్రయోజనాలు ఉన్నాయో అంతకు రెట్టింపు ప్రయోజనాలు వంటకు ఉపయోగించడం వల్ల అందుతాయి. దీనివల్ల కలిగే ప్రయోజనాలు ఇవీ..

- ఈ నూనెను వంటలో ఉపయోగిస్తే జీవక్రియల వేగం సగటున ఐదు శాతం పెరుగుతుందట. జీవక్రియలు వేగం అందుకుంటే రోజు మొత్తం మీద కరిగే కేలరీలూ పెరుగుతాయి. తద్వారా తొందరగా బరువు తగ్గుతారు.
- కొబ్బరినూనెలో లారిక్ యాసిడ్ ఉంటుంది. ఇది ఒంటికి రాసుకుంటే చర్మం మీద ఉండే చెడు బాక్టీరియాను చంపేస్తుంది. అదే వంటకు ఉపయోగిస్తే జీర్ణవ్యవస్థలో ఉండే హానికరమైన క్రిములను నాశనం చేస్తుంది. కొవ్వులతో కూడిన విటమిన్లను సంగ్రహించుకునే గుణాన్ని పెంచడం ద్వారా జీర్ణవ్యవస్థ పనితీరునూ పెంచుతుంది. ఇందుకు అవసరమైన బాక్టీరియానూ ప్రోది చేస్తుంది.
- కొబ్బరినూనెలో ట్రైగ్లిజరైడ్స్ (ఎంసీటీఎస్-మీడియం చైన్ ట్రైగ్లిజరైడ్స్) ఎక్కువ ఉంటాయి. ఇవి జీవక్రియల వేగాన్ని పెంచడమే కాదు కండరాల బలాన్నీ పెంచుతాయి. మీలో శక్తి పెరగాలంటే రోజుకి మూడు టీ స్పూన్‌ల కొబ్బరినూనె తీసుకుంటే చాలు. కావలసినంత మేలు జరుగుతుంది. ఈ ఎంసీటీఎస్‌లు జ్ఞాపకశక్తినీ పెంచుతాయి. ఇవి మెదడుకి మేలు చేసే ఆరోగ్యకరమైన కొవ్వులు కూడా.



- వేళ కాని వేళలో ఆకలి వేస్తోందా? సమయానికి దొరికింది కదాని జంక్‌ఫుడ్ లాగించేస్తున్నారా? ఆనక తీరిగ్గా బాధపడతున్నారా? అయితే మీ సమస్యకు సరైన మందు కొబ్బరినూనె. ఇది ఆకలినీ తగ్గిస్తుందని అధ్యయనాల్లో తేలింది. ఇందుకు కారణం ఇందులో ఉండే కాప్రిక్ యాసిడ్.
- రక్తంలో ఉండే గ్లూకోజ్‌ని ఉపయోగించుకునేందుకు మన మెదడు స్వయంగా కొంత ఇన్సులిన్‌ని విడుదల చేస్తుంది. అల్జీమర్స్ వ్యాధికి గురైనవారిలో ఈ సామర్థ్యం ఉండదు. ఇలాంటివారు ఎక్కువగా కొబ్బరినూనె వాడాలి. శరీరం ప్రత్యామ్నాయ శక్తిగా ఉపయోగించుకునేందుకు వీలుగా కాలేయంలోని కీటోన్స్‌ని మారుస్తుంది. కొబ్బరినూనెను తరచుగా వాడడం ద్వారా ప్రమాదకరమైన అల్జీమర్స్ లక్షణాల నుంచి బయటపడవచ్చు. ఇది కూడా తాజా అధ్యయనాల్లో తేలిన అంశమే.
- కొబ్బరినూనె చాలా సులభంగా జీర్ణమవుతుంది. దీనిని తరచుగా తీసుకుంటే పాంక్రియాస్, గాల్ బ్లేడర్ మీద భారం ఉండదు. తద్వారా వీటి పని సామర్థ్యం పెరుగుతుంది.
- నోటిని శుభ్రంగా ఉంచుతుంది. ఆయిల్ పుల్లింగ్ కోసం ఈ కొబ్బరినూనెను ఉపయోగించండి. వారంలో కనీసం మూడుసార్లు కొబ్బరినూనెతో ఆయిల్ పుల్లింగ్ చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

గంధం... చల్లదనం!

వచ్చేసింది వేసవికాలం. ఉక్కపోత, చెమటతో చర్మం వేడెక్కి పోతుంది, కమిలి పోతుంది. ఈ పరిస్థితి రాకుండా ఉండా లంటే ఎండల ముదరకముందు నుంచే గంధం వాడండి. ఇది ఒంటికి చల్లదనాన్ని ఇస్తుంది. ఈ కారణంగానే వేసవిలో పూర్వం ఎక్కువగా గంధాన్నే ఉపయోగించేవారు. ఇది కురుపులనూ తగ్గిస్తుంది. గంధం వల్ల ఉపయోగాలు ఇవీ.



1. గంధాన్ని అరగదీసి కళ్ళ మీద రాసుకుంటే కళ్ళ ఎరుపులు, మంట తగ్గుతాయి.
2. రోజ్‌వాటర్‌లో గంధం కలిపి ముఖానికి రాసుకుంటే ముఖం మీద రాషెస్ పోతాయి.
3. పాలతో గంధాన్ని అరగదీసి ముఖానికి రాసుకుంటే ముఖం కాంతివంతంగా తయారవుతుంది
4. మంచి గంధం అరగదీసి రోజుకి రెండు. మూడుసార్లు ముఖానికి రాసుకుంటే మొటిమలు పోతాయి
5. స్నానం చేసే నీళ్ళల్లో గంధం నూనె అయిదారు చుక్కలు వేసుకుని స్నానం చేస్తే చర్మవ్యాధులు రావు. శరీరం సునాయాసంగా ఫ్రెష్ అవుతుంది.
6. చందనాది తైలం వల్ల తలనొప్పి, కళ్ళ మంటలూ తగ్గుతాయి
7. పిల్లలకు వేడి పొక్కులు వస్తే గంధం అరగదీసి రాస్తే తగ్గుతాయి.

తేన్పులా...యాలకులు వాడండి!



అన్నం తిన్నాక లేదా ఏదైనా కొంచెం భారీగా తిన్నాక పుల్లటి తేన్పులు వస్తున్నాయా? యాలకులు తినండి. కడుపు ఉబ్బరం, కడుపులో మంట, ఆకలి లేకపోవడం వంటి రుగ్మతల నుంచి బయటపడాలంటే యాలకులు రెండేసి నమిలితే సరిపోతుంది. ఇంకా శొంఠి, మిరియాలు, యాలకులు, జీలకర్ర వంటివి పుల్లటి తేనుపులను దూరం చేస్తాయి. అకాల భోజనం, నూనె పదార్థాలు, ఫలహారాలు, మసాలా పదార్థాలను తీసుకుంటే కొందరిలో పుల్లటి తేనుపుల సమస్య ఏర్పడుతుంది. అలాంటప్పుడు శొంఠి, మిరియాలు, యాలకులు, జీలకర్ర పొడులను అర స్పూన్ మేర తీసుకుని దాంతోపాటు అర స్పూన్ బెల్లాన్ని చేర్చి ఒక గ్లాసుడు నీటిలో మరిగించండి. ఈ మిశ్రమాన్ని ఆహారం తీసుకున్న అరగంట తర్వాత తీసుకుంటే పుల్లటి తేనుపులు దూరమవుతాయి. కడుపు ఉబ్బరం తొలగిపోతుంది. ఉసిరికాయ, అల్లం కూడా పుల్లటి తేనుపులను తగ్గిస్తాయి. ఉసిరికాయ రసాన్ని, అల్లం రసాన్ని సమపాళ్ళల్లో తీసుకుని తగినంత బెల్లం చేర్చి ఒక గ్లాసుడు నీళ్ళల్లో మరిగించాలి. ఆరిన తర్వాత తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.





డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

జరిగిన కథ

ప్రైవేటు చెపుతానని కుదురుకుని ఆ వెర్రివెంగళాయికి చదువు చెప్పడంపోయి వాడికి అబద్ధాలు నేర్పించడం, వాడికి చుట్ట అబ్బేటట్టు చెయ్యడం, అమాయకురాలు అయిన వాడి అక్కని వలలో వేసుకుని దాని గొంతుక కోయడానికి పూనుకోవడం - ఇలాంటి దుర్మార్గుడిని ఎలా ప్రేమిస్తాను? వాడి మూర్తిలో ఏం సౌందర్యం వుంటుంది? వాడి ముఖంలో ఏం వర్చస్సు కనిపిస్తుంది? వాడి కళ్ళల్లో ఏం తేజస్సు ప్రకాశిస్తుంది? "అయ్యా, మీరు చల్దివన్నం తింటారా?" అని అడగదంలో బుచ్చమ్మ నోరు తెరుచుకుని ఆశ్చర్యపడి చిరునవ్వు ముఖంతో అడగలేదు. ఏవగించుకున్న ముఖంతో, అసహ్యంతో కనుబొమలు చిట్లించుకుంటూ, ధుమధుమలాడుతున్న చూపులతోనే గిరిశాన్ని అల్పుడు అని గ్రహించేస్తుంది. కౌమారంలోంచి యవ్వనంలోకి వస్తూంది. సహజమయిన శీలం వుంది. వీడు యోగ్యుడు కాదు, వీడు కాపురుషుడు అని ఆ అమ్మాయి అంతరాత్మ చెపుతుంది.

(నిన్నటి సంచిక తరువాయి)

ఆ వయస్సులో స్త్రీ స్వభావం నాకు తెలుసు. వాంఛ అంటే యేమిటో తెలియదు. ప్రతి పురుషుడు మన్మధావతారమే అనుకోదు. అసలు పురుష సాంగత్యాన్నే కోరదు. "నువ్వు సౌందర్యవతివి. నీ కళ్ళలోంచి లావణ్యం పొంగి పొరలుతూంది. నీ వొళ్ళు బంగారంలా మెరుస్తూంది. నీ శరీరం కస్తూరిలా పరిమళిస్తూంది. తలకి నూనె రాసుకుని పాపిటతీసి దువ్వుకో. సైనుపంచ సరిగా కట్టుకో. రవిక తొడుక్కుని, పమిట సర్దుకో" అని చెప్పేవాళ్ళే లేరు. అంచేత సామాన్యంగా ఆనుమాయతకొద్దీ సమాజం ఆరోపించే "యవ్వనానికి సహజమైన బిడియం" ఆమెకి తెలియదు. అంచేత గిరీశాన్ని ముసిముసి నవ్వులతోను, కొంటెనవ్వులతోను చూడదు. తనకేదో కీడు మూడబోతూంది అనే లోలోపలనుంచి వచ్చే భయంతోను, కోపంతోనూ చూస్తుంది. తల్లిదండ్రుల తిట్లు ఆమెకి అలవాటే. తనకి జ్ఞానం వొచ్చింది మొదలు ఆ తిట్లే వింటూంది. 'నీ విధవముండ మోహం ఈడ్చ! తెల్లారిలేచి నీ ముఖం చూడడమే అయిందే! ఒరే బావా! కరటకశాస్త్రీ! ఈ మంగలివాడిని పిలిచి దాని తల గొరిగించరా! నాకు, దాని తల్లిముండకీ చచ్చే కాలానికికేనా నోట్లో నాలుగు మెతుకులేనా వొండి పడేయడానికి వీలవుతుంది' అని తండ్రీ, 'ముండమోసిన ముఖమా, దూరంగా పో! ముత్తైదువలు పెళ్ళిపిలుపుల కొస్తున్నారే! నీ అపశకునంతో యెక్కడ చావొచ్చి పడిందే! అబ్బిగాడికి పిల్లనిస్తాం అని వస్తున్నారే. నీ పాపిష్టి మొహం తగలెయ్యా! నిన్ను చూసి అపశకునం అని వెనక్కిపోతారే, పెరట్లోకి పోవే! వెయ్యి రూపాయలు యిస్తానని వస్తున్నారే! నీ ముండ ముఖం చూసి వందరూపాయలే అంటారే!' అని తల్లి శాపనార్థాలు వినడం ఆమెకి అలవాటే. కానీ యీ తిట్లకి ఆమెలో మూలదాక్కొనున్న అనిర్వచనీయమైన కోర్కెలకి రూపు రేఖలు యేర్పడవు. యే గిరీశంలాంటి పుండాకోరో వచ్చి ఆమెలో ఇంతవరకు లేని కామాన్ని రేకెత్తించి, ఆమె శీలాన్ని కొల్లగొడితే అది సంఘ సంస్కారం కాదు. సౌజన్యరావులాంటి 'వృత్తి సంస్కారుల' చేతుల్లోబడి దారంటపోయే దౌర్భాగ్యుదెవడికో దాన్నిచ్చి పెళ్ళిచేస్తే అది పైశాచికం కాని సంఘసంస్కరణం కాదు. శస్త్రం జయప్రదంగా జరిగింది - రోగిమాత్రం చచ్చాడన్నట్టు అది సంస్కరణ వివాహమే కావచ్చు కాని మడిగట్టుకుని బుచ్చమ్మ గొంతు కోయడం. దొంగ సంస్కర్తలు రంగేలా పురుషులూ అయిన గిరీశంలాంటివాళ్ళూ కీర్తికాముకులయిన సరదా సంస్కర్తలూ బుచ్చమ్మని రక్షించలేరు. బుచ్చమనీ, ఆమెతోపాటు భూస్వామ్య పతనంతో పురుషులు రాల్తూ పండిమాగిపోయినా యీ పీడిత తాడిత మానవ సమాజాన్నీ తరింపజేసేది గోపికాలోలుడైన కృష్ణుడు కాదు. ఉగ్ర నరసింహమూర్తి రావాలి, ఏకాదశ వతరంగా - స్పార్టకస్ జన్మించాలి. గిరీశం, కరటకశాస్త్రి, సౌజన్యారావు. వీళ్ళు స్పార్టకస్సులు కారు. ఆ స్పార్టకస్స్ బుచ్చమ్మలాంటి భగ్నజీవులకి, ధైర్యం, సాహసం, బలం, సంస్కృతి యిచ్చి వాళ్ళచేతే తమ ఇనపసంకెళ్ళని తెంచేటట్టు చేస్తాడు. బుచ్చమ్మకి భరతనాట్యం నేర్పించడు. కాళీయమర్దనం చేయిస్తాడు. ఆమె చేతికి మురళీ వీణెలు ఇవ్వడు. దారుణమైన ఖడ్గాన్ని చేపట్టిస్తాడు. ఆమె చేతికి మురళీ వీణెలు ఇవ్వడు. దారుణమైన ఖడ్గాన్ని చేపట్టిస్తాడు. అమెచేత రణభేరీ మోగిస్తాడు.



ఆమె నోటంట 'నీదుమోము బ్రైటటా' అని పిచ్చి పాటలు, బూతు పద్యాలుకావు పాడించేది. ఒక్క బిగిని ఢంగెత్తి పోయినట్టు ఉపన్యాసాలు కావు ఆమెచేత చెప్పించేది. "కదనరంగంలో దుముకుతూ, నిరోధక శక్తులను ఛేదించుతూ విజృంభించండి! మీ హక్కులను రక్షించుకోండి" అని యుద్ధ నినాదాలనిపిస్తాడు. మానవ సమాజానికి, తరతరాలకీ బుచ్చమ్మ యిచ్చే విముక్తి సందేశం రామతారకమంత్రం యిదే. బుచ్చమ్మ పాత్రని నేనిలా అర్థం చేసుకున్నాను. ఈ భాష్యం సమాజంవారికి నచ్చుతుందో, నచ్చదో నేను మాత్రం యిలాగే పాత్ర పోషణ చేసి నటిస్తాను. గిరీశం పాత్ర ఎవరు వేస్తారో? ఆ వేసే అతను గోల్డుస్మిత్తు 'వికార్ అఫ్ వేక్ ఫీల్డు'లో మేజోన్ ప్రయివేటు మేష్టరు పాత్రని అవగాహన చేసుకుంటే మంచిది. ఆ ప్రయివేటు మేష్టరు, ఈ ప్రయివేటు మేష్టరు ఒక్క తల్లికడుపున పుట్టిన కవల పిల్లలు. పోకిరీ వేషాల్లోనూ. నక్కజిత్తుల్లోను, ఆషాఢభూతి అబద్ధాల్లోను, డాబు డంబంలోను, అమాయకపు పిల్లలని చెరపట్టడంలోనూ ఒకడిని మించిన వాడొకడు. వీడు రేచుక్కైతే వాడు పగటిచుక్క. వీడు చిత్రాడదొంగైతే వాడు చింతాడ దొంగ. సమాజంలో ఇద్దరికీ స్థానం అసలు లేనేలేదు. ఈ చీడపురుగులని సమాజం నిర్మూలం చెయ్యాలి. గురజాడ వారి ఉద్దేశం ఇదే అయి వుంటుంది.

గురువారం పత్రికలో యిప్పుడే చదివేను. అలహాబాదు కాంగ్రెసు కమిటీ సమావేశంలో రాజగోపాలచారిగారి ప్రతిపాదన 15:120 వోట్లతో వీగిపోయిందిట. జగత్ నారాయణలాల్ ప్రత్యామ్నాయ ప్రతిపాదన 92:17 వోట్లతో గెల్చిందట. రాజగోపాలచారిగారు కాంగ్రెసు నుంచి రాజీనామా యిచ్చేశారట. పాపం, నాన్న యిప్పుడు యజమానిలేని కుక్కలాగ అయిపోయారు. అయితేనేం - అది గడుసుకుక్క, మంత్రిత్వం అనే ఎముకని యెవడు యెర జాపుతే వాడి వెంటే తోకాడించుకుంటూ పరిగెత్తుతుంది!

శనివారం: అమ్మ కలకత్తా నుంచి, నాన్న గయనుంచి వేరేవేరే టెలిగ్రాములు యిచ్చారు - కలకత్తానుంచి కలిసి ప్రయాణం చేసి మంగళవారం ప్రొద్దున్న చెన్నపట్నం చేరుతున్నాం అని. అమ్మ వెళ్ళకపోయినా నాన్న గయాశ్రాద్ధం పెట్టి పితృదేవతలని తరింపజేశారన్నమాటే!

14 అతడు

ఆదివారం జరిగిన విషయాలు, తెలిసిన సంగతులు తల్చుకుంటే నాతల తిరిగిపోతూంది. సోమవారం కచేరీకి వెళ్ళానన్న మాటేకాని కాగితం మీద కలం పెడితే వొట్టు. కాంక్రీటు చపటా రోడ్డులో టెంపరేచరు తేడాల వల్ల కలిగే "స్ట్రెస్సు"లని నిర్ధారణ చేయడానికి వెస్టరుగార్డు సూత్రాలని అన్వయిస్తూ సీతారాం లెక్కలు తయారుచేసి పంపించాడు. ఆ సూత్రాల్లో కొన్ని దిద్దుబాట్లు అవసరం అని యీ మధ్య థామ్‌లిన్‌సన్ను కొన్ని కొత్త సూత్రాలని సూచించారు. వాటి ప్రకారం మీ లెక్కలని పరిష్కృతం చెయ్యవలసిన అవసరం వుంది అని - ఆ 'ఫార్ములా'ని కాగితం మీద వేద్దును - ప్రతి అంకె తప్పే - నడవందే! బుర్రలో మరేవో ఆలోచనలు చేరి కోలాహలం చేస్తుంటే ఏం పని చెయ్యగలను? అంచేత మధ్యాహ్నం పూట సెలవుపెట్టి వచ్చేశా. నిన్న వెళ్ళలేదు. మనసు కాస్త కుదుటపడితే రేపు వెళతాను.

నన్ను చూడడానికంటూ సుభ యేప్పుడేనా నా యింటికి వస్తే యివి ఇవ్వాలి అవి ఇవ్వాలి ఇవి చూపించాలి అవి చూపించాలి యీ కబుర్లు చెప్పాలి ఆ కబుర్లు చెప్పాలి అని యెన్నెన్నో అనుకున్నాను. ఒక్కటీ జరగలేదు. అసలు సరిగా మర్యాదా అయినా చేశానో లేదో. ఆమె ఎంతో అపోహపడిందో? ఆమె స్నేహితురాండ్రందరూ నా గురించి ఆమెను ఏం హాస్యం చేశారో? ఆమె ఏమి చిన్నబుచ్చుకుందో? మా గిండీ కాలేజీ ఫోటోలు చూపిద్దాం ఆమెకి అనుకున్నా. నాకు కొత్తగా పని అయినప్పుడు అమ్మ - నేను కలిసి తీయించుకున్న ఫోటో చూపించి అమ్మ గురించి - నా చిన్నతనపు కష్టాల గురించి చెబుదాం అనుకున్నా. మొన్న ఆరంబాకం దగ్గిర తీయించుకున్న ఇంజనీర్ల 'గ్రూపుఫోటో' చూపించి, కొత్త రైల్వే లైను విశేషాలు చెబుదాం అనుకున్నాం. సీతారాం ఆ ఫోటోని సుభకి చూపించే వుంటాడు. అతనికి సుభతోను, ఆమె తల్లిదండ్రులతోను సీమలో ఉన్నప్పటినుంచీ పరిచయం వుందని సేట్జీ చెప్పాడుగా! సీతారాం మంచి తెలివితేటలు కలవాడు. హాస్యగాడు. డబ్బు - నాగరికతా ఉన్నవాడు. ఆవిడకీ, అతనికీ ఇట్టే కలుస్తుంది. నేను కూపస్థ మండూకాన్ని, ఆమె ప్రేమకోసం నేను సీతారాంతో పోటీ నిలబడగలనా?

కాని - సీతారాం తండ్రి సంపాదించిన లక్షలగురించి సేట్‌జీ చెప్పింది విన్న తరువాత సీతారాంకి ఆ పాపిష్టి డబ్బును ముట్టుకోడానికి ఎలా చేతులొస్తున్నాయి అనిపిస్తూంది. ఆ పాపంలో ప్రత్యక్షంగా కాకపోయినా, పరోక్షంగానైనా భాగం లేదా అతనికి? ఆ డబ్బు అనుభవిస్తున్నాడూ అంటే ఆ పాపానికి ఒడిగట్టుకుంటున్నాడనేకదా? రేపు పొద్దున్న అతనితో కరచాలనం ఎలా చెయ్యను? ఎంత దారుణం? ఎంతమంది స్త్రీల ఉసురు పోసుకుంటున్నారో కదా? ఎంతమంది స్త్రీల కన్నీటి రక్తపు చుక్కల్లో యీ డబ్బు తడిసిందో కదా? ఇది అంతా తెలిసినవాడు సీతారాం నలుగురి మధ్య యెలా గౌరవంగా తిరగ్గలుగుతున్నాడు? ఇది అంతా తెలిసినవాడు సీతారాం నలుగురి మధ్య యెలా గౌరవంగా తిరగ్గలుగుతున్నాడు? సుభతోనూ కడమ స్త్రీలతోనూ హాస్యాలు చేస్తూ ఎలా మసలగలుగుతున్నాడు? అసలు ఇతనికి తను తింటూన్న తిండి ఉలా వంటపట్టుతుంది? తన తండ్రి కాందిశీకులకోసం దేవుడిగుడి అన్నసత్రం కట్టించితే తను చేసినపాపం తుడుచుకుపోతుందనా? ఆయన ఇంకా ఆర్జిస్తూనే వున్నాడే! తండ్రి డబ్బు, ఐశ్వర్యం తను అనుభవిస్తున్నాడే - మరి ఇందుకు ప్రాయశ్చిత్తం యేం లేదా? తన తండ్రి గొప్ప వ్యవహర్త అనీ, కష్టపడి ఆర్జించాడనీ నాతో చెప్పాడే? అలాగు అబద్ధాలాడ్డానికి ఏం అవసరం వొచ్చింది? నేనేం అడిగేనా చేశానా? తన అంతరాత్మలో తన్ను తాను సమర్థించుకో జూస్తున్నాడన్న మాట! సుభతో ఈ సంగతినేనెంత మాత్రం ఎత్తనే యెత్తకూడదు. నేను అతనిమీద అసూయకొద్దీ అన్నాననుకుంటుంది.

- ఇంకా వుంది.

'నిమ్‌సెట్' దరఖాస్తుకు గడువు 31

- నిట్‌ల్లో ఎంసీఏ ప్రవేశానికి అర్హత పరీక్ష
- మే 27న వరంగల్‌లో

ఐటీ రంగంలోకి ప్రవేశించాలనుకునే వారికి ఇంజినీరింగ్‌కు ప్రత్యామ్నాయంగా ఉన్న ఇంకో కోర్సు ఎంసీఏ. ప్రోగ్రామింగ్ వృత్తిలో స్థిరపడాలన్నా, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ లేదా డిజైన్‌లో భాగస్వాములు కావాలన్నా ఈ డిగ్రీ చేయవచ్చు. ఐటీ నిపుణులు కావాలన్న తమ కలను సాకారం చేసుకోవచ్చు.

రోజురోజుకీ అభివృద్ధి చెందుతున్న ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలోకి అడుగు పెట్టాలనుకునే అభ్యర్థులకు ఇంజినీరింగ్ కాకుండా ఉన్న మరో చక్కటి మార్గం ఎంసీఏ (మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్). దేశంలోని ప్రఖ్యాత సంస్థల్లోని ఎంసీఏ కోర్సుల్లో చేరడానికి అర్హత కల్పించేందుకు ఏటా నిమ్‌సెట్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఎంసీఏ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్) నిర్వహిస్తున్నారు. ఈ పరీక్ష ద్వారా 11 నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)ల్లో ప్రవేశం లభిస్తుంది. వీటిలో వరంగల్ ఒకటి. దేశవ్యాప్తంగా 31 జాతీయ సాంకేతిక విద్యా శిక్షణ సంస్థ (నిట్)లు ఉన్నాయి. అయితే వీటిలో 11 మాత్రమే ఎంసీఏ కోర్సును అందిస్తున్నాయి. ఈ 11 సంస్థలూ ఉమ్మడి పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేసి ఎంసీఏ కోర్సులోకి ప్రవేశం కల్పిస్తున్నాయి. ఈ ఏడాది పరీక్షను నిట్ సూరత్కల్ నిర్వహిస్తోంది.

ఎంసీఏ అందిస్తోన్న నిట్‌లు : అగర్తలా, అలహాబాద్, భోపాల్, కాలికట్, దుర్గాపూర్, జంషెడ్ పూర్, కురుక్షేత్ర, రాయ్‌పూర్, సూరత్కల్, తిరుచి రాపల్లి (ట్రిచీ), వరంగల్.

ఐటీ సంస్థల అవసరాల ప్రకారం ఇక్కడి ఎంసీఏ సిలబస్‌ను రూపొందిస్తారు. ఈ 11 సంస్థలూ ఒకే సిలబస్‌ను అనుసరిస్తాయి.

అర్హత : బీఎస్సీ, బీసీఏ, బీఐటీ, బీటెక్/ బీఈ వీటిలో ఏదైనా డిగ్రీలో కనీసం 60 శాతం మార్కులతో (ఎస్సీ, ఎస్టీలైతే 55 శాతం) ఉత్తీర్ణత సాధించాలి.



ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

సీట్ల సంఖ్య : ఎంసీఏ కోర్సు అందిస్తోన్న 11 ఎన్‌ఐటీల్లోనూ మొత్తం 805 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ సీట్లన్నీ రాత పరీక్షలో చూపిన ప్రతిభ, రిజర్వేషన్ల ప్రాతిపదికన అఖిల భారత స్థాయిలో భర్తీ చేస్తారు. ఆయా నిట్‌లవారీ రాష్ట్రాల కోటా లేదు. మొత్తం 805 సీట్లలో 387 సీట్లు ఓపెన్ కేటగిరీ ద్వారా భర్తీ చేస్తారు. ఈ సీట్ల కోసం దేశవ్యాప్తంగా పరీక్షకు హాజరైన అభ్యర్థులంతా పోటీ పడవచ్చు. 209 సీట్లు ఓబీసీలకు, 114 ఎస్సీ విద్యార్థులకు, 54 సీట్లు ఎస్టీ అభ్యర్థులకు కేటాయించారు. దివ్యాంగుల కోసం 41 సీట్లు ఉన్నాయి (వీటిలో 18 సీట్లు కోసం దివ్యాంగులు అందరూ పోటీ పడవచ్చు. 9 సీట్లు ఓబీసీ, 9 సీట్లు ఎస్సీ, 5 సీట్లు ఎస్టీ దివ్యాంగులకు కేటాయించారు).

సంస్థలవారీ సీట్ల వివరాలు : అగర్తలా- 40, అలహాబాద్ - 93, భోపాల్ - 92, కాలికట్ - 46, దుర్గాపూర్- 30, జంషెడ్‌పూర్ - 92, కురుక్షేత్ర - 60, రాయ్‌పూర్- 92, సూరత్కల్- 92, తిరుచు రాపల్లి- 92, వరంగల్- 46, కురుక్షేత్ర- 30.

పరీక్ష తేదీ : 27.05.2018 (ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు)

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రం : వరంగల్.

ఫలితాలు : జూన్ 6న ప్రకటిస్తారు.

దరఖాస్తు ఫీజు : జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.2200; ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.1100.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ : 31.03.2018 (సాయంత్రం 5 వరకు)

వెబ్‌సైట్ : https://nimcet.in

ప్రశ్నపత్రం

మొత్తం 120 ప్రశ్నలుంటాయి. పరీక్ష వ్యవధి రెండు గంటలు. అంటే ప్రతి ప్రశ్నకు నిమిషం సమయం కేటాయించుకోవచ్చు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. సబ్జెక్టుల వారీ మ్యాథమేటిక్స్ 50 ప్రశ్నలు, అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ 40, కంప్యూటర్ అవేర్‌నెస్ 10, జనరల్ ఇంగ్లిష్ నుంచి 20 ప్రశ్నలడుగుతారు. ప్రతి సరైన జవాబుకు 4 మార్కులు. రుణాత్మక మార్కులు ఉన్నాయి. తప్పుగా గుర్తించిన ప్రతి సమాధానానికీ ఒక మార్కు తగ్గిస్తారు.

మార్కుల వెయిటేజీ : మొత్తం మార్కులను 1000గా పరిగణిస్తారు. అంటే మ్యాథ్స్‌లో మొత్తం మార్కులకు 3 రెట్లు, అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ మార్కులకు ఒకటిన్నర రెట్లు, కంప్యూటర్ అవేర్‌నెస్ విభాగంలోని మార్కులకు 2 రెట్లు, ఇంగ్లిష్ మార్కులను యథావిధిగా ఉంచి లెక్కిస్తారు. ఈ లెక్కన మ్యాథ్స్ విభాగానికి 600 మార్కులన్నమాట. (50 ప్రశ్నలు, ఒక్కో ప్రశ్నకు 4 మార్కులు కాబట్టి మొత్తం 200 మార్కులు. వీటికి 3 రెట్లు అంటే 600 మార్కులు) అలాగే అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ 240 (మొత్తం 40 ప్రశ్నలు, ప్రతి ప్రశ్నకు 4 మార్కులు కాబట్టి 160 మార్కులు. వీటికి ఒకటిన్నర రెట్లు అంటే 160o80=240 మార్కులు), కంప్యూటర్ అవేర్‌నెస్ 80 (10 ప్రశ్నలకు 40 మార్కులు దానికి రెట్టింపు 80), ఇంగ్లిష్ విభాగానికి 80 (20 ప్రశ్నలు. ఒక్కో ప్రశ్నకు 4 మార్కులు కాబట్టి 80) మార్కులు కేటాయించారు.

మంచి కెరీర్‌కు మరో దారి..

డిప్లొమా ఇన్ హియరింగ్ ఎయిడ్ అండ్ ఇయర్ మౌల్డ్ టెక్నాలజీ



దేశంలో స్పీచ్ అండ్ హియరింగ్ కోర్సులకు మైసూర్‌లోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ సంస్థ ప్రఖ్యాతమైంది. దివ్యాంగులకు నాణ్యమైన విద్య, సేవలందించే సుశిక్షితులను తయారు చేసేందుకు ఈ సంస్థను ఏర్పాటుచేశారు. ఈ సంస్థలో డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ స్థాయుల్లో పలు కోర్సులు ఉన్నాయి. పరీక్షలో చూపిన ప్రతిభ ద్వారా ఎంపికచేస్తారు. ఇందులో చేరినవారికి ప్రతినెలా స్టైపెండ్ అందిస్తున్నారు.

ఏఐఐఎస్‌హెచ్‌తోపాటు అనుబంధ సంస్థల్లో వివిధ కోర్సుల్లో ప్రవేశానికి ప్రకటన వెలువడింది.

డిప్లొమా కోర్సులు

1. డిప్లొమా ఇన్ హియరింగ్ ఎయిడ్ అండ్ ఇయర్ మౌల్డ్ టెక్నాలజీ

- సీట్ల సంఖ్య: 25
- 1 అర్హత: ఫిజిక్స్‌తో ఇంటర్ లేదా ఎలక్ట్రికల్ / ఎలక్ట్రానిక్స్ బ్రాంచ్‌ల్లో డిప్లొమా / ఐటీఐ లేదా డెంటల్ టెక్నీషియన్ కోర్సు పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థులు సంబంధిత అర్హత పరీక్షలో కనీసం 50 (ఎస్సీ, ఎస్టీలైతే 45) శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.
- **వయసు :** జులై 1, 2018 నాటికి 24 ఏళ్లలోపు.

2. డిప్లొమా ఇన్ ఎర్లీ చైల్డ్‌హుడ్ స్పెషల్ ఎడ్యుకేషన్

- సీట్ల సంఖ్య : 25
- **అర్హత :** ఏదైనా గ్రూప్‌తో ఇంటర్‌లో కనీసం 50 (ఎస్సీ, ఎస్టీలైతే 45) శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.
- **వయసు :** 17 ఏళ్లు ఉండాలి.

3. డిప్లొమా ఇన్ హియరింగ్, లాంగ్వేజ్ & స్పీచ్

- **సీట్ల సంఖ్య:** ఒక్కో సెంటర్‌లో 25 చొప్పున ఉంటాయి. ఈ కోర్సును ఏఐఐఎస్‌హెచ్‌తోపాటు మరో ఎనిమిది సంస్థల్లో నిర్వహిస్తున్నారు.
- **అర్హత :** ఇంటర్‌లో ఎంపీసీ లేదా బైపీసీ గ్రూప్‌తో కనీసం 50 (ఎస్సీ, ఎస్టీలైతే 45) శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.
- **వయసు :** జులై 1, 2018 నాటికి 21 ఏళ్లలోపు.
- ఈ కోర్సుల వ్యవధి ఏడాది. ఎంపికైనవారికి నెలకు రూ.250 చొప్పున పది నెలలపాటు స్టైపెండ్ చెల్లిస్తారు.

పీజీ డిప్లొమా

1. పీజీ డిప్లొమా ఇన్ అగ్మెంటేటివ్ అండ్ ఆల్టర్నేటివ్ కమ్యూనికేషన్
- **అర్హత :** బీఎస్సీ (స్పీచ్ అండ్ హియరింగ్) / బీఏఎస్ఎల్‌పీ / స్పెషల్ బీఎడ్ వీటిలో ఎందులోనైనా 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత. కోర్సు వ్యవధి ఏడాది. 20 సీట్లు ఉన్నాయి.

2. పీజీ డిప్లొమా ఇన్ క్లినికల్ లింగ్విస్టిక్స్ ఫర్ స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ
- **అర్హత :** బీఎస్సీ (స్పీచ్ అండ్ హియరింగ్) / బీఏఎస్ఎల్‌పీ / స్పెషల్ బీఎడ్ వీటిలో ఎందులోనైనా 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత. కోర్సు వ్యవధి ఏడాది. 10 సీట్లు ఉన్నాయి.

3. పీజీ డిప్లొమా ఇన్ ఫోరెన్సిక్ స్పీచ్ సైన్స్ అండ్ టెక్నాలజీ
- **అర్హత :** బీఎస్సీ - ఫిజిక్స్ / మ్యాథ్స్ / ఎలక్ట్రానిక్స్ / కంప్యూటర్ సైన్స్ / ఫోరెన్సిక్ సైన్స్ / లేదా స్పీచ్ అండ్ హియరింగ్ ముఖ్యాంశంగా బీఎస్సీ / బీఏఎస్ఎల్‌పీ లేదా బీటెక్ - ఎలక్ట్రానిక్స్ / కంప్యూటర్ సైన్స్/ కమ్యూనికేషన్ లేదా ఎంబీబీఎస్ కోర్సు వ్యవధి ఏడాది. 10 సీట్లు ఉన్నాయి.

4. పీజీ డిప్లొమా ఇన్ న్యూరో ఆడియాలజీ
- **అర్హత :** బీఎస్సీ (స్పీచ్ అండ్ హియరింగ్) / బీఏఎస్ఎల్‌పీ కోర్సు వ్యవధి ఏడాది. 10 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సులకు ఎంపికైనవారికి నెలకు రూ.500 చొప్పున స్టైపెండ్ చెల్లిస్తారు.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ : మే 2
- పరీక్ష తేదీ: మే 26
- వెబ్‌సైట్ : http://aiishmysore.in

బ్యాచిలర్ డిగ్రీ... 1.

1. బ్యాచిలర్ ఆఫ్ ఆడియాలజీ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ
- **సీట్లు :** ఏఐఐఎస్‌హెచ్‌లో 62, జబల్‌పూర్‌లోని ఎన్ఎస్‌సీబీఎంసీలో 10.
- **అర్హత :** ఇంటర్‌లో ఎంపీసీ లేదా బైపీసీ గ్రూప్‌తో కనీసం 50 (ఎస్సీ, ఎస్టీలైతే 45) శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.

కోర్సు వ్యవధి నాలుగేళ్లు. ఎంపికైనవారికి మొదటి మూడేళ్ల సంవత్సరానికి 10 నెలల పాటు నెలకు రూ.800 చొప్పున స్టైపెండ్ చెల్లిస్తారు. నాలుగో ఏడాది ఇంటర్న్‌షిప్‌లో భాగంగా నెలకు రూ.5000 చొప్పున చెల్లిస్తారు.

2. స్పెషల్ బీఎడ్
- సీట్లు: 20
- అర్హత : ఏదైనా డిగ్రీలో కనీసం 50 (ఎస్సీ, ఎస్టీలైతే 45) శాతం మార్కులతో ఉత్తీర్ణత. అలాగే జులై 1, 2018 నాటికి అభ్యర్థి వయసు 30 ఏళ్లలోపు ఉండాలి.

కోర్సు వ్యవధి రెండేళ్లు. ఇందులో చేరినవారికి నెలకు రూ.400 చొప్పున ఏటా పది నెలలపాటు స్టైపెండ్ చెల్లిస్తారు.

ఆన్‌లైన్‌లో ఉద్యోగ నియామక పరీక్షలు...

ప్రిపరేషన్‌కు సన్నద్ధానికి సూచనలు



ఆన్‌లైన్ పరీక్షలకు హాజరుకాబోయే అభ్యర్థులు తప్పనిసరిగా ఆన్‌లైన్ మాక్‌టెస్టులు ప్రాక్టీస్ చేయాలి. తొలుత ఆయా పరీక్షలకు సంబంధించి సబ్జెక్టుల వారీగా పరీక్షలు రాయాలి. మొత్తం సిలబస్ చదవడం పూర్తయ్యాక గ్రాండ్ టెస్టులు ప్రాక్టీస్ చేయాలి.

ఆన్‌లైన్ మాక్ పరీక్షలకు హాజరు కావడం ద్వారా పరీక్ష విధానానికి అలవాటుపడటంతోపాటు టైం మేనేజ్‌మెంట్ అలవడుతుంది. ఎంత సమయంలో ఎన్ని ప్రశ్నలకు సమాధానం ఇవ్వగలుగుతున్నారో తెలుస్తుంది. ప్రిపరేషన్ పరంగా బలాలు-బలహీనతలు తెలుస్తాయి.

ఆన్‌లైన్ మాక్ పరీక్ష రాసిన తర్వాత పేపర్, 'కీ'ని డౌన్‌లోడ్ చేసుకొని సమీక్షిస్తే మంచి ఫలితం ఉంటుంది. ఏవైనా సందేహాలుంటే సంబంధిత సబ్జెక్టు నిపుణులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలి.

ఆన్‌లైన్ మాక్ టెస్టుల వల్ల అభ్యర్థులు తమ సన్నద్ధత స్థాయిని అంచనా వేసుకొని, తదనుగుణంగా ప్రిపరేషన్ ప్రణాళికను మార్చుకోవచ్చు.

వాస్తవ ఆన్‌లైన్ పరీక్ష రాసేముందు సిస్టమ్‌కు సంబంధించి ఎలాంటి టెక్నికల్ సమస్యలున్నా వెంటనే పరీక్ష కేంద్రం సమన్వయకర్త దృష్టికి తీసుకెళ్లాలి.

చాలా ఆన్‌లైన్ మాక్‌టెస్టులు రాశాం కాబట్టి, మళ్లీ వాస్తవ పరీక్ష సమయంలో నిబంధనలు (Instructions) చదవనవసరం లేదన్న భావనతో కొందరు నేరుగా పరీక్ష రాయడం ప్రారంభిస్తారు. ఇది సరికాదు. తప్పనిసరిగా ముందు నిబంధనలన్నీ చదవాలి. తొలుత బాగా తెలిసిన ప్రశ్నలన్నింటికీ సమాధానాలు గుర్తించాలి. దీనివల్ల ఆత్మవిశ్వాసం పెరిగి, ఒత్తిడికి తావులేకుండా మిగిలిన ప్రశ్నలకు సమాధానాలు గుర్తించవచ్చు.



ఎస్సీ విద్యార్థుల విదేశీ విద్యకు ఉపకారవేతనాలు

2017-18 విద్యా సంవత్సరంలో విదేశాల్లో పీజీ (మూడేళ్లు), పీహెచ్‌డీ (నాలుగేళ్లు) చదవాలనుకునే ఎస్సీ మొదలైన సామాజికవర్గ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇచ్చేందుకు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

స్కాలర్‌షిప్‌ల సంఖ్య : 100 (30 స్కాలర్‌షిప్‌లను మహిళలకు కేటాయించారు)

సబ్జెక్టుల వారీగా ఖాళీలు : ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్-32, ప్యూర్ సైన్సెస్ అండ్ అప్లైడ్ సైన్సెస్-17, అగ్రికల్చరల్ సైన్సెస్ అండ్ మెడిసిన్-17, ఇంటర్నేషనల్ కామర్స్, అకౌంటింగ్ ఫైనాన్స్-17, హ్యుమానిటీస్, సోషల్ సైన్స్, ఫైన్ ఆర్ట్స్-17.

అర్హత : పీజీ/ యూజీలో 55 శాతం మార్కులు/ తత్సమాన గ్రేడ్‌తో పాటు విదేశాల్లో ప్రభుత్వ గుర్తింపు పొందిన వర్సిటీలు/ ఇన్‌స్టిట్యూట్లలో పీజీ/ పీహెచ్‌డీలో ప్రవేశానికి అన్‌కండిషనల్ ఆఫర్ లెటర్ ఉన్నవారు (లేదా) అడ్మిషన్ కోసం ప్రయత్నిస్తున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆదాయం : విద్యార్థి కుటుంబ వార్షికాదాయం రూ.6 లక్షల లోపు ఉండాలి.

వయసు : 2017 ఏప్రిల్ 1 నాటికి 35 ఏళ్లలోపు ఉండాలి.

ఎంపిక విధానం : (అర్హతలను బట్టి) 'మొదట వచ్చినవారికి మొదటి ప్రాధాన్యత' ప్రాతిపదికన ఎంపిక చేస్తారు.

దరఖాస్తు విధానం : నిర్దేశిత నమూనాలో పూర్తి చేసిన దరఖాస్తులను మంత్రిత్వ శాఖ కార్యాలయానికి పంపాలి.

దరఖాస్తు చివరి తేదీ : 2018 మార్చి 31

వెబ్‌సైట్ : www.socialjustice.nic.in

డీఆర్‌డీవో ఐటీఆర్‌లో 30 పోస్టులు

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీవో).. ఒడిశాలోని చాందీపూర్‌లో ఏర్పాటుచేసిన ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్(ఐటీఆర్)లో 30 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు : 30, **పోస్టు :** టెక్నీషియన్ అప్రెంటీస (డిప్లొమా).

శిక్షణ వ్యవధి : 12 నెలలు.,

స్టైపెండ్ : రూ.3,542.

విభాగాల వారీ ఖాళీలు : కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/ ఐటీ-7, ఎలక్ట్రానిక్స్-8, ఎలక్ట్రికల్-5, మెకానికల్-5, సివిల్-5.

ఎంపిక : వాకిన్ ఇంటర్వ్యూ(ఇదే రోజు రాతపరీక్ష కూడా ఉంటుంది).

దరఖాస్తు విధానం : అభ్యర్థులు మొదట www.mhrdnats.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. అనంతరం వెబ్‌సైట్‌లో చూపిన నమూనా దరఖాస్తు పత్రంలో వివరాలను నింపి, దానికి సంబంధిత ధ్రువపత్రాలు జతచేసి నేరుగా వాకిన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలి.

వాకిన్ ఇంటర్వ్యూ తేదీ : మార్చి 28, 2018.

వాకిన్ వేదిక : ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్(ఐటీఆర్), చాందీపూర్-756025, బాలాసోర్, ఒడిశా.

వెబ్‌సైట్ : www.drdo.gov.in

ఐఐఎస్ఈఆర్ తిరుపతిలో పీహెచ్‌డీ కోర్సులు

తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఈఆర్)... 2018 ఆగస్టు సెషన్‌కు పీహెచ్‌డీ, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

పరిశోధన విభాగాలు : బయాలజీ, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్. పీహెచ్‌డీలో అదనంగా ఎర్త్ అండ్ క్లైమేట్ సైన్స్ సంబంధిత అంశాల్లోనూ పరిశోధనలు చేయొచ్చు.



దరఖాస్తు విధానం : ఆన్‌లైన్‌లో

దరఖాస్తు చివరి తేదీ : ఏప్రిల్ 15, 2018.

వెబ్‌సైట్ : www.iisertirupati.ac.in

'ప్రైమ్ మినిస్టర్ రీసెర్చ్ ఫెలోషిప్' నోటిఫికేషన్ విడుదల

శాస్త్ర, సాంకేతిక విద్యలో పరిశోధనలకు మరింత ఊతం ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రైమ్ మినిస్టర్ రీసెర్చ్ ఫెలోషిప్'నకు దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువడింది. ఎంపికైన అభ్యర్థులకు దేశంలోని ప్రతిష్ఠాత్మక ఐఐటీ/ ఐఐఎస్సీలో పీహెచ్‌డీ ప్రవేశం కల్పిస్తారు.

స్టైపెండ్ : మొదటి ఏడాది నెలకు రూ.70,000; రెండో ఏడాది- రూ.75,000; చివరి మూడు సంవత్సరాల్లో నెలకు రూ.80,000 ఇస్తారు.

అర్హతలు : ఏదైనా ఐఐటీ/ ఐఐఎస్సీ/ ఎన్ఐటీ/ ఐఐఎస్ఈఆర్/ ఐఐఐటీలో సైన్స్/ టెక్నాలజీ విభాగాల్లో నాలుగేళ్ల అండర్‌గ్రాడ్యుయేట్/ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంటెక్/ ఎంఎస్సీ/ ఐదేళ్ల యూజీ-పీజీ డ్యూయల్ డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. ఈ కోర్సుల తుది సంవత్సరం విద్యార్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తు విధానం : ఆన్‌లైన్లో

దరఖాస్తు చివరి తేదీ : మార్చి 31, 2018.

వెబ్‌సైట్ : pmrf.in

విశాలాంధ్ర బిజినెస్

-61.16 ▼	5.45 ▲	-200 ▼	బంగారం (విశాఖపట్నం)	100 ▲	వెండి (విశాఖపట్నం)	డాలరు
సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	29,020	వెండి (విజయవాడ)	41,500	Vs
33,856.78	10,426.85	29,000	ప్రొద్దుటూరు 29,020	39,500	ప్రొద్దుటూరు 41,446	రూపాయి
			22 క్యారట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	64.89

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
యాక్సిస్ బ్యాంక్	530.80	2.23
సన్‌ఫార్మా	522.90	2.04
విప్రో	295.55	1.65
రెడ్డీ ల్యాబ్స్	2,194.00	1.60
భారతీ ఎయిర్‌టెల్	429.00	1.22

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
టీసీఎస్	2,892.45	-5.22
కోటక్ మహీంద్ర	1,084.55	-1.46
కోల్‌ఇండియా	294.75	-1.02
ఎన్‌టీపీసీ	171.00	-0.94
మారుతిసుజుకి	8,990.00	-0.66

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	65.04	64.89
యూరో	79.96	80.26
పౌండ్	90.15	90.56
ఆస్ట్రేలియా డాలర్	51.13	51.21
సింగపూర్ డాలర్	49.46	49.52

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	29,020	31,037
చెన్నై	28,970	30,983
బెంగళూరు	28,450	30,427
ముంబై	29,760	31,828
విజయవాడ	29,000	31,400
విశాఖపట్నం	29,020	31,040
ప్రొద్దుటూరు	29,020	30,470
ముడి చమురు		64.95

15పైసలు లాభపడిన రూపాయి



ముంబై: డాలర్ మారకంతో రూపాయి విలువ 15పైసలు లాభపడి 64.89 వద్ద నిలిచింది. విదేశీ నిధుల ప్రవాహం, ఎగుమతులు నేపథ్యంలో డాలర్ అమ్మకాలు పెరగడం, ఇతర దేశాల కరెన్సీలతో డాలర్ లబ్దిపొందడంతో రూపాయి లాభపడేందుకు దోహదపడింది. జనవరి పారిశ్రామికోత్పత్తి 7.5 శాతం పెరగడంతో అమెరికా డాలర్ అమ్మకాలు పెరగడంతో రూపాయి బలపడినట్లు ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. సోమవారం రూపాయి అత్యధికంగా 13పైసల లాభంతో 65.04 వద్ద నిలచింది.

త్వరలో రూ.1,245 కోట్ల ఎన్‌పీఏల అమ్మకం

న్యూఢిల్లీ: మొండి బకాయిలను వదిలించుకుని బ్యాలెన్స్ షీట్లను ప్రక్షాళన చేసుకునేందుకు ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)లు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా రూ.1,245 కోట్ల విలువైన నిరర్థక ఆస్తులను (ఎన్‌పీఏలను) అమ్మేందుకు కొనుగోలుదారుల కోసం ఎదురుచూస్తున్న ఎస్‌బీఐ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా), యూకో బ్యాంక్‌లు ఈ విషయమై అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఏఆర్‌సీ)లు, ఆర్థిక సంస్థ (ఎఫ్ఐ)లు, బ్యాంకులు, బ్యాంకింగ్ యేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల నుంచి బిడ్లను ఆహ్వానించాయి. నిరర్థక ఆస్తుల అమ్మకానికి సంబంధించి రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా సవరించిన విధానం ప్రకారం జెనిత్ బిర్లా (ఇండియా) లిమిటెడ్, సోనా అల్లాయిస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆస్తులను అమ్మకానికి పెడుతున్నామని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తమ బిడ్ డాక్యుమెంట్‌లో స్పష్టం చేసింది. ఎస్‌బీఐకి సోనా అల్లాయిన్ సంస్థ రూ.647.64 కోట్లు, జెనిత్ బిర్లా సంస్థ రూ.139.36 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఈ రెండు సంస్థల ఆస్తులను అమ్మేందుకు ఈ నెల 23వ తేదీన ఈ-బిడ్డింగ్ ప్రక్రియను నిర్వహించడం జరుగుతుందని, వీటిని కొనుగోలు చేయాలని ఆసక్తితో ఉన్నవారు ఈ నెల 12వ తేదీన బిడ్లు దాఖలు చేయాలని ఎస్‌బీఐ సూచించింది. ఇదే విధంగా రూ.457.98 కోట్ల బకాయిలను రాబట్టుకునేందుకు దాదాపు 13 నిరర్థక ఆస్తులను గుర్తించిన యూకో బ్యాంకు ఈ నెల 13వ తేదీలోగా వాటిని అమ్మాలని నిశ్చయించుకున్నది. వీటిని కొనుగోలు చేయదల్చుకున్న ఏఆర్‌సీలు, బ్యాంకులు, ఎఫ్ఐలు, ఎన్‌బీఎఫ్‌సీల నుంచి ఆ బ్యాంకు ఆసక్తి లేఖలను ఆహ్వానించింది. వివిధ కంపెనీలకు ఇచ్చిన రూ.16,349 కోట్ల రుణాలను రాబట్టుకునేందుకు దేశీయ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో అతిపెద్దదైన ఎస్‌బీఐ గత వారం యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ)తో పాటు దీర్ఘకాలిక మౌలిక వసతుల రుణ సంస్థ ఐఎఫ్‌సీఐతో కలసి అనేక నిరర్థక ఆస్తులను అమ్మకానికి పెట్టిన విషయం విదితమే. గత డిసెంబర్ నెలాఖరు నాటికి దేశంలోని అన్ని బ్యాంకుల నిరర్థక ఆస్తులు రూ.8.41 లక్షల కోట్లకు చేరుకోగా, వీటిలో అత్యధిక ఎన్‌పీఏలు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోనే పేరుకుపోయాయి. దీంతో గత కొంత కాలం నుంచి రుణాల రికవరీ ప్రక్రియను వేగవంతం చేసిన ప్రభుత్వ రంగ బ్యాంకులు మొండి బకాయిలుగా మారిన నిరర్థక ఆస్తులను అమ్మేందుకు ప్రత్యేకంగా చర్యలు చేపడుతున్నాయి.

ఇంకా తగ్గని నోట్ల సెగ

దిగజారిన గృహస్థుల ఆర్థిక ఆస్తులు



పెద్దనోట్లరద్దు (డీమానిటైజేషన్) అనంతరం హౌస్‌హోల్డ్స్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ (గృహస్థుల ఆర్థిక ఆస్తులు) అనగా కరెన్సీ, బ్యాంకు డిపాజిట్ షేర్ల రుణాల వాటాలు, సెక్యూరిటీస్, ఈక్విటీలు, నెట్ ఈక్విటీలు, లైఫ్ ఇన్సూరెన్స్ రిజర్వులు,పెన్షన్ ఫండ్స్, ప్రిపేమెంట్ ఆఫ్ ప్రీమియమ్స్ అండ్ రిజర్వులు, ఇతర ఎకౌంట్ల శాతం భారీగా పడిపోయిందని ఆర్‌బీఐ తాజా నివేదిక వెల్లడించింది. 2017 సెప్టెంబరు చివరినాటికి గృహ, ఆర్థిక ఆస్తుల పెరుగుదల 9.7శాతం నమోదుకాగా 2016 చివరినాటికి 17.1శాతంగా ఉంది. ఆర్‌బీఐ తాజా గణాంకాల ఆధారంగా గృహ ఆర్థిక ఆస్తుల విలువ, 2016 సెప్టెంబరులో రూ.141ట్రిలియన్లు కాగా 2016 డిసెంబరు చివరినాటికి రూ.137 ట్రిలియన్లుకు పడిపోయినట్లు తేలింది. స్థూల జాతీయోత్పత్తి నిష్పత్తి ప్రకారం(జీడీపీ), 2016 సెప్టెంబరులో గృహస్థుల ఆర్థిక ఆస్తుల విలువ 95.2శాతం కాగా 2016, డిసెంబరు చివరినాటికి 89.2శాతానికి పడిపోయింది. 2017 సెప్టెంబరు చివరి నాటికి, తాజా గణాంకాల ప్రకారం ఇప్పటి వరకు 2016 సెప్టెంబరుకన్నా మరింత దిగజారినట్లు తెలుస్తోంది. గృహస్థుల పొదుపుపథకాలు ఈ త్రైమాసికంలో అస్థిరతలో ఉన్నట్లు తెలుస్తోంది. భారతీయులు సాధారణంగా పొదుపు పథకాలకు ఎక్కువ మొగ్గు చూపుతారు. కానీ పెద్దనోట్లరద్దు అనంతరం ఈ పథకం పూర్తిగా ప్రతికూలంగా మారిందని చెప్పవచ్చు. 2016-17 సంవత్సరం మూడవ త్రైమాసికంలో డీమాని టైజేషన్ ప్రభావం మరింతగా ప్రతిబింబిస్తోంది. 2017 సెప్టెంబరు చివరినాటికి కరెన్సీ హోల్డింగ్స్ జడీపీలో 8.7 శాతానికి పడిపోగా, డీమానిటైజేషన్‌కు ముందు త్రైమాసికంలో 10.6శాతంగా ఉంది. హౌస్‌హోల్డ్స్‌కు సంబంధించి మ్యూచ్యువల్ ఫండ్స్ 10.6శాతం నుండి 2017 సెప్టెంబరులో 12.5శాతానికి పెరిగింది. కరెన్సీ/జీడీపీ పతనం మ్యూచ్యువల్ ఫండ్స్/జీడీపీ పెరుగుదలలో ప్రతిబింబిస్తోంది. ప్రజలు వారి కరెన్సీ హోల్డింగ్స్‌ను ఫైనాన్షియల్ మార్కెట్‌లో పెట్టుబడులుగా పెట్టేందుకు మొగ్గుచూపుతున్నారు. ఆర్‌బీఐ వార్షిక నివేదిక ఆధారంగా మొత్తంమీద గృహాల పొదుపు పథకాలు భారీగా తగ్గినట్లు తెలుస్తోంది. సెంట్రల్ స్టాటిస్టిక్స్ గణాంకాల ఆధారంగా, హౌస్‌హోల్డ్స్ సేవింగ్ 2011-12 జీడీపీలో 23.6శాతం కాగా 2015-16లో 19.2శాతానికి క్షీణించాయి. హౌస్‌హోల్డ్ సేవింగ్స్ ఫిజికల్ ఎస్సెట్స్(భూములు, నిర్మాణాలు, మెషీనరీ, వాహనాలు, బంగారం, వెండి) కన్నా మరింత దిగజారినట్లు తెలుస్తోంది.

ఐటి, టెక్ రంగాలు కుదేలు

ఫ్లాట్‌గా ముగిసిన మార్కెట్లు



ముంబై: అమెరికా గణాంకాలు, కొనుగోళ్ల జోరుతో సోమవారం ర్యాలీ సృష్టించిన దేశీయ స్టాక్ మార్కెట్లు, మంగళవారం నెమ్మదించాయి. సోమవారం చోటుచేసుకున్న ర్యాలీకి నేడు ప్రాఫిట్ బుక్ చేసుకోవడంతో మార్కెట్లు నష్టాల్లో ప్రారంభమయ్యాయి. దీనికి తోడు జనవరి నెల ఇండస్ట్రియల్ అవుట్‌పుట్, ఫిబ్రవరి నెల సీపీఐ ద్రవ్యోల్బణ డేటా కూడా మార్కెట్లకు ప్రతికూలంగా మారింది. వీటి ప్రభావంతో తీవ్ర ఒడిదుడుకుల మధ్య ప్రారంభమైన స్టాక్ మార్కెట్లు, ఫ్లాట్‌గా ముగిసాయి. సెన్సెక్స్ 61.16 పాయింట్లు క్షీణించి 0.18 శాతంతో 33,856.78 పాయింట్లు, నిఫ్టీ 5.45 పాయింట్లతో 0.05శాతంతో 10,426.85 వద్ద ముగిసింది. గేజ్ గత సెషన్‌లో 610.80 పాయింట్లు ర్యాలీ చేయగా గత రెండు సంవత్సరాల్లో అత్యధికంగా నమోదైన దినంగా పరిగణించబడింది. బిఎస్ఇ మిడ్‌కాప్,స్మాల్‌కాప్ సూచీలు అత్యధికంగా 1శాతం 1.14శాతం వద్ద ముగిసాయి. సెక్టరల్ సూచీల్లో, బిఎస్ఇ, టెలికాం,ఆయిల్, గ్యాస్, రియాల్టీ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ అత్యధికంగా0.66 శాతంతో నమోదయ్యాయి. ఐటి.టెక్, నష్టాల్లో ముగిసాయి. యాక్సిస్ బ్యాంకు, విప్రో, సన్‌ఫార్మా,డాక్టర్ రెడ్డీస్ ప్రధాన లబ్దిదారులుకాగా టిసిఎస్,కోల్ ఇండియా, ఎన్‌టిపిసి టాప్ లూజర్స్‌గా నమోదయ్యారు. పారిశ్రామికోత్పత్తి జనవరిలో 7.5శాతం కాగా రిటైల్ ద్రవ్యోల్బణం ఫిబ్రవరిలో 4.4 శాతం నమోదైంది. నిఫ్టీ50 స్టాక్స్‌లో అతిపెద్ద లూజర్‌గా టీసీఎస్ నిలుస్తోంది. బిగ్ బ్లాక్ డీల్ అనంతరం టీసీఎస్ షేరు 5 శాతానికి పైగా పడిపోయింది. 6 బ్లాక్ డీల్స్‌లో 3 కోట్లకు పైగా టీసీఎస్ షేర్లు ట్రేడ్ అయినట్టు తెలిసింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 38 పాయింట్లు డౌన్ అయింది. నిఫ్టీ బ్యాంకు కూడా ఫ్లాట్‌గా ట్రేడవుతోంది. యూసీఓ బ్యాంకు, ఐడీబీఐ బ్యాంకు, పీఎన్‌బీ, కెనరా బ్యాంకు, బ్యాంకు ఆఫ్ బరోడా, శ్రీ రేణుక, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, బయోకాన్ స్టాక్స్ 5 శాతం వరకు కిందకి పడిపోయాయి. విదేశీ మదుపరుల రూ.374.65 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. దేశీయ మదుపరులు రూ.464.59 కోట్లు షేర్లు అమ్మినట్లు తెలుస్తోంది. యూరోపియన్ మార్కెట్లు నిలకడగానే నిలిచాయి. లండన్ బెంచ్‌మార్కు ఎఫ్‌టిఎస్ఇ 100 ఇండెక్స్ నికరంగా 7213.31పాయింట్లు నమోదుచేసింది. యూరోజోన్‌లో ఫ్రాంక్‌ఫర్ట్ డిఏఎక్స్ 30పాయింట్లుపెరగి 0.1శాతంతో 12,425.69పాయింట్లు, సిఏసి 40 0.2 శాతంతో 5284.84 పాయింట్లు నమోదు చేసింది.

విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్..

దూకేసిన ప్రయాణికులు



న్యూయార్క్: ఓ విమానాన్ని అత్యవసరంగా ల్యాండ్ చేయడంతో భయభ్రాంతులకు గురైన ప్రయాణికులు వెంటనే విమానం నుంచి కిందకి దూకేశారు. అమెరికాలోని అల్బుక్వెర్‌క్యూ ఇంటర్నేషనల్ సన్‌పోర్ట్ విమానాశ్రయంలో ఆదివారం రాత్రి ఈ ఘటన చోటు చేసు కుంది. అరిజోనాలోని ఫోనిక్స్ నుంచి బయలు దేరిన డల్లాస్‌కు చెందిన సౌత్‌వెస్ట్ విమానం- 3562 అల్బుక్వె ర్క్యూ విమానాశ్రయంలో అత్యవసరంగా దించారు. ల్యాండ్ చేసే ముందు విమాన సిబ్బంది క్యాబిన్‌లో ఏదో వాసన వస్తుందని అందుకే విమానం ల్యాండ్ చేస్తు న్నట్లు తెలిపారు. దీంతో భయభ్రాంతులకు లోనైన ప్రయాణికులు విమానం ల్యాండ్ కాగానే, కొందరు ఒక్క సారిగా విమానం రెక్క పక్కనే ఉండే కిటికిలో నుంచి కిందకి దూకేశారు. 'భయంతో ఎనిమిది అడుగుల ఎత్తులో నుంచి దూకేశాను' అని అందులో ప్రయాణిస్తున్న బ్రాండన్ కాక్స్ అనే వ్యక్తి చెప్పుకొచ్చాడు. వెంటనే విమాన సిబ్బంది ఎమర్జెన్సీ ఎగ్జిట్ తెరిచి ప్రయాణికులంతా వెంటనే కిందకి దిగేయాలని బిగ్గరగా కేకలు వేశారు. విమానంలో నుంచి దూకేయడంతో ఇద్దరు ప్రయాణికులు గాయపడ్డారని వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు అల్బుక్వె ర్క్యూ అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు.

మార్కెట్‌లో 'కెంట్' టర్బో గ్రైండర్...!



విశాఖపట్నం : దేశీయ ప్రఖ్యాత వాటర్ ప్యూరిఫయ్యర్ బ్రాండ్ 'కెంట్' స్మార్ట్ చెప్ అప్లయన్సెస్‌లో భాగంగా టర్బో గ్రైండర్ అండ్ బ్లెండర్‌ను మార్కెట్‌లోకి విడుదల చేసింది. మూడు నిముషాల్లో మిల్క్ షేక్‌లు, జ్యూస్, స్మూతీలు, పప్పు ముద్ద, దోశపిండిని రెడీ చేసుకోవచ్చు. దీనిలో అదనంగా వేడి చేసుకునే అవకాశం ఉంది. టీ, సూప్‌లను వేడి చేసుకోవచ్చు. 12 ప్రీసెట్ మెనూలతో ఆటోమెటిక్‌గా ఆపరేట్ చేసుకునే వీలుంది. స్మార్ట్ ఎల్‌సీడీ డిస్‌ప్లే, 30,000 ఆర్పీఎం స్పీడ్, 3 కిలోవాట్ మోటార్, హైగ్రేడ్ జపనీస్ స్టెయిన్‌లెస్ స్టీల్ బ్లేడులు ఉన్నాయి. కెంట్ ఔట్‌లెట్‌ల్లో రూ.14,950లకు అందుబాటులో ఉంది. అదే విధంగా కెట్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయవచ్చు. ఈ సందర్భంగా కెంట్ సిస్టమ్స్ ఛైర్మన్ డాక్టర్ ముఖేష్ గుప్త మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా, ఆరోగ్యంగా ఉండాలని తమ సంస్థ కాంక్షిస్తోందన్నారు. వినియోగదారుల ఆలోచనలకు అనుగుణంగా కెంట్ టర్బో గ్రైండర్ అండ్ బ్లెండర్‌ను మార్కెట్‌లోకి విడుదల చేశామన్నారు. హైస్పీడ్ బ్లెండర్ ఇంటి అవసరాలను తీర్చుతుందని, కేవలం మూడు నిముషాల్లో దేనినైనా తయారు చేసుకోవచ్చన్నారు.

బీఎండబ్ల్యూ ఎం3 సెడాన్.. ఎం4 కూపె విడుదల



విజయవాడ: ఎస్సీఆర్ న్యూ బీఎండబ్ల్యూ ఎం3 సెడాన్, న్యూ బీఎండబ్ల్యూ 4 కూపె భారతదేశ వ్యాప్తంగా బీఎం డబ్ల్యూ డీలర్ షిప్‌లో కంప్లీట్లీ బిల్ట్-అప్ యూనిట్స్‌గా మంగళవారం నుంచి అందుబాటులోకి బీఎండబ్ల్యూ గ్రూప్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ విక్రమ్ పవాహ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచంలో ఎం అత్యంత శక్తియుతపదంగా ఉంది. బీఎం డబ్ల్యూ ఎం జీఎంబీహెచ్ తరానికి మోటార్ రేసింగ్ జీన్స్‌కు రాజీ పడని ప్రతి నిత్యపు వినియోగాన్ని చేర్చింది. ఎం లోపల డ్రైవర్ల వాహనంతో అడ్రినలిన్ - స్టీప్డ్ ఎక్స్‌పీరియన్స్ పొందుతారు. న్యూ బీఎండబ్ల్యూ ఎం3 సెడాన్, న్యూ బీఎండబ్ల్యూ ఎం4 కూపె బిఎండబ్ల్యు ఎంకు ఏది అనన్యంగా ఉంటుందో వాటిని కలిగి ఉన్నాయి. అవి హై-పెర్ఫామెన్స్ స్పోర్ట్స్ కార్ ఇంజనీరింగ్‌ను ప్రతినిత్యపు వాస్తవ అవసరాలకు పరిపూర్ణంగా ఉపయోగపడేలా ఉంటుందని తెలిపారు.

ఆంధ్రాబ్యాంక్‌కు స్టెర్లింగ్ బయోటెక్ షాక్

- 5,000 కోట్ల మోసంలో కొత్త మలుపు
- మాజీ డైరెక్టర్‌పై ఈడీ తాజా చార్జిషీట్
- 15 ఏళ్ల కనిష్టానికి పడిపోయిన స్టాక్



ముంబై: ఇతర ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో వెలుగు చూస్తోన్న స్కామ్‌ల ప్రభావంతో ఇప్పటికే కుదేలైన ఆంధ్రా బ్యాంక్ షేర్లు సోమవారం మరింతగా పతనమయ్యాయి. గతంలో స్టెర్లింగ్ బయోటెక్‌లో రూపంలో వెలుగు చూసిన దాదాపు రూ.5,000 కోట్ల కుంభకోణానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆంధ్రా బ్యాంక్ మాజీ డైరెక్టర్ అనూప్ ప్రకాశ్ గార్గ్‌పై తాజాగా మరో చార్జిషీట్‌ను దాఖలు చేసింది. ఈ వార్తల నేపథ్యంలో ఈ బ్యాంక్ స్టాక్ 15 ఏండ్ల కనిష్టానికి పడిపోయింది. మనీ లాండరింగ్ ఆరోపణలతో గార్గ్‌పై ఈ కేసు నమోదు అయింది. దీంతో ఇన్వెస్టర్లు ఆంధ్రా బ్యాంకు షేర్ల అమ్మకాలకు మొగ్గుచూపారు. ఈడీ చార్జిషీట్ నేపథ్యంలో ఆంధ్రాబ్యాంక్ షేర్లు సోమవారం ఒక్కరోజే దాదాపు 6.7 శాతం మేర కుంగి రూ.35.95కు పడిపోయాయి. 2003 తరువాత ఆంధ్రాబ్యాంక్ షేరు ఇంత తక్కువ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. మొత్తం 2018 ఏడాదిలో ఇప్పటి దాకా 41 శాతానికి పైగానే పతనమవడం విశేషం.

గతేడాదిలోనే కేసు నమోదు - సీబీఐ : ఆంధ్రా బ్యాంక్‌తో సహా వివిధ బ్యాంకింగ్ సంస్థల నుంచి నుంచి వేలాది కోట్ల రుణాలను అక్రమ పద్ధతుల్లో స్వీకరించిన స్టెర్లింగ్ బయోటెక్ వాటిని తిరిగి చెల్లించడంలో విఫలం కావడంతో గత ఏడాది సీబీఐ ఈ విషయమై కేసు నమోదు చేసింది. వృత్తిరీత్యా చార్టర్డ్ అకౌంటెంటైన గార్గ్ 2009 అక్టోబరు వరకు దాదాపు మూడేండ్ల పాటు బ్యాంకు బోర్డులో డైరెక్టర్‌గా కొనసాగారు. 2008-09 మధ్య కాలంలో ఆయన స్టెర్లింగ్ సంస్థ ఎగ్జిక్యూటివ్‌ల నుంచి భారీ మొత్తంలో లంచాలను స్వీకరించి బ్యాంకు నుంచి వారికి రుణాలు మంజూరయ్యేందుకు పని చేసినట్టుగా విచారణ సంస్థలు గుర్తించాయి. స్టెర్లింగ్ గ్రూపునకు రుణ లబ్ది చేకూర్చేందుకు వీలుగా అనూప్ వారి నుంచి రూ.2కోట్లను స్వీకరించినట్లు ఈడీ తాజాగా పేర్కొంది. తాజా ఈడీ విచారణలో షాకింగ్ విషయాలు వెలుగు చూశాయి. 2011లో ఇన్ కంట్యాక్స్ అధికారులు సీజ్ చేసిన డైరెక్టర్ డైరీలో చేతన్ జయంతిలాల్ సందేశారా, నితిన జయంతిలాల్ సందేశారా అనే స్టెర్లింగ్ బయోటెక్ డైరక్టర్లు ఇతనికి 15.2 మిలియన్ల మేర డబ్బు చెల్లించినట్లు ఎంట్రీలు ఉన్నాయని తేలింది. దీంతో ఆయనపై మరో చార్జ్‌షీట్‌ను దాఖలు చేశారు. 2016 ముగింపు నాటికి స్టెర్లింగ్ గ్రూపు కంపెనీలు బ్యాంకుల నుంచి రూ.5383 కోట్ల మేర రుణాలను స్వీకరించాయని.. ఆ తరువాత సదరు రుణాలన్నీ నిరర్థక ఆస్తులుగా మారిపోయినట్టుగా సీబీఐ తన దర్యాప్తు నివేదికలో పేర్కొంది. మరోవైపు ఇదే విషయమై హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఆంధ్రాబ్యాంక్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇస్తూ.. స్టెర్లింగ్ గ్రూపు కంపెనీలు తీసుకున్న రూ.1,150 కోట్ల రుణాలకు మాత్రమే తాము లీడ్ బ్యాంక్‌గా వ్యవహరించినట్టుగా పేర్కొంది. 2015 నుంచి ఈ సంస్థలకు ఇచ్చిన రుణాలను తాము నిరర్థక ఆస్తులుగా పరిగణిస్తూ తగిన సర్దుబాట్లు చేశామని బ్యాంక్ ఫైలింగ్‌లో తెలిపింది. ఈ మోసాన్ని గత డిసెంబరులోనే గుర్తించిన తాము భారతీయ రిజర్వు బ్యాంకునకు, పోలీసులకు కూడా ఫిర్యాదు చేసినట్టు పేర్కొంది.

విజ్ఞానం

పప్పుధాన్యాలతో హైబీపీకి చెక్



పప్పు ధాన్యాలతో హైబీపీని నియంత్రించవచ్చని తాజా అధ్యయనంలో పరిశోధకులు వెల్లడించారు. కూరలు, సూప్స్‌లో వాడే పప్పుధాన్యాలు వయసుతో పెరిగే బీపీని కంట్రోల్ చేస్తాయని ఎలుకలపై చేసిన ప్రయోగంలో తేలింది. హైబీపీని చౌకగా దొరికే ఈ ధాన్యాలతో నియంత్రిచవచ్చని యూనివర్సిటీ ఆఫ్ మనితోబా అధ్యయనం పేర్కొంది. పప్పుధాన్యాలు రక్తకణాల ఆరోగ్యం క్షీణించకుండా చూస్తాయని శాస్త్ర వేత్తలు పేర్కొన్నారు. డల్లాస్‌లో జరిగిన అమెరికన్ హార్ట్ అసోసియేషన్ వార్షిక సదస్సులో పరిశోధకులు తమ అధ్యయన ఫలితాలను వెల్లడిం చారని ది డైలీ ఎక్స్‌ప్రెస్ వెల్లడించింది. బీపీ నియంత్రణలో పప్పు ధాన్యాల పనితీరు అద్భుతంగా ఉన్నట్టు తమ పరిశోధనలో తేలిందని అధ్యయనానికి నేతృత్వం వహించిన డాక్టర్ పీటర్ జహ్రద్కా చెప్పారు. రక్త సరఫరాలో లోపాలపై నాన్ క్లినికల్ చికిత్సలో భాగంగా పప్పుధాన్యాలు ప్రభావవంతంగా పనిచేశాయని తెలిపారు. సకాలంలో గుర్తించి చికిత్స చేయకుంటే హైపర్‌టెన్షన్‌గా వ్యవహరించే హైబీపీ స్ట్రోక్‌లు, గుండెపోటుకు దారితీస్తుంది.

వారసత్వంగా ఇన్‌సోమ్నియా



నిద్రలేమి (ఇన్‌సోమ్నియా) సమస్యల పెరుగుదలకు మూల కారణమైన జీన్స్‌ను శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇన్‌సోమ్నియా, మానసిక సమస్యలకు ప్రధాన కారణమైన జనెటిక్ లింక్‌ను కనుగొన్నట్లు మాలిక్యులర్ సైకియాట్రీ జర్నల్‌లో ప్రచురితమైంది. దీర్ఘకాలంగా ఇన్‌సోమ్నియాతో బాధపడుతున్న వారికి ఆరోగ్యపరమైన సమస్యలుఉన్నట్లు తెలుస్తోంది. టైప్ 2 డయాబెటిస్‌తోపాటు మానసిక రుగ్మతలు వంటి పోస్ట్ ట్రమాటిక్ స్ట్రెస్ డిజార్డర్(పిటిఎస్‌డి) వంటి సూసైడ్ సమస్యలకు వారు గురవుతున్నట్లు వీరి అధ్యయనంలో వెల్లడైంది. దీనికికారణమైన జీన్స్‌వలన అనువంశికంగా సంక్రమిస్తుందని కాలిఫోర్నియా యూనివర్సిటీలో అధ్యయనం చేస్తున్న ముర్రెస్టీన్ వెల్లడించారు.

వీరు జీనోమ్ వైడ్ అసోసియేషన్ స్టడీస్‌పై చేపట్టిన అధ్యయనంలో 30,000 మంది డిఎన్ఏ సాంపిల్స్‌పై పరిశోధన చేశారు. యూరోపియన్,ఆఫ్రికన్, లాటిన్‌అమెరికాల సైనికుల డిఎన్ఏపై చేపట్టిన అధ్యయనంలో వారసత్వంగా సంక్రమిస్తున్న పలు వ్యాధులను గుర్తించారు. తాజాగా రెండు నూతన అధ్యయనాలను గుర్తించారు. ఇన్‌సోమ్నియా పాక్షికంగా వారసత్వంగా సంక్రమించేదేనని స్పష్టం చేసారు. టైప్ 2 డయాబెటిస్‌కు ఇన్‌సోమ్నియాకు జనెటిక్ లింక్ ఉన్నట్లుగా కూడా స్పష్టం చేసారు. నిద్రలేమికి, డిప్రెషన్‌కు కూడా జనెటికల్‌గా లింక్‌ఉన్నట్లు తెలుస్తోంది.

ఇండిగోకు డీజీసీఏ షాక్?!

ముంబై : నేపాల్‌లో విమాన ప్రమాదం నేపథ్యంలో భారత పౌర విమాన శాఖ కఠిన నిర్ణయాన్ని అమలు చేసింది. దీంతో ఏ320 నియోన్ విమానాలు నేల దిగాయి. ప్రాట్ అండ్ విట్నీ ఇంజిన్ల విమానాలను నిలిపివేయాలని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ అకస్మాత్తుగా ఆదేశించింది. ఈ కారణంగా ఇండిగో సంస్థ దేశవ్యాప్తంగా 47 విమానాలను రద్దు చేసింది. గోఎయిర్‌కు సంబంధించిన మరో మూడు విమానాలను కూడా రద్దు చేశారు. 47 విమానాలను నిలిపేసినట్లు ఇండిగో మంగళవారం నత వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కత్తా, హైదరాబాద్, బెంగుళూర్, పాట్నా, శ్రీనగర్, భువనేశ్వర్, అమృత్‌సర్, గౌహతిల నుంచి ప్రారంభం అయ్యే విమానాలను రద్దు చేశారు. సోమవారం అహ్మదాబాద్ నుంచి కోల్‌కతాకు 186మందితో వెళ్లిన ఎ320 నియో విమానం గాల్లోకి ఎగిరిన అనంతరం ఇంజిన్లలో ఒకటి విఫలం కావ డంతో అత్యవసరంగా వెనక్కి మళ్లించారు. బయల్దేరిన 40 నిమిషాల్లోనే తిరిగి అహ్మదాబాద్ చేరుకుంది. ప్రయాణి కులంతా సురక్షితంగా ఉన్నారు. ఈ ఘటన జరిగిన కొన్ని గంటల్లోనే డీజీసీఏ ప్రాట్ అండ్ విట్నీ ఇంజిన్ల వైఫల్యాలున్న ఎ320 నియో విమానాలు నిలిపివేత ప్రారంభించింది. ఈఎస్ఎన్450 కన్నా ఎక్కువ ఉన్న పీడబ్ల్యు1100 ఇంజిన్లు కలిగిన ఎ320 నియో విమానాలను తక్షణమే నిలిపేయాలని సోమవారం డీజీసీఏ ఆదేశించింది. విమానాల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు డీజీసీఏ తెలి పింది. నిన్న ఇండిగో, గోఎయిర్‌కు చెందిన 11 విమానాలు నిలిపేయడంతో దేశవ్యాప్తంగా వందలాది మంది ప్రయాణి కులు నిలిచిపోయారు. ఇండిగో ప్రతి రోజూ దాదాపు 1000 విమానాలు నడుపుతోంది. దేశీయ విమానయాన రంగంలో ఇండిగోకు 40శాతం మార్కెట్ షేర్ ఉంది. గోఎయిర్‌కు 10శాతం మార్కెట్ షేర్ ఉంది.

నీరవ్ రాజీ ఆఫర్‌కు పీఎన్‌బీ నో

డబ్బు మొత్తం కట్టాల్సిందే

ఢిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ)లో వెలుగుచూసిన రూ.12,600 కోట్ల కుంభ కోణం దేశవ్యాప్తంగా సంచల నం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీ విదేశాల్లో ఉంటున్నారు. అయితే ఈ కేసులో రాజీ చేసుకునేందుకు ప్రయత్నించిన నీరవ్‌మోడీకి పంజాబ్ నేషనల్ బ్యాంకు గట్టి వార్నింగ్ ఇచ్చింది. ఇందులో ఎలాంటి రాజీలు కుదరవని.. వెంటనే తమ దగ్గర తీసుకున్న డబ్బు మొత్తం కట్టాల్సిందేనని తేల్చి చెప్పింది. పీఎన్‌బీ నుంచి తీసుకున్న మోసపూరిత లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్(ఎల్‌వోయూ)లతో నీరవ్‌మోడీ తదితరులు విదేశాల్లోని భారతీయ బ్యాంకుల నుంచి వేల కోట్ల రుణాలు తీసుకున్న విషయం తెలిసిందే. ఈ రుణాల మొత్తం విలువ రూ. 12వేల కోట్ల పైనే. దీంతో నీరవ్ మోడీ, ఆయన బంధువైన మెహుల్ ఛౌక్సీ తదితరులపై సీబీఐ, ఈడీ కేసులు నమోదయ్యాయి. అయితే ఈ కేసులో రాజీకొచ్చేందుకు నీరవ్ గత నెలలో పీఎన్‌బీకి ఒక ఈమెయిల్ పంపినట్లు తెలుస్తోంది. అప్పుల కింద రూ. 2000 కోట్ల విలువైన నగలు, రూ. 200కోట్ల డిపాజిట్లు, రూ. 50కోట్ల విలువైన స్థిరాస్తులు తీసుకుని రాజీకి రావాలని కోరినట్లు ఈ మెయిల్ సారాంశం. అయితే ఇందుకు పీఎన్‌బీ ససే మిరా అన్నట్లు సమాచారం. ఈ మేరకు గతవారం బ్యాంకు జనరల్ మేనేజర్ అశ్విని వాట్స్ నీరవ్‌మోదీకి ఈ మెయిల్‌కు సమాధానమిచ్చారు. 'మీరు ఎంత మొత్తంలో బ్యాంకును మోసం చేశారో మీకు తెలుసు. కానీ ఇప్పుడు మీరు అందులో కొంత మాత్రమే కడతానంటున్నారు. అంతేగాక మిగతా డబ్బులు ఎప్పుడు ఇస్తారో కూడా చెప్పట్లేదు. రాజీ కోసం మీరు చెప్పిన ఆస్తుల వివరాల్లో ఎలాంటి విశ్వసనీయత లేదు. మీరు మొత్తం డబ్బు కట్టాల్సిందే. కొన్నేళ్లుగా బ్యాంకును మోసం చేస్తూ మా డబ్బును దుర్వినియోగం చేశారు. అయినప్పటికీ బ్యాంకు ఎలాంటి న్యాయపరమైన చర్యలు తీసుకోదు అని మీరు ఎలా అనుకుంటున్నారు. పైగా పీఎన్‌బీ కేసు పెట్టడం వల్ల, సీబీఐ కేసుల వల్ల మీ బ్రాండ్ పేరు చెడిపోతుంది అని మమ్మల్ని ఆరోపిస్తున్నారు.

చెరకు తోటల్లో బిందు సేద్యం

నీటి వనరులు రోజురోజుకి తగ్గిపోతున్నందున, చెరకు తోటల్లో కూడా బిందు సేద్యం విధానాన్ని ప్రవేశపెట్టారు. బిందు సేద్యాన్ని ఇంగ్లీషులో డ్రిప్ అంటున్నారు. డ్రిప్ ఏర్పాటు వల్ల 60 నుండి 70 శాతం నీటి ఆదా చేయవచ్చన్న నగ్నసత్యం రైతుల అనుభవం లోకి వచ్చింది. ప్రభుత్వం కూడా చెరకు రైతులకు చేయూతనివ్వటం కోసం 50 శాతం సబ్సిడీ కూడా ఇచ్చే ప్రణాళికను రూపొందించింది. రాబోయే రెండేళ్లలో రాష్ట్రంలో 40 వేల హెక్టార్ల విస్తీర్ణంలో చెరకు సాగుకు డ్రిప్ సౌకర్యం కల్పించాలనే సత్‌సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఉంది.



బిందు సేద్యం అంటే?

సన్నటి ప్లాస్టిక్ గొట్టాల ద్వారా మొక్కల వద్ద మాత్రమే నీటిని బిందువులుగా నిర్ణీత పరిమాణంలో వదలటం 'డ్రిప్' అంటారు. పండ్ల, చెరకు తోటలకు ఈ విధానం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ విధానాన్ని ఎక్కువమంది రైతులు అనుసరించి అమలు పరచటం కోసం ప్రభుత్వం రాయితీలు కల్పించింది. నీటికొరత అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఈ పథకం ఇప్పటికే ముమ్మరమైంది. సాంప్రదాయ పద్ధతుల్లో చెరకు తోటలకు నీరు అందించినప్పుడు నీటి వినియోగ సామర్థ్యం 30-35 శాతం మాత్రమే. డ్రిప్ ద్వారా నీరు అందించినప్పుడు నీటి వినియోగ సామర్థ్యం 60 నుండి 90 శాతం వరకు ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. నీటి కొరత అధికంగా ఉన్నప్పుడు వినియోగ సామర్థ్యం పెంచుకోవడం, అధిక దిగుబడులు సాధించడం విజ్ఞత అనిపించుకుంటుంది.

డ్రిప్ వల్ల లాభాలు

నీటిని ఆదా చేయవచ్చు. సాంప్రదాయ పద్ధతిలో ఒక ఎకరానికి ఒకసారి పారించే నీరు, మూడు, నాలుగు ఎకరాలకు వినియోగించవచ్చు. 10-15 రోజుల వ్యవధిలో చెరకు తోటలకు నీరు పారించటం పరిపాటి. తడికి తడికి మధ్య మొదటి మూడింట ఒక వంతు రోజులు తడి ఎక్కువై హాని చేస్తుంది. నీరు ఎక్కువగా పారించటం వల్ల నీరు భూమిలోపల పొరల్లోకి జారిపోతుంది. ఇందువల్ల నీరు వృధా కావటం ఒక్కటే నష్టంకాదు. భూమి గడ్డ కట్టుకుపోతుంది. భూమిలో ఉండే మట్టి రేణువులు మధ్య గాలి పొరలుంటాయి. నీరు అధికమైనప్పుడు అవి పూడుకుపోతాయి. అలా జరిగినపుడు మొక్కల వేళ్ల చొచ్చుకుపోవడానికి, పోషకాలను సమృద్ధిగా స్వీకరించటానికి అవరోధంగా మారు తుంది. నీటితో పాటు పైరుకు వేసిన పోషకాలు కూడా భూమిలోపలి పొరల్లోకి జారిపోతాయి. మొక్కల వేళ్లకు అందనంత లోతుకు పోషకాలు వెళ్లడం జరిగితే రైతు చేసిన ఖర్చు వృధాయే. నీరు ఎక్కువైనపుడు మూడింట ఒక వంతు చివరి రోజులు వేర్లకు అవసరమైనంత తేమ అందదు. ఇసుక నేలల్లో మరింత ప్రమాదం. నీరు, తేమ త్వరగా భూమి లోతుకు చేరిపోవటం వల్ల మొక్కల వేళ్ల వద్ద తేమ ఎక్కువై పోతుంది. తేమ అవసరం వేళ్లకు మాత్రమే గాని, నేలకు కాదు. మొదళ్ల వద్ద నీటి బిందువులను నిర్దిష్ట పరిమాణంలో వదిలితే ఆ తేమ వేళ్లున్న వరకే పరిమితమై ఉంటుంది. పోషకాలు కూడా అక్కడవరకే నిలచి అందుటులో ఉంటాయి.

నీరు ఎక్కువగా పారించటం వల్ల భూమిలో నిక్షిప్తంగా ఉండే పోషక విలువలు నీటి ద్వారా భూమి లోపల పొరల్లోకి చొచ్చుకు పోతాయి. అలా జరిగితే భూభౌతిక స్థితి దెబ్బతింటుంది. నిస్సారమవుతుంది. అందుకే వరుసగా చెరకు నాటిన భూములు చౌడుబారుతాయని రైతులు అపోహపడుతుంటారు. అది అపోహ ఎంత మాత్రం కాదు. చెరకుకు ఎక్కువ మోతాదులో నీరు పారించటం వల్ల భూమి చౌడుబారే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

నీరు అందించినంత మాత్రాన మంచి దిగుబడులు రావు. అవసరమైన పోషకాలను అందించాలి. పోషకాలను అందించటం (ఎరువులు వేయటం) సకాలంలో, సక్రమంగా జరగటం లేదనే విమర్శలున్నాయి. అందుకు ఆర్థిక ఇబ్బందులు ఒక కారణమైతే, తేమ లేకపోవడం మరో కారణం. సమయానికి కూలీలు దొరకకపోవడం ఇంకో కారణం. డ్రిప్ ఏర్పాటుతో చివరి రెండు కారణాలను అవలీలగా అధిగమించవచ్చు. డ్రిప్ ద్వారానే ఎరువులు అందించవచ్చు. దీనినే ఫెర్టిగేషన్ అంటారు. డ్రిప్ ద్వారా పోషకాలను అందించటం ఎంతో సులువు. అదనంగా మనుష్యులు అక్కర్లేదు. ఒక ప్రాంతంలో ఎక్కువ, ఒక ప్రాంతంలో తక్కువ ఎరువులు పడతాయనే భయం లేదు. సమానంగా, సకాలంలో పోషకాలు అందించడం డ్రిప్‌తోనే సాధ్యం. డ్రిప్ ద్వారా ఎరువులను అందించటం వల్ల ఖర్చు తగ్గుతుంది. అదనంగా ఎరువులు వాడాల్సిన అవసరం ఉండదు.

డ్రిప్‌లో జాగ్రత్తలు

నీటిని శుభ్రపరిచే 'ఫిల్టర్సు'ను ఎప్పటికప్పుడు గమనిస్తూ సరియైన వత్తిడి ఉండేటట్లు తీసుకోవాలి. లాటరల్స్‌ను ఎలుకలు, ఉడుతలు కొరకకుండా జాగ్రత్తపడాలి. ఫెర్టిగేషన్ (ఎరువులందించడం) కూడా డ్రిప్ ద్వారా చేయటానికి ఏర్పాట్లు ఉంటాయి. ఫెర్టిగేషన్‌కు ముందు 10 నిమిషాలు, ఫెర్టిగేషన్ తరువాత 10 నిమిషాలు మంచి నీటిని వదిలి పరికరాలను శుభ్రపరచాలి. ఫెర్టిగేషన్ ఏర్పాట్లు ఉన్నాయి కదా అని ప్రతి ఎరువును డ్రిప్‌లో వదలకూడదు. కొన్ని ఎరువులు మాత్రమే నీటిలో కరిగి డ్రిప్ ద్వారా మొక్కలను చేరతాయి. కాబట్టి ఏఏ ఎరువులను డ్రిప్ ద్వారా అందించవచ్చో ముందే తెలుసుకోవాలి. కాంప్లెక్సు ఎరువులు డ్రిప్ ద్వారా ఇవ్వరాదు.

విద్యుత్‌ను, నీటిని ఆదా చేయవచ్చు. రోజుకు 9 గంటలు మించి విద్యుత్ సరఫరా ఉండటం లేదు. చిత్తూరు జిల్లా కుప్పం సమీపంలోని ఒక రైతు ఒక బోరుకి డ్రిప్‌ను అమర్చి 10 ఎకరాల భూమికి నీటిని అందించగలుగుతున్నాడు. 'డ్రిప్ ఏర్పాటు చేయకముందు ఆ బోరు మూడు ఎకరాలకు కూడా నీరు అందించగలిగేది' కాదు అని ఆయనే చెపుతున్నారు. తక్కువ సమయం విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ ఎక్కువ విస్తీర్ణానికి నీరు అందించగల సత్తా డ్రిప్‌కి ఉంది. చెరకు తోటలకు కలుపు బెడద ఎక్కువ. తరచుగా నీటి తడులు పెట్టడం వల్ల, ప్రతి తడికి కలుపు మొక్కలు పుట్టుకొస్తూనే వుంటాయి. వాటిని నిర్మూలించటం రైతుకి అదనపు భారమే అవుతుంది. భారమైనా నిర్మూలించక తప్పటం లేదు. పైరుకు వేసిన ఎరువును కలుపే తస్కరిస్తుంది. నీటిని లాగేసుకుంటుంది. డ్రిప్ ద్వారా నీటిని అందించటం వల్ల మొక్కల దగ్గర మాత్రమే తేమ ఏర్పడుతుంది. మిగిలిన భాగమంతా పొడిగా ఉండటం వల్ల కలుపు మొక్కలు మొలకెత్తవు.

సాగునీటి వృధాను బాగా తగ్గించవచ్చు. డ్రిప్ సహాయంతో పెంచిన చెరకు 25 నుంచి 50 శాతం అదనపు దిగుబడినిస్తుంది. చెరకు కూడా నాణ్యతతో వుంటుంది. పంచదార దిగుబడి 0.5 నుండి 1 శాతం వరకు పెరుగుతుంది. ఎరువు వృధాను 25 శాతం వరకు తగ్గించవచ్చు. ఇలా ఎన్నో లాభాలను చేకూర్చే డ్రిప్ ఏర్పాటును ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. చెరకు పడిపోయిన తరువాత నీరు పారించటం కష్టం. డ్రిప్ ఏర్పాటు వుంటే పడిపోయిన తోటల్లో కూడా సజావుగా నీరందించవచ్చు.

డ్రిప్ ఏర్పాటు చేసుకోవాలంటే

బోరు లేదా బావి నుంచి నీరు తీసుకునే వనరులుండాలి. విద్యుత్ సౌకర్యం కూడా అవసరం. ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ పథకం కింద రైతులకు సహకారం అందుతోంది. డ్రిప్ ఏర్పాటుకు అయ్యే ఖర్చులో సగభాగం ప్రభుత్వం రాయితీగా ఇస్తుంది. ఒకో వ్యక్తి 50 వేల రూపాయలకు మించకుండా రాయితీ పొందవచ్చు. డ్రిప్ ఏర్పాటునకు అయ్యే ఖర్చుకు మాత్రమే రాయితీ లభిస్తుంది. బోర్, పవర్, సరఫరా ఖర్చులకు రాయితీ వర్తించదు. డ్రిప్ ఏర్పాటుకు రైతులు అందుబాటులో ఉన్న వ్యవసాయ అధికారులను సంప్రదించాలి.

– దాసరి ఆళ్వారస్వామి

మినుముకు మచ్చల పురుగు బెడద



కోస్తా జిల్లాల్లో సార్వా వరి తరువాత మాగాణి భూముల్లో సాగుచేస్తున్న మినుము, పెసర పైర్లు ప్రస్తుతం 35 నుంచి 45 రోజుల వయసులో ఉన్నాయి. మరికొన్ని ప్రాంతాలలో పూత, పిందె దశలలో పైరు ఉంది. ఈ సమయంలో పైరును మారుకా మచ్చల పురుగు ఆశించే అవకాశం ఉంది. పంటలో పూత, పిందె దశలో 'మారుకా' గూడు పురుగు ఆశించే అవకాశం ఉన్నందున పూత ప్రారంభ దశలోనే వేప సంబంధిత మందులు (వేపనూనె/ వేప గింజల కషాయం 5 శాతం) పిచికారీ చేయాలి. దీనివల్ల పురుగు ఉధ్రుతి తగ్గుతుంది. అలా కాక పురుగు మొగ్గలు, పిందెల్లో కనబడితే క్లోరిపైరిఫాస్ 20 శాతం, ఈసీ 2.0 మిల్లీలీటర్లు లేక ఎసిఫేట్ 75 శాతం ఎస్పీ గ్రాము చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. పైరులో గూళ్ళు ఎక్కువగా ఉన్నట్లయితే వెంటనే క్లోరిపైరిఫాస్ 20 శాతం ఈసీ 2.5 మిల్లీలీటర్లు లేదా నోవాల్యురాన్ 10 శాతం ఈసీ మిల్లీలీటర్లు లేదా స్పైనోశాడ్ 45 శాతం ఎస్పీ 0.3 మిల్లీలీటర్లు లేదా థయోడికార్బ్ 75 శాతం డబ్ల్యూపీ గ్రాము లేక రినాక్సిఫిర్ 18.5 ఎస్పీ 0.3 మిల్లీలీటర్లు లేక ఇమామెక్టిన్ బెంజోయేట్ 5 శాతం ఎస్‌జీ 0.4 గ్రాములు లేక ఫ్లుబెండిఎమైడ్ 40 శాతం ఎస్పీ 0.2 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. అవసరాన్ని బట్టి వారం రోజుల వ్యవధిలో మందును మార్చి మరలా పిచికారీ చేసుకోవాలి.

చెరకుకు కొరడా తెగులు

విశ్వామిత్ర (87ఏ298) రకం చెరకుకు కొరడా తెగులు ఎక్కువగా ఆశిస్తోంది. మొక్క తోటల్లో ముచ్చెలు నాటేముందు ప్రొపికొనజోల్ మందుతో లీటరు నీటికి మిల్లీలీటరు చొప్పున కలిపి విత్తనశుద్ధి చేసి నాటుకోవాలి.

- మొక్క తోటల్లో కంటే కార్శి తోటల్లో కొరడా తెగులు ఉధ్రుతి ఎక్కువగా ఉంటుంది. కనుక ప్రొపికొనజోల్ మందును లీటరు నీటికి మిల్లీలీటరు చొప్పున కలిపి కార్శి చేసిన వెంటనే ఒకసారి, కార్శి చేసిన 30 నుంచి 40 రోజులకు మరొకసారి పిచికారీ చేయాలి.
- రాష్ట్రంలో సాగుచేస్తున్న రబీ వేరుశెనగ ప్రస్తుతం పంట పూత, ఊడలు, కాయ, గింజ అభివృద్ధి చెందే దశల్లో ఉంటుంది. భూమి స్వభావాన్ని బట్టి సకాలంలో నీటి తడులు ఇచ్చినట్లయితే అధిక దిగుబడులు పొందవచ్చు.
- 30 నుంచి 40 రోజుల దశలో ఉన్నటువంటి వేరుశనగ పంటపై రసం పీల్చే పురుగుల ఉధ్రుతిని గమనించి అంతర్వాహిక మందులైన ఇమిడాక్లోప్రిడ్ 60 మిల్లీలీటర్లు లేక డైమిథోయెట్ 400 మిల్లీలీటర్లు లేదా మోనోక్రోటోఫాస్ 320 మిల్లీలీటర్లు 200 లీటర్ల నీటికి కలిపి మొక్కలు బాగా తడిచే విధంగా పిచికారీ చేయాలి.
- లద్దె పురుగు నివారణకు ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలు పెట్టి మగ రెక్కల పురుగులను ఆకర్షించాలి. ఎకరా వేరుశనగ పొలంలో 30 నుంచి 40 ఆముదం, పొద్దు తిరుగుడు మొక్కలు ఎర పంటలుగా పొలంలో విత్తుకోవాలి. గుడ్ల సముదాయాన్ని పిల్ల పురుగులను ఏరివేయాలి. ఈ పురుగు నివారణకు వేప కషాయం (5శాతం) లేక వేప సంబంధిత పురుగు మందులను లీటరు 200 లీటర్ల నీటికి సబ్బుపొడి 50 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి. తొలిదశ గొంగళి పురుగు నివారణకు క్వినాల్‌ఫాస్ 400 మిల్లీలీటర్లు లేదా మోనోక్రోటోఫాస్ 320 మిల్లీలీటర్లు లేదా క్లోరిపైరిఫాస్ 400 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. బాగా ఎదిగిన లద్దె పురుగు నివారణకు విషపు ఎరను చిన్న చిన్న వుండలుగా తయారు చేసి పొలంలో సమానంగా సాయంకాలంలో చల్లాలి.

వేసవిలో పత్తి సాగుచేయొద్దు

రెండుమూడు సంవత్సరాల అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రధాన పత్తి పంట పూర్తయిన వెంటనే విరామ సమయం పాటించాలి. ఎటువంటి పరిస్థితుల్లోనూ వేసవిలో పత్తి సాగుచేయరాదు. అప్పుడే పురుగు జీవితకాల చక్రాలను నిరోధించడానికి వీలవుతుంది.

'రాజరథం'లో ఆర్య లుక్‌కి సుదీప్ ప్రేరణ



'రాజరథం'లో విశ్వగా ఆర్య ఫస్ట్ లుక్‌కి విశేష స్పందన రావడంతో పాత్ర మీద అంచనాలు పెరిగాయి. ఆ లుక్ వాస్తవానికి ఈగ, సుదీప్ నుండి ప్రేరణ పొంది రూపొందించినది. తన కెరీర్ ప్రారంభంలో అనూప్, నిరూప్‌ల తండ్రి సుధాకర్ భండారి 90లలో రూపొందించిన 'ప్రేమద కాదంబరి' అనే కన్నడ టెలి సీరియల్‌కి సుదీప్ పని చేశారు. అప్పటినుండి అనూప్, నిరూప్‌లు సుదీప్‌ని ఊహించుకుని తమ స్టోరీ ఐడియాస్‌ని చర్చించుకునేవాళ్ళు. అనూప్ తాను ఇంజనీరింగ్ చదివే రోజుల్లో సుదీప్ అంతవరకు చేయనటువంటి పోలీస్ పాత్రతో 'యోధ' అనే స్క్రిప్ట్ కూడా తయారు చేసుకున్నారు.

అనూప్ తన దర్శకత్వంలో షార్ట్ ఫిలిం 'పర్స్' రూపొందించినప్పుడు అనేక అవార్డులు, ప్రశంసలు పొందింది. ఆ షార్ట్ ఫిలింకి సంబంధించి 2010లో ఒక ప్రెస్ మీట్‌కి సుదీప్ గెస్ట్ వచ్చి ఎంతో ప్రశంసించారు. అప్పట్లో 'రాజరథం' స్క్రిప్ట్ తొలి దశలోనే ఉంది. ఆ ప్రెస్ మీట్‌కి సుదీప్ బ్లూ కుర్తా, జీన్స్, సాండల్స్‌లో వచ్చారు. ఆ గెటప్‌లో సుదీప్‌ని చూసిన అనూప్‌కి తన 'రాజరథం'లోని విశ్వ పాత్ర గుర్తొచ్చింది. తాను విశ్వ పాత్ర ఆహార్యం ఎలా ఉండాలనుకున్నాడో సుదీప్ ఆ రోజు అలానే కనిపించారు. 'రాజరథం' ప్రీ-ప్రొడక్షన్ పనులు మొదలయ్యాక, అనూప్ తన భార్య, 'రాజరథం'కి కాస్ట్యూమ్ డిజైనర్ అయిన నీతా షెట్టికి ఈ విషయం చెప్పారు. దానినే రిఫరెన్స్‌గా తీసుకుని నీతా షెట్టి ఆర్య లుక్‌ని డిజైన్ చేయడం జరిగింది.

ఆర్య అసిస్టెంట్స్‌కి కూడా 'రాజరథం'లోని ఆర్య లుక్ భలే నచ్చింది. 'రాజరథం' లోని విశ్వ పాత్ర, ఆ పాత్ర ఆహార్యం ఆర్యకి అతికినట్టు సరిపోయిందని అంటున్నారు. ఆర్యని ఎక్కువగా ప్రేమికుడిగానే చూసిన తమకి తమ బాస్ కొత్త డాషింగ్ లుక్‌లో కనిపించడం చాలా బాగుంది అంటున్నారు. ఆర్య తినేప్పుడు, నిద్రపోయేప్పుడు, జిమ్‌లో కూడా డైలాగులు తన ముందే పెట్టుకుంటున్నారని, దర్శకుడు అనూప్ భండారి ఆర్యని టార్చర్ పెడుతున్నారని సరదాగా చెప్పుకొచ్చారు. ఆర్య తన పాత్రని చాలా సీరియస్‌గా తీసుకున్నారు. తెలుగు తన భాష కాదు కాబట్టి డైలాగులు, ఎక్స్‌ప్రెషన్స్ పర్ఫెక్ట్‌గా రావాలని ఎక్కువ సమయం కేటాయించి ఎన్నో రిహార్సల్స్ చేస్తున్నారు. 'రంగితరంగ' కి అభిమాని అయిన ఆర్య, ఆ దర్శకుడి సినిమాలో తన పాత్రకి పూర్తి న్యాయం చేయాలనే పట్టుదలతో ఈ సినిమా చేస్తున్నారు.

దర్శకుడు అనూప్ భండారి ఆర్య గురించి చెప్తూ, "ఆర్య పెద్ద హీరో అయినా ఎంతో వినయంగా ఉంటారు. సెట్‌లో కరెక్ట్ టైంకి ఉంటారు, పాత్ర కోసం ఏమడిగినా కాదనకుండా చేస్తారు."

రొమాంటిక్ మ్యూజికల్ కామెడీ 'రాజరథం' ప్రపంచవ్యాప్తంగా ఈ నెల 23న విడుదలవుతోంది. 'జాలీ హిట్స్' బ్యానర్‌పై అజయ్ రెడ్డి, అంజు వల్లభనేని, విషు దకప్పగారి, సతీష్ శాస్త్రి నిర్మాతలుగా 'రాజరథం' రూపుదిద్దుకుంది.



మల్టీస్టారర్ రెగ్యులర్ షూటింగ్ ఉగాది నుంచి

మన్మధుడు నాగార్జున, నేచురల్ స్టార్ నాని కాంబినేషన్‌లో కొత్త సినిమా ప్రారంభమైన విషయం తెలిసిందే. సంగీత దర్శకుడు మణిశర్మ సాంగ్ రికార్డింగ్‌తో ఈ సినిమా లాంఛనంగా మొదలైంది. ఇప్పుడీ మూవీ రెగ్యులర్ షూటింగ్‌కు సంబంధించి డేట్ ఫిక్స్ అయింది. మార్చి 18 నుంచి ఈ సినిమా సెట్స్ పైకి రాబోతోంది. శ్రీరామ్ ఆదిత్య దీనికి దర్శకుడు. ఆఫీసర్ సినిమా షూటింగ్ పూర్తిచేశాడు నాగార్జున. అటు నాని కూడా 2 వారాల కిందటే కృష్ణార్జున యుద్ధం సినిమా షూటింగ్ పూర్తిచేశాడు. సో.. ప్రస్తుతం ఈ ఇద్దరు హీరోలు ఫ్రీగానే ఉన్నారు. దీంతో మల్టీస్టారర్‌కు కాల్షీట్లు కేటాయించారు. అలా మూవీ సెట్స్ పైకి రాబోతోంది. ఫస్ట్ షెడ్యూల్ హైదరాబాద్‌లోనే ఉంటుంది. ప్రస్తుతం ఈ సినిమా పాటల రికార్డింగ్ అమెరికాలో జరుగుతోంది. సినిమాకు సంబంధించి 3 పాటల రికార్డింగ్ అక్కడ జరుగుతోంది.

నిర్మాత రాజ్ కందుకూరి చేతులమీదుగా 'డ్రీమ్ బాయ్' చిత్రం ప్రారంభం



రాజేష్ కనపర్తి దర్శకత్వంలో, రేణుక నరేంద్ర నిర్మాతగా మాస్టర్ ఎస్ టి రామ్ చరణ్ సమర్పణలో సెవెన్ వండర్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రొడక్షన్ నెం.1గా తెరకెక్కనున్న చిత్రం 'డ్రీమ్ బాయ్'. తేజ, హరిణి రెడ్డి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ నిర్మాత రాజ్ కందుకూరి క్లాప్ కొట్టగా, మరో నిర్మాత ఏం వి రావు కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఈ కార్యక్రమంలో ధనరాజ్, రాకేష్, సుభేష్ రెడ్డి, లడ్డు, ఆర్ట్ డైరెక్టర్ వెంకట్ సన్నిధి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాజేష్ కనపర్తి మాట్లాడుతూ.. ఇదొక థ్రిల్లింగ్ ఎంటర్‌టైనర్ ప్రేమతో నిండిన క్యూట్ స్టోరీ ఇది. అలాగే సంగీతానికి ప్రాధాన్యమున్న చిత్రమిది. కొత్త, పాత నటీనటులతో ఈ చిత్రాన్ని లావిష్‌గా తెరకెక్కించనున్నాం. ఆద్యంతం కామెడీతో ఈ చిత్రం ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటుందన్న నమ్మకముంది..అన్నారు.

చిత్ర నిర్మాత రేణుక నరేంద్ర మాట్లాడుతూ.. మా డైరెక్టర్ రాజేష్ చెప్పిన కథ ఎంతో నచ్చింది. ఈ చిత్రం ఈ నెల 12 నుంచి హైదరాబాద్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. ఈ చిత్రంలో అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ పొందుపరచనున్నాం. ఈ చిత్రం మాకు, మా బ్యానర్‌కు మంచి నేమ్ తెస్తుందని ఆశిస్తున్నాం.. అన్నారు.

తేజ, హరిణి రెడ్డి, ధనరాజ్, రాకేష్, సుభేష్ రెడ్డి, లడ్డు, గౌతమ్ రాజు తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: నాని, సంగీతం: సుభాష్ ఆనంద్, కో డైరెక్టర్: రాధా కృష్ణ, నిర్మాత: రేణుక నరేంద్ర, కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం: రాజేష్ కనపర్తి.

సెకండ్ ప్లేస్‌లోకి విజయ్ దేవరకొండ

అంతకు ముందు చేసిన సినిమాల మాటేమిటో కానీ అర్జున్ రెడ్డి సినిమా మాత్రం విజయ్ దేవరకొండను స్టార్ హీరోగా నిలబెట్టింది. పెద్దగా ఏ అంచనాలూ లేకుండా వచ్చిన ఈ సినిమా బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ప్రస్తుతం విజయ్ పొజిషన్ ఏంటో తెలిస్తే ఆశ్చర్యపోతారు. హైదరాబాద్ టైమ్స్ నిర్వహించిన మోస్ట్ డిజైరబుల్ మెన్ 2017లో విజయ్ 2వ స్థానంలో నిలిచాడు. దీనికి సంబంధించిన క్రెడిట్ అంతా అర్జున్‌రెడ్డి మూవీకే దక్కుతుంది. టాలీవుడ్ స్టార్ హీరోస్ ప్రభాస్, మహేష్ బాబు, రామ్ చరణ్, అల్లు అర్జున్ వరుసగా మూడు, నాలుగు, ఐదు, ఆరు పొజిషన్లలో నిలవగా విజయ్ వారిని దాటుకుని వెళ్లి మరీ సెకండ్ ప్లేస్‌లో నిలిచాడు. ఈ పెళ్లి చూపులు హీరో ఇచ్చిన బోల్డ్ స్టేట్‌మెంట్స్ యూత్ ఆడియెన్స్‌కు బాగా కనెక్ట్ అయ్యాయి. దీంతో యూత్‌లో విజయ్‌కి ఫ్యాన్ ఫాలోయింగ్ బాగా పెరిగింది.



అనిల్ సుంకర నిర్మాణంలో మహేష్



ప్రస్తుతం 'కిర్రాక్ పార్టీ' ప్రమోషన్ పనుల్లో బిజీగా ఉన్నాడు ప్రొడ్యూసర్ అనిల్ సుంకర. కన్నడ సూపర్ హిట్ 'కిరిక్ పార్టీ'కి రీమేక్‌గా తెరకెక్కిన ఈ సినిమా తెలుగులోనూ సక్సెస్ గ్యారంటీ అని కాన్ఫిడెంట్‌గా ఉన్నాడు. అయితే రీసెంట్‌గా జరిగిన ప్రెస్ మీట్‌లో సూపర్ స్టార్ మహేష్ బాబుతో తమకున్న అనుబంధం గురించి చెప్పుకున్నాడు ఈ ప్రొడ్యూసర్. "మహేష్ బాబుతో మా బ్యానర్‌లో త్వరలో సినిమా తప్పకుండా చేస్తాం. ఈ సారి సినిమా చేశామంటే కంపల్సరీగా ట్రెండ్ సెట్టరే. మాకు మహేష్ బాబుతో మంచి రిలేషన్ షిప్ ఉంది' అని చెప్పుకున్నాడు అనిల్ సుంకర. ఇప్పటి వరకు మహేష్ బాబుతో దూకుడు, 1-నేనొక్కడినే, ఆగడు సినిమాలను నిర్మించిన అనిల్ సుంకర ఈ సారి మహేష్ బాబుతో బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్‌ని ప్లాన్ చేస్తున్నాడు. ఇదిలా ఉంటే ప్రస్తుతం కొరటాల డైరెక్షన్‌లో 'భరత్ అనే నేను' సినిమాతో బిజీగా ఉన్న మహేష్ బాబు, ఈ సినిమా తరవాత వంశీ పైడిపల్లి సినిమాతో సెట్స్ పైకి వస్తాడు.

పవన్ జనసేన కోసం అనూప్ మ్యూజిక్

పవన్‌కల్యాణ్ నటించిన గోపాల గోపాల, కాటమరాయుడు సినిమాలకు అనూప్ రూబెన్స్ సంగీతం అందించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మరోసారి అనూప్, పవన్ కోసం సంగీతం అందిస్తున్నాడు. అయితే అది సినిమా కోసం కాదు. పవన్ స్థాపించిన జనసేన పార్టీ కోసం. ఇంకెన్నాళ్లు ఈ గాయాలు అంటూ సాగే ఈ పాటలో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి నేటి తెలంగాణ విభజన వరకు తలెత్తిన సమస్యలు ప్రభుత్వాల స్పందనకు సంబంధించిన విజువల్స్‌ను ప్రదర్శిస్తారట.

రాఘవేంద్రరావు దర్శకత్వంలో వెంకీ, సునీల్

వందకు పైగా సినిమాలు చేసిన దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు ఓం నమోవేంకటేశాయ సినిమా తర్వాత కాస్త విరామం ప్రకటించారు. ఆధ్యాత్మిక బాట పట్టిన రాఘవేంద్రరావు భక్తి సినిమాలు చేయడానికి ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ప్రస్తుతం అదే తరహాలో మరో సినిమా చేయడానికి ఆయన సిద్ధపడుతున్నట్టు తెలుస్తోంది. ఈ సినిమాలో విక్టరీ వెంకటేష్ హీరోగా నటించబోతున్నట్టు సమాచారం. అలాగే కమెడియన్ సునీల్‌కు కూడా ఇందులో కీలకపాత్ర ఆఫర్ చేస్తారని తెలుస్తోంది. ప్రస్తుతం ఆ సినిమా స్క్రిప్టు పని మీదే రాఘవేంద్రరావు బిజీగా ఉన్నారని టాలీవుడ్ వర్గాల సమాచారం. త్వరలో పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడిస్తారని తెలుస్తోంది. వెంకీ ప్రస్తుతం తేజ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. మరోవైపు సునీల్ హీరోగానే కాకుండా కమెడియన్ పాత్రలకు కూడా సిద్ధపడుతున్నాడు.

తమిళ సినిమా రీమేక్‌లో సందీప్ కిషన్



యంగ్ హీరో సందీప్ కిషన్ ఒకవైపు తెలుగు సినిమాలు చేస్తూనే మరోవైపు తమిళ పరిశ్రమలో కూడా ఉనికిని చాటుకుంటున్నారు. ప్రస్తుతం కార్తీక్ నరేన్ దర్శకత్వంలో 'నరగసూరన్' అనే సినిమాలో నటిస్తున్న ఈయన తమిళ చిత్రం 'ఇంద్రు నేట్రు నాలై' ను తెలుగులోకి రీమేక్ చేసే ఆలోచనలో ఉన్నారట. సైన్స్ ఫిక్షన్ కామెడీ జానర్లో ఉండే ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుందని ఈ రీమేక్‌ను చేయాలని భావిస్తున్నారట సందీప్. అన్నీ కుదిరితే ఈ రీమేక్‌ను నూతన దర్శకుడు శ్రీరామ్ డైరెక్ట్ చేసే అవకాశాలున్నాయి. అయితే టీ టౌన్లో వినిపిస్తున్న ఈ వార్తల పట్ల సదరు హీరో నుండి ఇంకా ఎలాంటి అధికారిక సమాచారం బయటకురాలేదు.

సుమంత్ 25వ సినిమా

'మళ్ళీ రావా' విజయంతో సరికొత్త ఉత్సాహాన్ని అందుకున్న హీరో సుమంత్ త్వరలో తన 25వ సినిమాను ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ నెల 18న ఉగాది పర్వదినం సందర్భంగా అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఈ చిత్రం ప్రారంభంకానుంది. నూతన దర్శకుడు జాగర్లపూడి సంతోష్ ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేయనున్నాడు. ధీరజ్ బొగ్గరం, సుధాకర్ రెడ్డి బీరంలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. త్వరలోనే ఈ చిత్రంలోని నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు తెలియనున్నాయి. ఇకపోతే సుమంత్ ప్రస్తుతం కొత్త దర్శకుడు అనిల్ శ్రీకంఠం దర్శకత్వంలో ఒక సినిమా చేస్తున్నారు.

బాలికల లింగ నిష్పత్తిలో గంజాం ముందంజ



బెర్హంపూర్ : బాలికల లింగ నిష్పత్తిని పెంపొందించడంలో ఒడిశాలోని గంజాం జిల్లా ముందంజలో ఉందని మంగళవారం అధికారులు తెలిపారు. 2017 సంవత్సరానికి గానూ సగటున 1000 మంది బాలురకు 869 మంది బాలికలు ఉన్నారన్నారు. 2014లో 790మంది మాత్రమే వున్నార న్నారు. 2014 సంవత్స రంతో పోలిస్తే పెరుగుదల గణనీయంగా ఉంద న్నారు. జిల్లా అధికారుల కార్యక్రమాలవల్ల చిన్న పిల్లల లింగనిష్పత్తి, పుట్టుక, పెరుగుదలల్లో మార్పులు వచ్చాయన్నారు. లింగ నిర్ధారణని అదుపులో ఉంచడం, "బేటీ బచావో -బేటీ పఢావో" కార్యక్రమాలను తల్లిదండ్రులకు తెలియపరిచి చైతన్యవంతుల్ని చేయడం వల్లే ఇది సాధ్యమైందని జిల్లా వైద్య అధికారి ఆర్.జగదీష్ పట్నాయక్ వివరించారు. జిల్లా కలెక్టర్ ప్రేమ్ చంద్ర చౌదరి తరచూ అల్ట్రా సౌండ్ క్లినిక్ తరచూ పరిశీలిస్తూ లింగ నిర్ధారణ ఆపగ లిగామన్నారు. జిల్లా సలహాదారు ద్వారా డయాగ్న సిస్ టెక్నిక్‌లో వచ్చే మార్పులను తెలుసుకున్నామన్నారు. దీంతో పాటు ఒకరు లేదా ఇద్దరు ఆడ పిల్లలు కలిగిన తల్లిదండ్రులను సన్మానించమని స్వచ్ఛంద సేవా సంస్థల్ని ప్రోత్సహించామని పట్నాయక్ వెల్లడించారు. ఇలాంటి కార్యక్రమాలతో మగ పిల్లలు మాత్రమే కావాలనుకునే వారిలో మార్పు వచ్చిందని పట్నాయక్ వెల్లడించారు.

విదేశీ లాయర్లు భారత్‌లో ప్రాక్టీస్ చేయరాదు

స్పష్టం చేసిన సుప్రీంకోర్టు



ఢిల్లీ: విదేశీ న్యాయ సంస్థలు, విదేశీ న్యాయ వాదులు భారత్‌లో ప్రాక్టీస్ చేయరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ ఆదర్శ్ కే గోయల్, జస్టిస్ ఉదయ్ యు. లలిత్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది. సదరు విదేశీ న్యాయమూర్తులు భారత్‌లో ప్రాక్టీస్ చేసేందుకు అనర్హులని ఈ సందర్భంగా ధర్మాసనం పేర్కొంది. అయితే విదేశీ చట్టాలపై సలహాలు ఇచ్చేందుకు మాత్రం విదేశీ న్యాయసంస్థలు, వారి న్యాయవాదులు భారత్‌కు రావొచ్చని న్యాయస్థానం స్పష్టం చేసింది. దీనిపై కేంద్ర ప్రభుత్వం, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా త్వరలోనే నిబంధనలు తయారు చేయనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. భారత్‌లో విదేశీ న్యాయసంస్థల అనుమతిపై గతంలో మద్రాస్ హైకోర్టు, బాంబే హైకోర్టులు పరస్పరం భిన్నమైన తీర్పులు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని తుది తీర్పును వెల్లడించింది.

2025కి టీబీరహిత భారత్ : మోడీ



న్యూఢిల్లీ : టీబీ రహిత భారతదేశమే తమ లక్ష్యంగా ప్రధాని నరేంద్రమోడీ తెలిపారు. 2025 నాటికి దేశం నుంచి టీబీ వ్యాధిని నిర్మూలిస్తామన్నారు. ఢిల్లీలో నిర్వహించిన టీబీ సదస్సులో మోడీ పాల్గొన్నారు. టీబీని దేశం నుంచే కాకుండా ప్రపంచ నుంచి పారద్రోలే ప్రచారాన్ని ప్రారంభించారు. క్షయవ్యాధి(టీబీ)ని రూపుమాపేందుకు ప్రపంచ వ్యాప్తంగా జరిగిన ఎన్నో ప్రయత్నాలు అనుకున్న స్థాయిలో ఫలితాలు ఇవ్వలేదని, ఈ వ్యాధిని పూర్తిగా తరిమేందుకు అనుసరించే విధానాల్లో మార్పు అవసమని, అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని సాధించగలమని మోడీ అభిప్రాయపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా టీబీకి చెక్ పెట్టేందుకు 2025ని లక్ష్యంగా పెట్టుకొన్నట్టు తెలిపారు. అయితే 2025 కన్నా ఐదేళ్ల ముందుగానే టీబీ రహిత భారతదేశాన్ని సాధించాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. ఇందుకోసం ప్రతి రోగికి వ్యాధి ప్రారంభ దశ నుంచే సాధ్యమైనంత అత్యుత్తమ వైద్యాన్ని అందించాలని నిర్ణయించామన్నారు. ఈ ప్రయత్నాల్లో ప్రైవేటు రంగ సహకారాన్ని తీసుకోనున్నట్టు తెలిపారు. 'టీబీ రహిత గ్రామం, పంచాయతీ, జిల్లా, రాష్ట్రం, దేశం' కోసం ప్రతిస్థాయిలో ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మోడీ పిలుపునిచ్చారు. ఈ దిశగా ఫ్రంట్‌లైన్ టీబీ ఫిజీషియన్స్, వర్కర్లు గణనీయమైన తోడ్పాటును అందించి మార్పును తేగలరన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) 25ఏళ్ల కిందటే టీబీని ఎమర్జెన్సీగా ప్రకటించిందని గుర్తు చేశారు. నాటి నుంచి అనేక దేశాలు తీవ్రస్థాయిలో యత్నించినా అనుకున్న ఫలితాలు రాలేదన్నారు. 10-20 ఏళ్లుగా అనుసరిస్తున్న విధానాలు ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదంటే మన వైఖరిని, విధానాలను మార్చుకోవడం ఎంతైనా అవసరమని, అలాగే వ్యాధిని రూపుమాపేందుకు కొత్త మార్గాలను అన్వేషించాలని మోడీ అన్నారు. భారత్ నుంచి టీబీని తరిమేయడంలో రాష్ట్ర ప్రభుత్వాలు కీలకపాత్ర పోషించాలన్నారు. ఈ మిషన్‌లో భాగస్వాములు కావాలంటూ అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు ఇప్పటికే లేఖలు రాసినట్టు మోడీ తెలిపారు. భారత్‌లో టీబీ నిర్మూలనకు వ్యూహాత్మక ప్రణాళికలు రూపొందుతున్నాయని, ఈ వ్యాధికి చెక్‌పెట్టే పథకాల కోసం బడ్జెట్‌ను క్రమంగా పెంచుతున్నట్టు చెప్పారు. వ్యాధిగ్రస్తులకు పోష్టికాహారాన్ని అందించేందుకుగా వార్షికంగా 100 మిలియన్ డాలర్లను తమ ప్రభుత్వం ఖర్చుచేసేలా నిబంధనలను రూపొందించామని మోడీ తెలిపారు. తాము ప్రవేశ పెట్టిన స్వచ్ఛభారత్ అభియాన్, ఉజ్వల భారత్ యోజన కూడా టీబీ నిర్మూలనకు దోహదపడతాయని అన్నారు. ఈ వ్యాధి దేశంలో ఇంతగా ప్రబలడానికి గత ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణమని మోడీ విమర్శించారు. మూడున్నరేళ్లలో ఇమ్యూనైజేషన్‌ను మెరుగుపర్చామని, వచ్చే ఏడాదికి 90శాతం ఇమ్యూనైజేషన్ కవరేజిని సాధిస్తామని చెప్పారు. సంప్రదాయ వైద్యంలో ఈ వ్యాధిని తగ్గించే అంశాలపై పరిశోధనలను విస్తృతపర్చాలని, లభించిన ఫలితాలను ఇతర దేశాలతో పంచుకోవాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖకు మోడీ సూచించారు. కేంద్ర ఆరోగ్యశాఖ, డబ్ల్యూహెచ్‌ఓ సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సులో ప్రపంచ దేశాల నుంచి నేతలు పాల్గొన్నారు.

రాజస్థాన్ ప్రభుత్వ కాలేజీల్లో

ఇకపై యూనిఫారం తప్పనిసరి కాదు



జైపూర్ : రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కళాశాలల్లో డ్రస్‌కోడ్‌ను తప్పనిసరి చేస్తూ రాజస్థాన్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం వివాదానికి తెరతీసింది. విద్యార్థుల నుంచి భారీగా వ్యతిరేక రావడంతో ఈ ఆదేశాన్ని రద్దు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిం చింది. సీఎం వసుంధరా రాజె స్పందిస్తూ 'విద్యార్థి ప్రతి నిధుల సూచనల మేరకే ప్రభుత్వ కాలేజీల్లో యూని ఫారంను తప్పనిసరి చేస్తూ డైరెక్టరేట్ ఆఫ్ కాలేజి ఎడ్యుకేషన్ ఆదేశాలు జారీచేసింది. ఈ నిర్ణయాన్ని విద్యార్థుల్లో చాలా మంది వ్యతిరేకిస్తున్నట్టు తెలిసింది. దాంతో యూనిఫారం తప్పనిసరి కాదంటూ తాజా ఉత్తర్వులు వెలువరించాం' అని రాజె ట్విట్టర్‌లో పేర్కొ న్నారు. మన బాలికలు విద్యలో రాణించేందుకు అవసర మైనవన్నీ చేస్తామంటూ ఆమె ట్వీట్ చేశారు. 2018-19 విద్యాసంవత్సరం నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కళాశాలల్లో యూనిఫారంను తప్పనిసరి చేస్తూ మార్చి 4న రాజస్థాన్‌లోని బీజేపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీనిపై విద్యార్థి లోకం మండి పడింది. ఈ చర్యను విద్యా సంస్థల కషాయీకరణగా అభివర్ణించింది. ప్రతిపక్ష కాంగ్రెస్ కూడా ఘాటుగా విమర్శించింది. రాష్ట్రంలోని రాజె ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ ఎజెండాను అనుసరిస్తోందని మండి పడింది. కాగా, డ్రెస్‌కోడ్ నిర్ణయాన్ని విద్యార్థుల డిమాండు దృష్ట్యా తీసుకొన్నట్టు ప్రభుత్వం స్పష్టం చేసింది. "బయట వ్యక్తులు కాలేజీల్లోకి వస్తున్నారని, కళాశాలలకు డ్రెస్‌కోడ్ ఉండాలని విద్యార్థులు డిమాండు చేశారు. విద్యార్థుల గుర్తింపుపై స్పష్టత ఉండాలి. యూనిఫారం రంగుపై నిర్ణయాన్ని కాలేజీల యాజమాన్యాలకే వదిలివేశాం. మేం ఏ రంగును సూచించలేదు' అని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి కిరణ్ మహేశ్వరి అన్నారు.

ప్రధాని, రాష్ట్రపతికి సరికొత్త విమానాలు?!



న్యూఢిల్లీ : భారత రాష్ట్రపతి, ప్రధానిలకు ఇక కొత్త విమానాలు అందుబాటులోకి రానున్నాయి. అత్యాధునిక సదుపాయాలతో ఆ విమానాలను రూపొందిస్తున్నారు. 2020లోగా ఎయిర్ ఇండియా వన్ విమానాలు సర్వీస్‌లోకి వస్తాయి. దీని కోసం బోయింగ్ 777 విమానాలకు అప్‌గ్రేడ్ చేస్తున్నారు. భారత ఉప రాష్ట్రపతికి కూడా మరో ఆధునిక విమానం అందుబాటులోకి రానున్నది. ఈ ఏడాది ఆరంభంలోనే మూడు బోయింగ్ 777లను కొనుగోలు చేశారు. ఆ విమానాలకు కొత్త ఫీచర్లను ఏర్పాటు చేస్తున్నారు. సెక్యూర్టీ సిస్టమ్‌లను మరింత పకడ్బందీగా మారుస్తున్నారు. రెండు బోయింగ్‌లకు మాత్రం వీఐపీ ఎన్‌క్లోజర్‌ను, ప్రెస్ కాన్ఫరెన్స్ రూమ్, మెడికల్ ఎమర్జెన్సీ యూనిట్‌ను తయారు చేస్తున్నారు. ఈ విమానాల్లో వైఫైని కూడా అమరుస్తున్నారు. యాంటీ మిస్సైల్ సిస్టమ్స్, రాడార్ మెకానిక్స్, ఇతర సెక్యూర్టీ ఫీచర్స్ కూడా ఉంటాయి. ఇప్పటి వరకు రాష్ట్రపతి, ప్రధాని కోసం బోయింగ్ 747ఎస్ విమానాలను వాడారు. 777 వల్ల వీవీఐపీ ట్రాన్స్‌పోర్ట్‌లో చాలా మార్పు వస్తుంది. ఈ ప్లేన్‌తో నాన్‌స్టాప్‌గా అమెరికా వరకు వెళ్లవచ్చు. అంటే దారిలో రీఫ్యుయలింగ్ ఇక అవసరం ఉండదు. కమ్యూనికేషన్ వ్యవస్థ కూడా అత్యాధునికంగా ఉంటుంది. వీవీఐపీలకు పర్సనల్ రూమ్‌లు కూడా ఉంటాయి. ఈ విమానాలకు రెండు జీఈ90-115బీఎల్ ఇంజిన్లు ఉంటాయి. ప్రస్తుతం ఈ ఇంజిన్లే విమానాలకు అత్యంత శక్తివంతమైనవని భావిస్తున్నారు. త్వరలోనే ఎయిర్ ఇండియా నుంచి ఈ విమానాలను కొనుగోలు చేయనున్నట్లు ప్రభుత్వ అధికారులు వెల్లడించారు.

వేర్వేరు ప్రదేశాల్లో

80 కిలోల గంజాయి స్వాధీనం

బెర్హంపూర్ : ఎక్సైజ్ శాఖ అధికారులు మూడు వేర్వేరు ప్రదేశాల్లో 80కేజీల గంజాయిని సీజ్ చేసి ఆరుగురిని అరెస్టు చేశారు. ఈ ఆరుగురు ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాలోని వేర్వేరు ప్రాంతాలకు చెందినవారని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. సీజ్ చేసిన గంజాయి విలువ సుమారు 4లక్షల 50 వేలుగా ఉంటుం దన్నారు. గంజాయిని ఒక చోట నుంచి మరో చోటుకి తరలి స్తున్న సందర్భంలో సోమవారం సాయంత్రం అరెస్టు చేశామ న్నారు. మొదటి కేసులో 60కేజీల గంజాయిని, వారు ప్రయాణిస్తున్న కారును బెహంపూర్ గ్రామంలో స్వాధీనం చేసుకొని ముగ్గురిని అరెస్ట్ చేశామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ కుమార్ పట్నాయక్ వివరించారు. రెండవ కేసులో బెర్హంపూర్‌కి 25 కిలో మీటర్ల పరిధిలో వున్న దిగాపాహండి బస్టాండ్‌లో 50వేల విలువ కలిగిన 10కేజీల గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఒక వ్యక్తి అరెస్టు చేశామన్నారు. మూడవ కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 11కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అక్రమరవాణా నిరోధించడానకి గజ పతి, కంధమాల్ జిల్లాలో గాలింపు తీవ్రతరం చేస్తునామని పట్నాయక్ వెల్లడించారు.

అంగన్‌వాడీ కార్మిక, సహాయకుల పెండింగ్ జీతాలకు డిమాండు

జమ్మూ : అంగన్‌వాడీ కార్మికులు, సహాయకులకు తక్షణమే పెండింగ్ జీతాలు విడుదల చేయాలని, జీతాలు పెంచాలని కార్మిక నాయకులు మంగళవారం డిమాండు చేశారు. తమ జీతాల విడుదల చేయడంలో ప్రభుత్వం విఫలమయ్యిందని వారు విమర్శించారు. ఇంతకుముందు 41రోజులు బంద్ చేసినా ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోలేదని సంఘ అధ్యక్షుడు సుమన్ సూరి ఆగ్రహం వ్యక్తం చేశారు. జీతాలు పెంచాలని, పెండింగ్‌లోని జీతాలు విడుదల చేసి, సీపీయారిటీ జాబితా ప్రకారం పెన్షన్ పథకాన్ని కార్మికులకు రూ.2లక్షలుగా, సహాయకులకు రూ.1లక్షగా చేసి పదవీవిరమణ పొందే వారికి సహాయం చేయాలని వారు కోరారు. ప్రస్తుతం వర్కర్స్‌కి రూ. 3,600, హెల్పర్స్‌కి రూ. 1,800 ప్రభుత్వం ఇస్తోంది. ఇతర రాష్ట్రాలు, ఢిల్లీల్లో వర్కర్స్‌కి రూ. 10వేలు, సహాయకులకు రూ. 6వేలు ఇస్తున్నారని సూరి వివరించారు. ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ పై నమ్మకముందని, ఆమె తమ సమస్యలను అర్థం చేసుకొని పరిష్కరిస్తారన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మొత్తం మీద 28వేల కార్మికులు, సహాయకులు ఉన్నారు. 1975 ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలెప్‌మెంట్ స్కీమ్‌లో వారు పనిచేస్తున్నారు. సీపీఎం నాయకుడు, ఎమ్మెల్యే ఎమ్ వై తిరాగిమి వారి డిమాండులకు మద్దతు తెలిపారు.

అత్యంత సంపన్న ఎంపీ జయాబచ్చన్!

ఢిల్లీ: దేశంలోనే అత్యంత సంపద కలిగిన ఎంపీగా బాలీవుడ్ నటి, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) నుంచి రాజ్యసభకు పోటీ చేస్తున్న ఎంపీ జయా బచ్చన్ నిలవనున్నారు. రాజ్యసభ ఎన్నికల నిమిత్తం ఆమె నామినేషన్ పత్రాలతో పాటు తన ఆస్తులకు సంబంధించిన వివరాల జాబితాను అఫిడవిట్ రూపంలో ఎన్నికల అధికారులకు సమర్పించారు. దీని ప్రకారం ఆమె స్థిర, చర ఆస్తులు దాదాపు రూ.1000కోట్లు ఉన్నట్లు తెలుస్తోంది. 2014 రికార్డుల ప్రకా రం అత్యధిక సంపద కలిగిన రాజ్యసభ ఎంపీగా భాజపాకు చెందిన రవీంద్ర కిషోర్‌సిన్హా ఉన్నారు. ఆయన రాజ్యసభలోకి వచ్చే సమయంలో ఆయన ఆస్తులు రూ.800కోట్లుగా చెప్పారు. 2012లో జయాబచ్చన్ ఆస్తులు రూ.493కోట్లుగా చూపించారు. ప్రస్తుతం అమితాబ్ బచ్చన్ జయాబచ్చన్ స్థిరాస్తులు రూ.460కోట్లు కాగా.. చరాస్తులు రూ.540కోట్లు ఉన్నాయి. వారిద్దరికి రూ.62కోట్ల విలువ చేసే బంగారం ఉంది. ఇందులో అమితాబ్‌కు రూ.36కోట్ల విలువైన బంగారం ఉండగా.. జయాకు రూ.26కోట్ల బంగారం ఉంది. వీటితో పాటు రూ.13కోట్ల విలువ చేసే 12కార్లు ఉన్నాయి. రోల్స్ రాయల్స్, మూడు మెర్సిడెస్, పోర్షె, రేంజ్‌రోవర్ కార్లు ఉన్నాయి. అమితాబ్‌కు సొంతంగా టాటా నానో, ట్రాక్టర్ ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇక అమితాబ్, జయాకు ఉన్న వాచ్‌ల ఖరీదు రూ.3.4కోట్లు, రూ.51లక్షలు. అమితాబ్ వద్ద రూ.9లక్షల విలువ చేసే పెన్ను ఉంది. ఫ్రాన్స్‌లో రెసిడెన్షియల్ ప్లాట్ ఉంది. నోయిడా, భోపాల్, పూణె, అహ్మదాబాద్, గాంధీనగర్, ఉత్తర్‌ప్రదేశ్‌లో బరబంకి జిల్లాలో వీరికి స్థలాలు ఉన్నాయి.

ఏడో రోజూ అంతరాయమే

- ఉభయ సభలు నేటికి వాయిదా
- ద్రవ్య బిల్లుని చేపట్టని లోక్‌సభ
- వెల్ వద్ద ప్రతిపక్షాలు, టీడీపీ ఏఐఏడీఎంకే సభ్యుల ఆందోళన



న్యూఢిల్లీ : పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రతిష్టంభన కొనసాగుతోంది. దీనితో లోక్‌సభ కీలకమైన 2018-19 ద్రవ్యబిల్లును చేపట్టలేకపోయింది. బడ్జెట్ రెండో దశ సమావేశాలు మంగళవారం ఏడోరోజు కూడా తుడిచి పెట్టుకు పోయాయి. వివిధ అంశాలపై ప్రతిపక్షాల సభ్యుల ఆందోళనతో సభా కార్యకలాపాలను స్తంభింపచేయడంతో ఎటువంటి కార్యకలాపాలను చేపట్టకుండానే ఉభయ సభలు వాయిదాపడ్డాయి. మంగళవారం కూడా ఉభయ సభలు సభ్యుల ఆందోళనలతో మిన్నుముట్టాయి. ఈ నెల 5వ తేదీన సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ప్రతిపక్ష సభ్యులతో పాటు పాలక ఎన్డీయే మిత్రపక్షాలైన టీడీపీ, శివసేన ఎంపీలు సభా కార్యకలాపాలను అడ్డుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విభజన హామీలు నెరవేర్చాలని టీడీపీ సభ్యులు ఆందోళన చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శించి తమ నిరసన తెలిపారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ)కుంభకోణం, కావేరిజల నిర్వాహణ బోర్డు ఏర్పాటు వంటి అంశాలపై సభ్యుల ఆందోళనలతో ఉభయ సభలు ఎటువంటి కార్యకలాపాలను చేపట్టలేదు.

లోక్‌సభలో టీడీపీ, కాంగ్రెస్, ఏఐఏడీఎంకే, టీఆర్ఎస్, తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు వెల్ వద్దకు దూసుకురావడంతో ప్రశ్నోత్తరాలు, జీరో అవర్ సాగలేదు. దానితో స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను తొలుత గంటపాటు వాయిదా వేశారు. లోక్‌సభ షెడ్యూల్ ప్రకారం ఈ రోజు 2018-19 సంవత్సరానికి ద్రవ్యబిల్లు, 2017-18, 2018-19 సంవత్సరానికి 2017-18, 2018-19 ఆర్థిక సంవత్సరాలకు కేటాయింపు బిల్లును చేపట్టాల్సి ఉన్నది. మధ్యాహ్నం సభ తిరిగి సమావేశమైన తరువాత కూడా నిరసనలు కొనసాగాయి. దానితో సభా కార్యక్రమాలు ఏవీ చేపట్టలేదు. నిరసన తెలుపుతున్న సభ్యులు "ఉయ్ వాంట్ జస్టిస్" అని నినాదాలు చేయడం వినిపించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి గత వారం బయటకు వచ్చినప్పటికీ ఎన్డీయేలోనే కొనసాగుతున్న టీడీపీ సభ్యులు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ప్రకటించాలని డిమాండు చేశారు. 'మిత్ర ధర్మం పాటించండి" అని రాసిన ప్లకార్డులను వారు ప్రదర్శించారు. ఆంధ్రప్రదేశ్ అంశంపై వైఎస్సార్ కాంగ్రెస్ సభ్యులు కూడా నిరసన తెలిపారు.

కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) కుంభకోణం అంశాన్ని లేవనెత్తారు. టీఆర్ఎస్ సభ్యులు రిజర్వేషన్ కోటా పెంచాలని, ఏఐఏడీఎంకే సభ్యులు కావేరి యాజమాన్య బోర్డును ప్రభుత్వం తక్షణం నియమించాలని డిమాండు చేశారు. పీఎన్‌బీలో జరిగిన రూ. 12,700 కోట్ల కుంభకోణంలో పాత్ర ఉందన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న వజ్రాల వ్యాపారి నిరవ్ మోడీని ఉద్దేశించి 'చోటా మోడీ కహన్ గయా' అని రాసిన ప్లకార్డుల ఒక ఆందోళనకారుడు చేబూనాడు. తమ సీట్ల వద్ద లేచినిలబడ్డ వామపక్ష సభ్యులు కొన్ని ఫొటోగ్రాఫ్‌లను ప్రదర్శించారు. గందరగోళం కొనసాగుతుండడంతో స్పీకర్ సభను బుధవారానికి వాయిదా వేశారు. అంతకుముందు వివిధ స్థాయీసంఘం నివేదికలను సభ ముందు ఉంచారు.

రాజ్యసభలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. సభ ఉదయం సమావేశం కాగానే సభ్యులు నిరసన గళం విప్పడంతో 15 నిముషాలపాటు వాయిదాపడింది. ఆ తరువాత మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదాపడింది. సభ తిరిగి సమావేశం కాగానే, ఎన్డీయే మిత్రపక్షం టీడీపీతో సహా ప్రనతిపక్షాల సభ్యులు వెల్‌వద్దకు చేరుకుని నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. సభాధ్యక్ష స్థానంలో ఉన్న డిప్యూటీ ఛైర్మన్ పీజే కురియన్ దేశంలో క్రూడాయిల్, పెట్రోలియం ఉత్పత్తుల వ్యూహాత్మక నిల్వలకు సంబంధించి సావధాన తీర్మానాన్ని చేపట్టేందుకు ప్రయత్నించారు. చర్చను ప్రారంభించాల్సిందిగా బీజేపీ సభ్యులు చునీభాయి కంజిభాయి గోయెల్‌ను కోరారు. వెల్ వద్ద ఉన్న ప్రతిపక్ష, టీడీపీ, ఏఐఏడీఎంకే సభ్యులు పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ, ప్లకార్డులను ప్రదర్శించారు. ఆగ్రహం చెందిన కురియన్ "ఇది సరైన పద్ధతికాదు" అని అన్నారు. "ఎంపీల ప్రవర్తన ఇలాగే కొనసాగితే, సభను వాయిదా వేస్తాను. ఆమె (టీడీపీ సభ్యురాలు) ప్లకార్డును ప్రదర్శిస్తోంది. ఇది నిబంధనలకు విరుద్ధం. ఈ విధంగా ప్రవర్తించడం సరి కాదు. దీనితో నేను అంగీకరించను.." అని సభను వాయిదా వేయడానికి ముందు కురియన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

కార్చిచ్చు ఘటనలో టూరిస్టు గైడు అరెస్టు

థేని : తమిళనాడులో జరిగిన కార్చిచ్చు ఘటనలో 36 మంది పర్వతారోహకులకు నేతృత్వం వహించిన టూరిస్టు గైడ్ రంజిత్ (30)ను మంగళవారం అరెస్టు చేశా మని పోలీసులు తెలిపారు. శనివారం జరిగిన ఈ దుర్ఘటనలో ఏడుగురు మహిళలు, ముగ్గురు పురుషులు మృతి చెందారు. పశ్చిమ కనుమల్లో కురంగని పర్వతాల నుంచి ప్రారంభమైన ఈ పర్యటన విషాదాంతంగా మారింది. రంజిత్‌తో పర్వతారోహకులుకు పరిచయం ఎలా కలిగిందన్న విషయంపై పోలీసులు విచారిస్తున్నారు.

ఇంకా అనేక లక్ష్యాలు సాధించాలి

గౌహతి: ప్రపంచంలో భారత ఆర్థిక వ్యవస్థ శీఘ్రగతిన అభివృద్ధి చెందుతున్నప్పటికీ సాధించవలసిన లక్ష్యాలు ఇంకా చాలా ఉన్నాయని అస్సాం గవర్నర్ జగదీష్ ముఖి అన్నారు.మార్చి 12న మేఘాలయ మహ్మతా గాంధీ యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ మనదేశంలో 130 కోట్ల జనాభా, కావలసిన యువశక్తి ఉన్నప్పటికీ లక్ష్యాలు అపరిమితంగానే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.నిజజీవితంలో గ్రాడ్యుయేషన్ రోజు అనేది ప్రతి ఒక్కరికి ఒక ముఖ్యమైన సంఘటన అన్నారు.ఆ తర్వాత విద్యార్థి అసలైన జీవితంలోకి ప్రవేశిస్తారని ఆయన పేర్కొన్నారు.

అసోంలో 28 వేల టీచరు పోస్టులు ఖాళీ

గువహతి : అసోం ప్రభుత్వ పాఠశాలల్లో 32 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని దానిలో 28 వేలు టీచర్ల పోస్టులని ప్రభుత్వం అసెంబ్లీలో తెలిపింది. మాధ్యమిక, ఉన్నత పాఠశాల్లో 15,852 ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉందని ఆ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి హేమంత బిస్వా శర్మ వివరించారు. ప్రాథమిక పాఠశా లల్లో 12,121 ఖాళీలు భర్తీ చేయాల్సి ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్యే జకీర్ హుస్సేన్ సిగ్దర్ అడిగిన ప్రశ్నకు ఆయన రాతపూర్వక సమాధానం తెలిపారు. ప్రస్తుతం 99, 234 ప్రాథమిక పాఠశాలల్లోనూ, 55,094 మంది ఉపాధ్యాయులు పనిచే స్తున్నారన్నారు.

రైతు హత్యకేసులో సోదరులకు జీవితకాల శిక్ష

ముజఫర్‌నగర్ (యూపీ) : రైతు హత్యకేసులో ఇద్దరు సోదరులకు జిల్లాకోర్టు జీవితకాల శిక్ష విధించింది. ఈ ఘటన 2013లో షామ్లి జిల్లా ఖదేర్‌ఘర్ గ్రామ పొల్లాల్లో జరిగింది. అదనపు జిల్లా జడ్జి అరవింద్‌రాయ్ దోషులు ప్రదీప్‌కుమార్, సత్యేంద్ర కుమార్‌లకు రూ.20వేల జరిమానాతోపాటు జీవితాకాల శిక్ష విధిస్తూ తీర్పు వెలువ రించారు. పొలాల సరిహద్దులో తగువు ఏర్పడి ఇద్దరు సోదరులు రైతు సంజయ్ మాలిక్‌ను కొట్టి చంపారు.

సరిహద్దు భద్రతపై 20న చర్చ

న్యూఢిల్లీ : కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో అసోం, మిజోరం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల సమావేశం మార్చి 20న జరగనుంది. రెండు రాష్ట్రాల సరిహద్దు గొడవపై విద్యార్థి సంఘాలు నిర్వహిస్తున్న ఆందోళన హింసాయుతంగా మారింది. దీంతో మిజోరం ముఖ్యమంత్రి హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను జోక్యం చేసుకోవాల్సిందిగా కోరారు. కేంద్ర హోం కార్యదర్శి రాజీవ్ గౌబా రెండు రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలతో చర్చిస్తారు. సరిహద్దులో ప్రజలు గుమిగూడటాన్ని అరికట్టడం ద్వారా శాంతిభద్రతలు పెంపొందించడానికి ప్రయత్నిస్తున్నామని మిజోరం ముఖ్యమంత్రి వెల్లడించారు.

అగర్వాల్ వ్యాఖ్యలు అనుచితం

లక్నో : సినిమాల్లో నృత్యాలు చేసుకునేవారికి రాజ్యసభ సీట్లు కేటాయించారన్న రాజ్యసభ ఎంపీ నరేష్ అగర్వాల్ వివాదాస్పద వ్యాఖ్యలను ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాదీపార్టీ (ఎస్పీ) చీఫ్ అఖిలేష్ యాదవ్ ఖండించారు. జయాబచ్చన్‌కు మరోసారి పార్టీ ఎన్నిక చేయడంపై ఆగ్రహించిన నరేష్ బీజేపీలో చేరి, జయాబచ్చన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఆయన వ్యాఖ్యలు దేశంలోని మహిళలందరి మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని బీజేపీ అతనిపై వెంటనే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని అఖిలేష్ ట్వీట్ చేశారు.

సుప్రీంకోర్టు కమిటీతో అఖిలపక్ష సమావేశం

న్యూఢిల్లీ : సీలింగ్ డ్రైవ్ (దుకాణాల మూసివేత) పై సుప్రీంకోర్టు నియమించిన కమిటీని కలసి చర్చించేందుకు అఖిల పక్షంతో వెళుతున్నామని ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా వెల్లడించారు. బీజేపీ మినహా అన్ని పార్టీలు దీనిలో పాల్గొంటున్నాయన్నారు. ఢిల్లీ కాంగ్రెస్‌కు చెందిన అజయ్ మాకెన్,మరో ఇద్దరు ఉన్నారన్నారు. కాంగ్రెస్, ఆప్ ఎంపీలు సీలింగ్ డ్రైవ్‌పై పార్లమెంటులో చర్చలేవనెత్తాలన్నారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఢిల్లీలో ముంచెత్తేందుకు ఈ చర్యలు చేపట్టారని ఆయన విమర్శించారు.


సొరంగంలో కాలుష్యాన్ని నివారించండి

జమ్మూ : చెనాని- నశ్రీ సొరంగంలో వాయు కాలుష్యాన్ని నిరోధించాలని కాశ్మీర్ శాసనసభా పక్షం సిఫార్సు చేసింది. జమ్ము-శ్రీనగర్ జాతీయ రహదారిలో ఈ సొరంగం ఉంది. సంబంధిత సంస్థలు ఈ టన్నెల్‌ను పరిశీలించాలని అసెంబ్లీ పర్యావరణ కమిటీ అధికార ప్రతినిధి ఒకరు కోరారు. గతేడాది ఏప్రిల్‌లో ఈ టన్నెల్‌ను ప్రారంభించిన ప్రధాని మోడీ దీన్ని జాతికి అంకితం ఇచ్చారు. దీంతో జమ్ము-శ్రీనగర్‌కు 30 కిమీ దూరం తగ్గింది. పర్యావరణ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే మహ్మద్ యూసఫ్ ఆధ్వర్యంలో రోడ్లు భవనాల శాఖతో ఈ విషయంపై చర్చించారు.

ఎయిర్‌పోర్టుల భారీ బకాయిలు

న్యూఢిల్లీ : దేశంలో ప్రైవేటు ఆధ్వర్యంలో నడుస్తున్న 6 ఎయిర్‌పోర్టులు సీఐఎస్ఎఫ్‌కు రూ.800 కోట్లు బకాయిపడ్డాయని లోక్‌సభకు తెలిపారు. ఢిల్లీ విమానాశ్రయాన్ని, ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం లిమిటెడ్ (డీఐఏఎల్) నిర్వహిస్తోంది. దీంతో ఢిల్లీ విమానాశ్రయం రూ. 737.37 కోట్లు డీఐఏఎల్‌కు బకాయి పడిందన్నారు. ముంబై అంతర్జాతీయ విమానం నిర్వహణ ఆధీనంలోని ముంబై ఎయిర్‌ఫోర్టు కేంద్ర పారిశ్రామిక భద్రతాదళాలకు రూ.48.70 కోట్లు బెంగళూరు విమానాశ్రయాన్ని రూ.22. 86 కోట్లను బెంగళూరు అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుకు బాకీ పడినట్లు సభ్యులు వివరించారు.

కార్తీ కేసులో సీబీఐ స్పందన కోరిన హైకోర్టు



న్యూఢిల్లీ : కార్తీ చిదంబరం బెయిల్ పిటిషన్‌లో సీబీఐ స్పందనను హైకోర్టు కోరింది. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో సీబీఐ ఆయనను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. మార్చి 16 లోపు ప్రస్తుత పరిస్థితిపై నివేదిక అందించాలని జస్టిస్ ఎస్పీ గార్గ్ సీబీఐను కోరారు. కార్తీ తరపున సీనియర్ అడ్వకేట్, కాంగ్రెస్ నాయకుడు కపిల్ సిబాల్ వాదనలు వినిపించారు. మంగళవారం ఉదయం జస్టిస్ ఇంద్రమీత్ కౌర్‌వద్దకు ఈ కేసు వెళ్లగా ఆమె ఈ కేసునుంచి తప్పుకున్నారు. అత్యవసరంగా ఈ కేసును విచారించాలన్న కార్తీ అభ్యర్థనను సోమవారం కోర్టు కొట్టివేసింది.

గురుద్వారా నిర్వహణపై ఘర్షణ

టార్న్‌టరన్ (పంజాబ్) : స్థానిక గురుద్వారా నిర్వహణపై రెండు వర్గాలకు ఘర్షణ జరిగిందని పోలీసులు వెల్లడించారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారిందని, ప్రస్తుతం 400 మంది పోలీసు బలగాలను మోహరించామన్నారు. రంజోధ్ సింగ్ గురుద్వారా బాధ్యతలు స్వీకరించడానికి వచ్చిన నేపథ్యంలో ఈ ఘర్షణలు చెలరేగాయి. మూడేళ్లుగా గురుద్వార బాధ్యతలు నిర్వహిస్తున్న వర్గం బాధ్యతలు అప్పచెప్పడానికి అంగీకరించలేదని డీఎస్పీ సత్పాల్ సింగ్ వెల్లడించారు. కోపోద్రేకులైన గ్రామస్తులు రంజోధ్ సింగ్ వాహనాన్ని తగులబెట్టారని, ఆరుగురికి గాయాలయ్యాయని సింగ్ వివరించారు.

వలసదారుల పదాలు వాడొద్దు : వెంకయ్య

న్యూఢిల్లీ : సామ్రాజ్య వాదుల పదాలు వాడొద్దని రాజ్యసభ చైర్మన్ వెంకయ్య నాయుడు మరోసారి రాజ్యసభ సభ్యులను కోరారు. కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పి. రాధాకృష్ణ మాట్లాడుతూ నేను మిమ్ములను వేడుకునేదేమంటే (ఐ బెగ్)అని ప్రారంభించగానే ఆయన నివారించారు. నేను ఈ విషయం చెబుతున్నాను అని చెప్పితే సరిపోతుందని, ఇతర పదాలను వాడవద్దని వారించారు. కాగ్ నివేదికలపై చర్చించడానికి రాధాకృష్ణ పై విధంగా చర్చను ప్రారంభించారు.


31 మంది కాలేజీ విద్యార్థినులకు అస్వస్థత

విశాలాంధ్ర- విజయవాడ : విజయవాడలోని ఎస్‌ఆర్‌ఆర్ కాలేజీ ఆవరణలో కొనసాగుతున్న కంచికచర్ల సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో నిల్వ ఉన్న కోడి కూర తినడంతో తీవ్ర అస్వస్థతకు గురైన విద్యార్థినుల సంఖ్య మంగళవారానికి 31కి చేరింది. వీరిలో 20 మంది ఓ ప్రైవేటు ఆస్పత్రిలో, మరో 11 మంది ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కంచికచర్లలోని సోషల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీ కళాశాల హాస్టల్‌ను తాత్కాలికంగా నగరంలోని ఎస్‌ఆర్‌ఆర్ కాలేజీ ఆవరణలో ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ఆ హాస్టల్‌లో 117 మంది విద్యార్థినులు ఉంటున్నారు. కొందరు సోమవారం రాత్రి నిల్వ ఉన్న కోడి కూర తినడంతో అస్వస్థతకు గురయ్యారు. మొదట 26 మందిని ఆస్పత్రికి తీసుకువెళ్లారు. మంగళవారం మరి కొందరు అస్వస్థతకు గురికావడంతో వారిని ఆస్పత్రిలో చేర్పించారు. ఫుడ్‌పాయిజన్ నేపథ్యంలో మరికొందరు విద్యార్థినులు స్వల్ప అస్వస్థతకు గురవడంతో ఎస్‌ఆర్‌ఆర్ కాలేజీ ఆవరణలోనే ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌ను మంగళవారం జాయింట్ కలెక్టర్ విజయకృష్ణన్ పరిశీలించారు. జిల్లా మాంసాహార కమిటీ చైర్మన్ ప్రకాష్ నాయుడు కళాశాలకు చేరుకుని కారణాలు తెలియజేయాలని కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యంను డిమాండ్ చేశారు. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను కళాశాల విద్య విభాగం ప్రత్యేక కమిషనర్ సుజాత శర్మ పరామర్శించారు.

కొడుకును చంపేసి తల్లీ ఆత్మహత్యాయత్నం



విశాలాంధ్ర - పూండి : క్షణికావేశంలో కన్నకొడుకును హత్యచేసిన ఓ తల్లి తానూ పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం అమలపాడు పంచాయతీ చినబచ్చలవానిపేటలో మంగళవారం చోటుచేసుకుంది. చినబచ్చల వానిపేటకు చెందిన బచ్చలకుమారికి ముగ్గురు కుమారులు. ఉపాధి కోసం పెద్ద, చిన్న కుమారులు విదేశాలు వెళ్లారు. రెండవ కుమారుడు లోకనాథం తల్లి వద్ద ఉంటూ వ్యవసాయం పనులకు వెళ్తున్నాడు. ఐదేళ్ల క్రితం మందస మండలం బేతాళపురానికి చెందిన లోలాక్షితో లోకనాథానికి వివాహమైంది. నేటికీ సంతానం లేకపోవడంతో ఇంట్లో తరచూ గొడవలు జరుగుతున్నాయి. గత సంక్రాంతి పండగకు పుట్టింటికి వెళ్ళిన లోకనాథం భార్య లోలాక్షి అక్కడే ఉండిపోయింది. దీంతో లోకనాథానికి రెండో పెళ్ళి చేయాలని కుటుంబ సభ్యులు ఆలోచించారు. తాను లోలాక్షితోనే జీవనం సాగిస్తానని, వేరేగా కాపురం పెట్టాలని తల్లితో కొడుకు వాదనకు దిగేవాడు. లోకనాథానికి మతి భ్రమించిందన్న ఉద్దేశంతో విశాఖలోని మానసిక వైద్య నిపుణుని వద్ద చూపించడంతో అటువంటి జబ్బు ఏమీ లేదని, బలవర్థకమైన ఆహారం తీసుకోవాలని వైద్యుడు సూచించడంతో సోమవారం సాయంత్రం తిరిగి స్వగ్రామం చేరుకున్నారు. ఇంటికి వచ్చిన లోకనాథం మళ్ళీ తల్లితో వాదనకు దిగడంతో ఆవేశంలో కుమారి పక్కనున్న ఇనుప రాడ్డు (మసాలా దంచే కుద్దు)తో కొడుకు తలపై బలంగా కొట్టింది. దీంతో లోకనాథం స్పృహ తప్పి పడిపోయాడు. బంధువులు వెంటనే సమీపంలోని పూండి ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే లోకనాథం మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న తల్లి కుమారి జీడి తోటలకు ఉపయోగించే పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న కుమారిని పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్ళారు. వజ్రపుకొత్తూరు ఎస్సై సురేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం కోసం పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



ఉత్సాహంగా కార్మికుల క్రీడా పోటీలు

కార్మికుల జోనల్ స్థాయి క్రీడల్లో వెలుగూరి రాధాకృష్ణమూర్తి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ : ఆంధ్రప్రదేశ్ కార్మిక సంక్షేమ మండలి ఆధ్వర్యంలో మేడే సందర్భంగా కార్మికుల జోనల్ స్థాయి క్రీడలు, సాంస్కృతిక పోటీలు మంగళవారం స్థానిక బీఆర్ స్టేడియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. గుంటూరు జోన్ సంయుక్త కార్మిక కమిషనర్ ఎస్.లక్ష్మీనారాయణ, వివిధ కార్మిక సంఘాల నాయకులు బెలూన్లను గాల్లో ఎగురవేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సభలో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పోటీలు కార్మికుల మధ్య స్నేహభావంతో కూడిన ప్రగతికి దోహదపడాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ సంపదను సృష్టించే కార్మికులలో దాగిన శక్తిని వెలికితీసేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.క్రాంతికుమార్ మాట్లాడుతూ కంపెనీల యాజమాన్యాలను ఒప్పించి వారి వద్ద కార్మికులకు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి సభ్యులు కె.వి.సుబ్బారావు, డీసీఎల్ మల్లేశ్వరకుమార్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకుమాను నాగేశ్వరరావు, ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు రావుల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

పల్లంట్ల మిర్చి... వెరీ క్రేజ్



విశాలాంధ్ర - దేవరపల్లి : పల్లంట్ల మిర్చికి యమ గిరాకీ ఉంది. ఘాటు, రుచిలోనూ ఎంతో నాణ్యత ఉండటంతో మంచి పేరుంది. పశ్చిమగోదావరి జిల్లా మెట్ట ప్రాంతమైన దేవరపల్లి మండలంలో సాగయ్యే పల్లంట్ల మిర్చి కారం ఏడాది పొడవునా రంగు మారకుండా సువాసనతో ఘుమఘుమలాడటంతో వేసవి సీజన్‌లో జిల్లాతోపాటు ఇతర జిల్లాలవాసులు పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తుంటారు. రైతులంతా సేంద్రియ ఎరువులతో మిర్చి పండించటంతో గిరాకీ ఎక్కువే. పల్లంట్ల గ్రామంలో రైతులు అధిక విస్తీర్ణంలో సాగు చేస్తుంటారు. పచ్చిమిర్చితోపాటు పక్వానికి వచ్చి పండిన కాయలను కోసి ఆరుబయట కల్లాల్లో ఎండబెట్టి ఎండిన తర్వాత గుట్టలుగా వేసి రైతులే స్వయంగా వ్యాపారులుగా ఈ ఎండుమిర్చిని అమ్ముతుంటారు. కల్లాల్లోనే తక్కెడ, తూనికరాళ్లతో తూచి, అక్కడే అమ్మకాలు సాగిస్తుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈసు అంటే 1400 గ్రాముల ధర రూ.400 పైబడే అమ్ముతుంటారు. పల్లంట్ల కారం నిల్వ పచ్చళ్లకు ఉపయుక్తంగా ఉండటంతో పచ్చళ్లు పట్టే వారు ఈ మిర్చి కొనుగోలు సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చి కొనుగోలు చేస్తుంటారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి వేసవిలో పెద్దఎత్తున ఇక్కడకు రావడంతో సరకు అమ్మకాలు వేగంగా సాగుతుంటాయి. ఈ మిర్చి తోటలు ఏప్రిల్, మే నెల వరకు ఉండటంతో స్థానికులు, ఇతర జిల్లాల వారు కూడా సీజన్‌లో పచ్చళ్లను పట్టుకోవడానికి ఆసక్తి కనబరుస్తుంటారు. ఈ తోటల వలన స్థానిక కూలీలకు రెండు నెలల పాటు పనులు దొరుకుతుంటాయి.

శ్రీవారి సన్నిధిలో రాజస్థాన్ సీఎం



విశాలాంధ్ర - తిరుమల : తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారిని మంగళవారం వేకువజామున రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధరరాజే కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. తొలుత అర్చకసేవలో పాల్గొన్నారు. టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ స్వయంగా దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం అనంతరం టీటీడీ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

నిరుద్యోగ సమస్యపై మంత్రివర్గ ఉపసంఘం అవశ్యం



విశాలాంధ్ర - అనంతపురం అర్బన్ : రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేయాలని, ఖాళీ ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేసి భర్తీకి చర్యలు తీసుకోవాలని అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. అనంతపురంలోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో మంగళవారం ఏఐవైఎఫ్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షులు కేవై ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. లెనిన్‌బాబు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇంటికొక ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఇస్తామని ఇచ్చిన హామీల అమలులో టీడీపీ ప్రభుత్వం విఫలమైందన్నారు.

నగదుకి కటకట

- ఆరు నెలల్లో రెండు జిల్లాల్లో వెయ్యి కోట్లు వెనక్కి!
- భారీగా డిపాజిట్ల ఉపసంహారణ
- పింఛను చెల్లింపునకు నగదు లేక ఇక్కట్లు





విశాలాంధ్రబ్యూరో-శ్రీకాకుళం : బ్యాంకుల్లో డబ్బు దాచుకునే సంస్కృతి నానాటికీ తగ్గిపోతోంది. నగదు వేసే వారి కంటే తీసేవారి సంఖ్య నాలుగు రెట్లు ఎక్కువ ఉంటున్నట్టు తెలుస్తోంది. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఆరునెలల కాలంలో సాధారణ ప్రజలు దాదాపు రూ.వేయి కోట్ల మేర డిపాజిట్లు ఉపసంహరించుకున్నట్టు అధికారులు లెక్కలు తేల్చారు. ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలోని ఈ మొత్తాన్ని వెనక్కి తీసుకోవడంతో నగదు కొరత ఏర్పడినట్టు తెలుస్తోంది. 'బెయిల్ ఇన్' అనే కొత్త పద్ధతి ప్రవేశపెట్టేందుకు రిజర్వు బ్యాంకు సిద్ధమవుతుందన్న వదంతుల నేపథ్యంలోనే ఈ పరిస్థితి నెలకొందని గుర్తించారు. ఏదైనా బ్యాంకు దివాలా తీసే పరిస్థితుల్లో లేదా బడాబాబులు భారీగా రుణాలు తీసుకుని ఎగ్గొట్టినా, సాధారణ ప్రజల డిపాజిట్లను ఫ్రీజ్ చేయడమే ఈ 'బెయిల్ ఇన్'. అంటే డిపాజిట్ చేసిన మొత్తంలో పదిశాతమే సదరు వినియోగదారునికి ఇస్తారన్నమాట. ఈ వదంతుల వ్యాప్తితో గత ఆరు నెలల్లో ఈ రెండు జిల్లాల్లో రూ.వేయి కోట్లను డిపాజిట్‌దారులు ఉపసంహరించుకున్నారు. శ్రీకాకుళం జిల్లాలో వివిధ బ్యాంకులకు చెందిన 335 శాఖల్లో రూ.9,500 కోట్ల నగదు డిపాజిట్లు ఉన్నాయి. డిసెంబర్ 2017 నాటికి అవి రూ.9,070 కోట్లకు చేరుకున్నాయి. ప్రస్తుతం రూ.8500 కోట్లకు చేరినట్టు లీడ్ బ్యాంకుకు చెందిన ఓ సీనియర్ అధికారి ధృవీకరించారు.

శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో నగదు కొరతతో అన్ని బ్యాంకు శాఖలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. మార్చి మొదటి వారంలో పింఛన్ల కోసమే రూ.35 కోట్లు అవసరం ఉండగా, కేవలం రూ.25 కోట్లు మాత్రమే అందుబాటులో ఉండటంతో ఒడిశా రాష్ట్రంలోని బ్యాంకులపై ఆధారపడాల్సి వచ్చింది. బరంపూర్, జయపుర బ్యాంకుల నుంచి నగదు సర్దుబాటు చేయాల్సి రావడాన్ని బట్టి నగదు కొరత ఏ స్థాయిలో ఉందో ఊహించవచ్చు. విజయనగరం జిల్లాలో సైతం పింఛన్ల కోసం రూ.28 కోట్లు అవసరముంటే నగదు సర్దుబాటు కోసం అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా, అందులో సగమైనా రావడం లేదని సిబ్బంది చెబుతున్నారు. ఇప్పటికే శ్రీకాకుళం కలెక్టర్ కె.ధనంజయరెడ్డి లీడ్ బ్యాంకు అధికారులతో ఈ విషయమై పలు ధపాలుగా చర్చలు జరిపారు. ప్రభుత్వమిచ్చే రూ.వేయి పింఛను అందరికీ అందాల్సిందేనని, దీనికోసం ఏమైనా చేయమంటూ ఆయన ఆదేశాలిచ్చారు. అవసరమైతే రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియాకు లేఖ రాయాలని, పేదలు రోజువారీ అవసరాలకు నగదు కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని వివరించాలని సూచించారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయాలని జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్ పి.వెంకటేశ్వరరావుకు సూచిస్తున్నారు.

నగదు రహిత లావాదేవీలు ఇప్పుడిప్పుడే మెరుగవుతున్నప్పటికీ బ్యాంకు సర్వీసు ఛార్జీల కోసం మొత్తం బిల్లుపై అదనంగా మరో రెండు శాతం వసూలు చేస్తున్నారు. పెదపాడు రోడ్డులోని ఓ ద్విచక్రవాహన షోరూంలో ఇటీవల ఇదే విషయమై పెద్ద ఘర్షణే జరిగింది. ఓ వినియోగదారుడు బైక్ సర్వీసు బిల్లు రూ.750ను కార్డు ద్వారా చెల్లిస్తుండగా, అదనంగా రూ.24 సర్వీసు చార్జీ రూపంలో సిబ్బంది కార్డు ద్వారానే తీసుకున్నారు. రూ.24 మొత్తానికి బిల్లు అడగడం, వారు ససేమిరా అనడంతో ఘర్షణ చోటు చేసుకుంది. ఇలాంటి ఘటనలు తరచూ వస్త్ర దుకాణాల్లోనూ, డిపార్ట్‌మెంటల్ స్టోర్స్‌లోనూ వెలుగుచూస్తున్నాయి. నగదు చేతికిస్తే మంచిదంటూ వినియోగదారులు కూడా అలవాటు పడిపోతున్నారు. ఫలితంగా కొరత ఏర్పడుతోంది. సేవింగ్ అకౌంట్లలో డబ్బు దాచుకునే వారు సైతం నగదును ఇంట్లోనే వుంచుకుంటున్నట్టు సమాచారం. బ్యాంకుల్లో నగదు వేసి అవసరమైనప్పుడు ఏటీఎంలకు వెళుతున్న సమయంలో అవి వెక్కిరించడమే అందుకు కారణమని వారు చెబుతున్నారు. గంటల తరబడి క్యూలైన్లో నిల్చున్నా డబ్బులు దొరకడం లేదని, ఇంట్లోనే వుంచుకోవాల్సి వస్తోందని వారంటున్నారు. జిల్లాలో నగదు కొరతపై ఎప్పటికప్పుడు రిజర్వ్ బ్యాంకును సంప్రదిస్తున్నట్టు లీడ్ బ్యాంక్ మేనేజర్ పి.వెంకటేశ్వరరావు తెలిపారు.



హోదా సాధనలో చంద్రబాబు వైఫల్యంతో రాష్ట్రానికి తీవ్ర నష్టం

విశాలాంధ్ర-ఉరవకొండ (అనంతపురం) : రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పూర్తిగా వైఫల్యం చెందారని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. అనంతపురం జిల్లా ఉరవకొండలో వైసీపీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి పాదయాత్రలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన మంగళవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. పార్లమెంటు సాక్షిగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయడంలో బీజేపీ విఫలమైతే, వాటిని సాధించడంలో చంద్రబాబు వైఫల్యం చెందారన్నారు. నాలుగేళ్లుగా ప్రత్యేక హోదా అడిగిన వారందరినీ అరెస్టులు చేసి కేసులు పెట్టించిన చంద్రబాబు ప్రస్తుతం ప్రజల్లో హోదా సెంటిమెంట్‌గా మారడంతో దిగిరాక తప్పలేదని ఆరోపించారు. బీజేపీతో సన్నిహితంగా ఉంటున్న చంద్రబాబు కేంద్ర మంత్రులను ఉపసంహరించుకున్నప్పటికీ డ్రామాలు ఆడుతున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా ఊసరవెల్లి రాజకీయాలను మానుకొని హోదా కోసం జగన్ చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న దుష్టపాలనలో వైసీపీ నాయకులు, కార్యకర్తలపై హత్యలు, అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు.

మహిళా ఖైదీలకు వృత్తివిద్యా కోర్సులు

జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు సుష్మా



విశాలాంధ్ర - నెల్లూరుబ్యూరో : మహిళా ఖైదీలకు వృత్తివిద్యాకోర్సుల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్టు జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు సుష్మాసాహు అన్నారు. నెల్లూరు చెముడుగుంట వద్ద జిల్లా కేంద్రకారాగారాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. మహిళా ఖైదీల సమస్యలు తెలుసుకున్నారు. భోజనవసతి, వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం పినాకిని అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర కారాగారాల్లోని మహిళా ఖైదీల వసతులు, ఇతర పరిస్థితులను అధ్యయనం చేస్తున్నామన్నారు. నెల్లూరు జిల్లా కేంద్ర కారాగారంలో 19 మంది మహిళా ఖైదీలు ఉన్నందున మహిళా డాక్టరు, మహిళా నర్సుల నియామకం అవసరాన్ని కమిషన్‌కు సూచిస్తామన్నారు. జైళ్లలో పురుషులు, మహిళలు సమానమే అన్నారు. దినసరి భత్యం విషయంలో మూడు రకాలను సిఫారసు చేయనున్నట్లు తెలిపారు. కేంద్ర కారాగారాలను ఐడీఎల్ కారాగారాలుగా తీర్చిదిద్దేందుకు కొన్ని సూచనలు చేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు రమాదేవి, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ప్రశాంతి, నెల్లూరు డీఎస్పీ మురళీకృష్ణ, రూరల్ డీఎస్పీ జయరామి రెడ్డి, కేంద్ర కారాగార పర్యవేక్షకులు ఎం. రవికిరణ్, జైలర్ కాంతారాజ్ తదితరులు పాల్గొన్నారు.

యాసిడ్ పోస్తానని ప్రేమోన్మాది బెదిరింపు

విశాలాంధ్ర-చల్లపల్లి : తనను ప్రేమించకపోతే యాసిడ్ పోస్తానంటూ బెదిరించిన ప్రేమోన్మాదిని మంగళవారం కృష్ణాజిల్లా చల్లపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. మోపిదేవి మండలంలోని బోడుగుంట గ్రామానికి చెందిన యువకుడు తేళ్ల రాము కొంతకాలంగా ఇదే మండలంలోని రావివారిపాలెనికి చెందిన మైనర్ బాలిక వెంటపడుతున్నాడు. సోమవారం ఇంటర్మీడియట్ పరీక్ష అనంతరం ఇంటికి బయలుదేరిన బాలికను వెంటాడుతూ వేధించాడు. యాసిడ్ పోస్తానని బెదిరించటంతో విద్యార్థిని భయాందోళనతో సమీపంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది. బాలిక ఫిర్యాదు మేరకు ఎస్సై డి.చంద్రశేఖర్ ఫోక్స్ చట్టం కింద కేసు నమోదు చేశారు. మంగళవారం రామును అరెస్ట్‌చేసి అవనిగడ్డ కోర్టుకు తరలించడంతో న్యాయమూర్తి 15 రోజులపాటు రిమాండ్ విధించారు.





హోంగార్డు బాషా, కానిస్టేబుల్ కాళీనాగవరప్రసాద్‌కు రివార్డులు అందజేస్తున్న సీపీ, తదితరులు

దొంగలు తిరగబడ్డా పట్టుకున్నారు

- విజయవాడలో పోలీసులపై దొంగల దాడి
- కానిస్టేబుల్, హోంగార్డుకు రివార్డులు

విశాలాంధ్ర-విజయవాడ : బడ్డీకొట్టులో దొంగతనం చేసేందుకు ప్రయత్నిస్తున్న ముగ్గురు ముఠాను పట్టుకునేందుకు వచ్చిన కానిస్టుబుల్, హోంగార్డుపై ఎదురు దాడి చేసిన ఘటన సోమవారం అర్ధరాత్రి విజయవాడ నగరంలో కలకలం రేపింది. అయినా వెంటాడి దొంగలను పట్టుకున్నారు.

విధినిర్వహణలో ధైర్యసహసాలు ప్రదర్శించిన కానిస్టేబుల్, హోంగార్డులను నగర పోలీసు కమిషనర్ డి.గౌతంసవాంగ్, అడిషనల్ పోలీస్ కమిషనర్ క్రాంతి రాణా టాటా ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందించారు. విజయవాడ కొత్త వంతెన సెంటర్ సమీపంలోని ఓ బడ్డీలో దొంగతనం చేసేందుకు సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ముగ్గురు దొంగలు ప్రయత్నిస్తున్నారు. స్థానికులు గుర్తించడంతో పారిపోయారు. వెంటనే స్థానికులు కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇచ్చారు. అధికారుల ఆదేశాలు అందుకున్న సత్యనారాయణపురం స్టేషన్ పరిధిలో నైట్ బీట్ కానిస్టేబుల్ ఆర్.కాళీనాగవరప్రసాద్, హోంగార్డు బాషా దొంగల కోసం గాలింపు చేపట్టారు. దుర్గాపురం వద్ద మోటారుసైకిల్‌పై ముగ్గురు వెళుతుండగా అనుమానించి ప్రశ్నించారు. వారిలో ఒకరు పారిపోయేందుకు ప్రయత్నించడంతో కానిస్టేబుల్ వెంబడించారు. దుర్గాపురంలోని ఓ పాఠశాల ప్రహరీ దూకి ముళ్లపొదల్లోకి చొరబడ్డ దొంగలు వెంటాడుతున్న పోలీసులపై దాడి చేశారు. అయినా కానిస్టేబుల్ చాకచక్యంగా ముళ్ల పొదల్లోకి వెళ్లి దొంగను పట్టుకున్నారు. అదే సమయంలో నైట్ డ్యూటీలోని పోలీసు సిబ్బంది, అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పారిపోయేందుకు ప్రయత్నించిన వ్యక్తి పాతనేరస్తుడు ఏబియేలుగా పోలీసులు గుర్తించారు. నగరంలో దొంగతనాలు, తీవ్ర నేరాలకు పాల్పడి జైలుశిక్ష అనుభవించి బయటకు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. సమయస్ఫూర్తితో దొంగలను పట్టుకున్న కానిస్టేబుల్ కాళీనాగవరప్రసాద్, హోంగార్డు బాషాలకు మంగళవారం సాయంత్రం పోలీస్ ఉన్నతాధికారులు రివార్డు అందజేశారు.

'తాడిపూడి' ఎత్తిపోతల ఎదురీత

- బడ్జెట్‌లో రూ.70 కోట్ల కేటాయింపు
- మూడేళ్ల నుంచి పూర్తి కాని టెండర్లు
- కదలని భూసేకరణ, కాలువల పనులు



విశాలాంధ్ర బ్యూరో- ఏలూరు : తాడిపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణంలో ఎదురీదుతోంది. అధికారుల నిర్లక్ష్యం దెబ్బకు రూ.400 కోట్లు అదనపు ఖర్చు పెరిగినా పనులు ముందుకుసాగని అయోమయ పరిస్థితి . పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ భాస్కర్ స్వయంగా జలవనరులశాఖ అధికారులను నిద్రపోతున్నారా అంటూ హెచ్చరించినా మూడేళ్లలో ఒక్క టెండర్ ప్రక్రియ కూడా పూర్తి కాకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్య పాలనకు అద్దం పడుతోంది. ఈ ఎత్తిపోతలకు నాడు అంకురార్పణ చేసింది చంద్రబాబునాయుడే అయినా... తొలి దశ పనులను పూర్తి చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2007 సెప్టెంబరు 25వ తేదీన37 వేల ఎకరాలకు సాగునీరు సరఫరా ప్రారంభించారు. ఆ తర్వాత అంచెలంచెలుగా ఈ నీటి పెంపు ద్వారా లక్ష ఎకరాలకు నీరు అందుతోంది. గత మూడున్నరేళ్లుగా రెండో లిఫ్ట్ పనులు ప్రారంభించకపోవడం, భూసేకరణ పూర్తి కాకపోవడంతో ఈ ప్రాజెక్టు ఎందుకూ కొరగాకుండా ఉంది. కేవలం రబీ పంటకు మాత్రం లక్ష ఎకరాలకు పైబడి నీరందిస్తున్నారు. రెండో పంటకు ఉపయోగపడని పరిస్థితి. ఆశించిన ప్రయోజనం నెరవేరకపోగా అంచనా వ్యయం రూ.468 కోట్ల నుంచి రూ.888 కోట్లకు పెరిగిపోయింది. దీంతో జలవనరులశాఖ అధికారులు మాత్రం ఖరీఫ్‌లో 1.53 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చేస్తున్నట్టు కాకి లెక్కలు చెప్పడం విమర్శలకు దారితీస్తోంది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ఈ ఎత్తిపోతలకు కేటాయించిన రూ.70 కోట్లు పెండింగ్ పనుల బిల్లులకు కూడా సరిపోని అయోమయ పరిస్థితి. ఏటా వర్షాకాలంలో గోదావరి నీరు వృథాగా పోకుండా తాడిపూడి ఎత్తిపోతల పథకం ద్వారా ఖరీఫ్ పంటకు మాత్రమే నీరిస్తున్నారు.

తాడిపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణం రూ.303 కోట్ల అంచనా వ్యయంతో మొదలైంది. తర్వాత రూ.480 కోట్లకు పెంచారు. 14 మండలాల్లోని 135 గ్రామాల పరిధిలో 2,06,600 ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందించాలన్నది దీని లక్ష్యం. ప్రధాన కాలువ పొడవు 80.45 కిలోమీటర్లు. వరి, అపరాల పంటలకు సాగునీరు ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. గతేదాది బడ్జెట్‌లో రూ.96.61 కోట్లు కేటాయించారు. సబ్‌లిఫ్ట్ 1,2 తో గోపాలపురం మండలానికి, 3తో దేవరపల్లి మండలాలకు మాత్రమే సాగునీరు అందుతోంది. ప్రధాన కాలువలో రూ.80 కిలోమీటర్ల మేర భూసేకరణ పూర్తయింది. కాలువ పనులు పూర్తికాకపోవడంతో పూర్తి స్థాయిలో సాగునీరు అందడం లేదు. దెందులూరు, ద్వారకాతిరుమల మండలాల్లో భూసేకరణ, కాల్వల పనులు ఇంకా చేపట్టలేదు. వీటికి సంబంధించి నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది. తాడిపూడి వద్ద గోదావరి జలాలను ఎత్తిపోసి కాలువల ద్వారా సుమారు 74 కిలోమీటర్ల దూరంలోని నల్లజర్ల మండల పొలాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యం అసంపూర్తిగానే నిలిచిపోయింది. ఇంకా మెయిన్ కెనాల్‌పై 154 స్ట్రక్చర్ల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా 141 పూర్తి చేశారు. 31 పంపిణీ కాలువలు పూర్తి చేయాల్సి ఉంది. ఇవన్నీ పురోగతిలో ఉన్నప్పటికీ ఎప్పటికి పూర్తవుతాయో తెలియని అయోమయ పరిస్థితి.

కలెక్టర్ నిలదీసినా..నిర్లిప్తతే

తాడిపూడి లిఫ్ట్ ఇంకెన్నాళ్లు.. మూడేళ్లయినా ఇంకా టెండర్ల ప్రక్రియలోనే ఉన్నారా.. పనిచేయాల్సిన సమయంలో నిద్రపోతారా.. అంటూ పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టరు కె.భాస్కర్ స్వయంగా జలవనరులశాఖ అధికారులను నిలదీసినా ముందుకు సాగని అయోమయం. మూడు వారాల నుంచి చెబుతున్నప్పటికీ ఇంకా టెండర్లు అప్‌లోడ్ చేస్తున్నామని చెప్పడానికి సిగ్గుగా లేదా.. అసలు పనిచేయాలనే ఆలోచన ఉన్నదా.. ఏమిటీ నిర్లక్ష్యం, నాటకాలు కట్టిపెట్టి 72 గంటల్లో తాడిపూడి టెండర్ల ప్రక్రియ ఆన్‌లైన్ చేయని పక్షంలో కొందరు అధికారులు సస్పెండ్ కావడం ఖాయం.. గత నెల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ భాస్కర్ హెచ్చరిక.. అయినా నేటికీ బాధ్యులపై కనీస చర్యలు లేవు. టెండర్లు ప్రక్రియ పూర్తి కాలేదు. అధికారుల నిర్లక్ష్యం, పాలకుల పర్యవేక్షణ లోపం కారణంగా మరో రూ. 400 కోట్లు అదనంగా ప్రజాధనాన్ని ఖర్చు చేయించారని, విలువైన సమయం కూడా వృధా అయిందంటూ కలెక్టర్ ఆవేదన వ్యక్తం చేసినా వారిలో చలనం రాలేదు. తాడిపూడి లిఫ్ట్ ఇరిగేషన్ 69 ప్యాకేజీలలో మిగిలిన 30 ప్యాకేజీల పనుల టెండర్లు పూర్తికాలేదు. గత ఏడాది నిధులు రూ. 96 కోట్లు, ఈ ఏడాది కేటాయింపులు రూ. 70 కోట్ల నిధులతో ఇకనైనా పనులు ముందుకుసాగుతాయో లేదో వేచిచూడాలి.

పేదల పొట్ట కొడుతున్న పాలకులు : ఆవుల శేఖర్

విశాలాంధ్ర బ్యూరో కర్నూలు : కేంద్రరాష్ట్రప్రభుత్వాలు పేదల కడుపులు కొడుతూ మోసం చేస్తున్నాయని, ఉపాధి హామీ పనులకు కేటాయించిన నిధులు దారి మళ్లిస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం అధ్యక్షులు ఆవుల శేఖర్ ఆందోళన వ్యక్తం చేశారు. కరవు, వలసల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ కర్నూలు జిల్లాలో చేపట్టిన జీపు జాతాను మంగళవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యవసాయకార్మికసంఘం జిల్లా కార్యదర్శి కె రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి శేఖర్ మాట్లాడుతూ రాయలసీమ జిల్లాలో ముఖ్యంగా కర్నూలు జిల్లాలో వ్యవసాయ కార్మికులు పనులు లేక ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారన్నారు. ప్రభుత్వం కరవు నివారణ చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. కరవుతో గ్రామాలకు గ్రామాలే ఖాళీ అవుతున్నా ప్రభుత్వానికి చీమకు ట్టినట్లు కూడా లేదని విమర్శించారు. జాబ్‌కార్డుతో సంబంధం లేకుండా పనులు చూపాలని, సంవత్సరానికి 200రోజులు పనిదినాలు కల్పించాలని శేఖర్ కోరారు. అనంతరం



జాపుజాతా కోడుమూరు తదితర ప్రాంతా ల్లో సాగింది. ఈ కార్య క్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ మునెప్ప, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు నారాయణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇ శ్రీరాములుగౌడ్, ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రమేష్ బాబు, డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి సి మహేష్, మహిళా సమాఖ్య నాయకులు కోటమ్మ, ధనలక్ష్మి, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి మోటారాముడు, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి వి నాగరాజు వ్యవసాయ కార్మికసంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని విడగొట్టేందుకు బీజేపీ ప్రయత్నం..

విశాలాంధ్ర అమరావతి : కేంద్రంలో ఉన్న బీజేపీ రాష్ట్రాన్ని మరోసారి విడగొట్టేందుకు ప్రయత్నిస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్లో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర సంక్షేమానికి సహకారం అందించాల్సిన మోడీ సర్కార్ నిరంకుశంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఒక ఓటుకు రెండు రాష్ట్రాలు అనే సిద్ధాంతాన్ని భాజపా మళ్ళీ తెరమీదకు తేస్తుందని ఆరోపించారు. మోడీ పై విశ్వాసం ..మోడీ ప్రభుత్వంపై అవిశ్వాసం ..వైకాపా తీరు ఇదని తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. జగన్‌కి అపాయింట్ మెంట్ ఇచ్చిన మాదిరిగానే నిరవ్ మోడీకి అపాయింట్ మెంట్ ఇస్తారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో బడ్జెట్ సమావేశాలు ప్రశాంతంగా జరుగుతున్నాయని అన్నారు. అన్ని చర్చలు సజావుగా జరుగుతున్నాయని ,కానీ అసెంబ్లీలో ప్రతిపక్ష పార్టీ లేకపోవటంతో కిక్ లేదని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నాయకుడు రోడ్ల పై ఉచిత ముద్దులు పెట్టుకుంటు పోతే సరిపోతుందా అంటూ ఎద్దేవాచేశారు. ప్రధాని మంత్రిని రాష్ట్ర ప్రజలు ప్రశ్నిస్తున్నారని కేంద్రం ఇది గుర్తించాలని అన్నారు. జగన్ తో ఎందుకు ఆంతరంగిక సమావేశం అవ్వాలని మోడీని ప్రశ్నించారు. రాజకీయ పార్టీల సిద్ధాంతాలు మారిపోయి కొత్తపుంతలు తొకుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు ఉత్తర దక్షిణ భారత దేశం అనడంలో తప్పులేదని, దక్షిణాది రాష్ట్రాలపై వివక్ష చూపించ వద్దని మాత్రమే కోరుతున్నామని పేర్కొన్నారు..

నేడే జనసేన ఆవిర్భావ సభ

- నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న మైదానంలో
- సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు
- లక్షలాదిమంది కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యేందుకు ఏర్పాట్లు
- పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై కీలకప్రకటనలు వెలువడే అవకాశాలు



విశాలాంధ్రబ్యూరో-గుంటూరు: గుంటూరు పరిధి నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న విశాల మైదానంలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ మహాసభకు ముమ్మరంగా ఏర్పాట్లు చేశారు. బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు సభ జరుగుతుంది. సాయంత్రం 4గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ప్రసంగిస్తారు. ఈ సభలో పార్టీ భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించే అవకాశాలున్నాయి. దీనివలన లక్షలాదిమంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు దీనికి హాజరయ్యేందుకు సిద్ధమౌతున్నారు. విశాలమైన వేదికతోపాటు భారీఎత్తున ఏర్పాట్లు చేశారు. ఏపీలో పదమూడుజిల్లాల్లో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున సభకు వచ్చేందుకు పయనమైనారు. ఈనేపథ్యంలో లక్షలాదిమంది పార్టీ శ్రేణులు కూర్చునే విధంగా భారీ టెంట్లు, కుర్చీలు ఏర్పాటు చేస్తున్నారు. వేదికపై పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌తోపాటు రాష్ట్రనాయకులు కూడా ఆశీనులు అయ్యే అవకాశం ఉంది. ఆవిర్భావసభకు పెద్దఎత్తున అభిమానులు, కార్యకర్తలు, మహిళలు రావాలని జనసేన పార్టీ వీడియో సందేశం కూడా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతుంది. రాష్ట్రంలో జనసేన ఆవిర్భాయించి నాలుగేళ్లు అయ్యింది. 2014 సాధారణ ఎన్నికల్లో ఆపార్టీ ఎన్నికల బరిలోకి దిగలేదు. అయితే 2019 సార్వత్రిక ఎన్నికల్లో జనసేనపార్టీ ఎవరితో పొత్తు పెట్టుకుని ప్రత్యక్ష ఎన్నికలకు దిగుతుందోననే ఆసక్తి కార్యకర్తల్లో ఉంది. ఈనేపథ్యంలో ఇక్కడ జరిగే మహాసభలో కీలకమైన నిర్ణయాలు ప్రకటించే అవకాశం ఉంది. ఈసభ నుంచే జనసేనపార్టీ విధానాలు, పార్టీ కార్యాచరణ, రానున్న ఎన్నికల్లో ఏఏ పార్టీలతో పొత్తు పెట్టుకుంటాము వంటి అనేక విషయాలు ఈ వేదికపై ప్రకటించే అవకాశాలున్నాయి. ఏపీ ప్రత్యేకహోదా, విభజన హామీలకు సంబంధించి సంయుక్త నిజనిర్ధారణ కమిటీ నివేదిక వెల్లడించిన తర్వాత అనంతర కార్యాచరణ పవన్‌కల్యాణ్ ప్రకటించలేదు. ఈనేపథ్యంలో తదుపరి కార్యాచరణ ఇక్కడ ప్రకటించే అవకాశలుంటాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. జనసేన పార్టీ ఆవిర్భాం దగ్గర నుంచి ప్రత్యక్ష ఎన్నికల్లో పాల్గొనలేదు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొంటే ఎలాంటి వ్యూహాలతో పాల్గొంటుంది, పార్టీ మ్యానిఫెస్టో ఎలా రూపుదిద్దుకుంటుంది వంటి అంశాలు సర్వత్రా చర్చనీయాంశమైనాయి. ఈనేపథ్యంలో ఇక్కడ జరిగే సభ అత్యంత కీలకంగా మారింది. గుంటూరు జిల్లాలో పవన్ కల్యాణ్ ప్రవేశించిన దగ్గర నుంచి నాగార్జున విశ్వవిద్యాలయం సమీపంలో ఉన్న విశాల మైదానం చేరుకునే వరకు నాయకులు, అభిమానులు పెద్దఎత్తున హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. రోడ్లుకు ఇరువైపుల అభిమానులు నిత్యం హోర్డింగ్‌లు ఏర్పాటులో తలమునకలై ఉన్నారు. జనసేన ఆవిర్భావ దినోత్సవంలో ఏర్పాట్లును పర్యవేక్షించేందుకు సుమారు రెండువేలమంది విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. వీరు వచ్చిన అభిమానులకు, అందరికీ తాగునీరు, ఇతర సౌకర్యాలను అందిస్తారు.

అమితాబ్‌కు అస్వస్థత

జోధ్‌పూర్ : ఇండియా సూపర్ స్టార్..బిగ్‌బీ మాజీ ఎంపీ అమితాబ్ బచ్చన్ అస్వస్థతతో ఆసుపత్రిలో చేరారు. అమితాబ్ మరోసారి అస్వస్థతకి గురవ్వడం అభిమానులు ఆందోళన చెందుతున్నారు. అమీర్ ఖాన్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న థగ్స్ ఆఫ్ హిందూస్థాన్ చిత్ర షుటింగ్ తర్వాత బిగ్ బీ అస్వస్థతకి గురి కావడంతో వెంటనే జోధ్‌పూర్‌లోని స్థానిక ఆసుపత్రికి తరలించారు. బిగ్ బీకి చికిత్స అందించేందుకు ముంబై నుండి జోధ్‌పూర్‌కి ప్రత్యేక వైద్య బృందం కూడా వచ్చినట్టు తెలుస్తుంది. ఇటీవల మెడ నొప్పి, వెన్నునొప్పితో బాధ పడుతున్న అమితాబ్ లీలావతి ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందిన సంగతి తెలిసిందే. థగ్స్ ఆఫ్ హిందూస్థాన్ చిత్రంతో పాటు బ్రహ్మాస్త్రా, 102 అనే చిత్రాలలోను బిగ్‌బీ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. అయితే మంగళవారం ఉదయం కూడా పలు ట్వీట్స్ చేసిన అమితాబ్ సడెన్‌గా అస్వస్థతకి గురి కావడంతో అభిమానులు ఆందోళన చెందుతున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థనలు చేస్తున్నారు. "మన తప్పుల్ని సమర్థిం చుకోవటంలో మనం గొప్ప న్యాయవాదులం.. ఇతరుల తప్పులకు తీర్పు ఇచ్చే విషయంలో గొప్ప న్యాయమూర్తులం" అని బిగ్‌బీ మంగళవారం ఉదయం ట్వీట్ చేశారు.



పశువైద్య విద్యార్థుల మానవహారం

సమస్యలు పరిష్కరించే వరకూ తోడ్పాటు : కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో - తిరుపతి : న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత 13 రోజులుగా పశువైద్య విద్యార్థులు కొనసాగిస్తున్న నిరవధిక సమ్మెలో మంగళవారం పోలీసుల అనవసర జోక్యంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకున్నది. వెటర్నరీ యూనివర్సిటీ మెయిన్ గేట్ నుంచి ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన విద్యార్థుల ర్యాలీ జ్యోతిరావుపూలే విగ్రహం వరకు సాగింది. అక్కడ విద్యార్థులు 15 నిమిషాల పాటు మానవహారం నిర్వహించారు. విద్యార్థులనుద్దేశించి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ రైతాంగం కోసం వైద్య సేవలందించాల్సిన పశువైద్య విద్యార్థులను రోడ్లపైకి వచ్చేలా చేసింది రాష్ట్ర ప్రభుత్వమేనని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న వైద్య కేంద్రాలను ఉన్నతీకరిస్తే నిష్ణాతులైన వైద్యుల సేవలు లభిస్తాయని తద్వారా పాడి పశువులు ఆరోగ్యవంతంగా ఉండి పాల దిగుబడి సైతం పెరగగలదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో పాడి పరిశ్రమను అభివృద్ధి పరిచేందుకు తక్షణం స్పందించి రాష్ట్రంలో 500 పశువైద్యులను నియమించాలని కోరారు. పశువైద్య విద్యార్థుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు రైతు సంఘం పూర్తి తోడ్పాటునిస్తుందని తెలిపారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్.వెంకయ్య, టి.జనార్ధన్ మాట్లాడుతూ గత 13 రోజులుగా వెటర్నరి విద్యార్థులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించి సమస్య పరిష్కరించకపోవడం విచారకరమన్నారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు దశల వారీ పోరాటాలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా వెస్ట్ సిఐ అనవసర జోక్యంతో విద్యార్థులను చెదరగొట్టే ప్రయత్నం చేయడంతో రైతు నాయకులు, ఏఐఎస్ఎఫ్ నేతలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ట్రాఫిక్ స్తంభించడంతో మానవహారం విరమించారు. సమ్మెకు మద్దతు పలికిన రైతు నాయకులకు విద్యార్థి నాయకులు భాస్కర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ కార్యదర్శి పీఎల్ నరసింహులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు శశి, శివారెడ్డి, ఉదయ్, అవినాష్, రమేష్, మహేంద్ర, జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు పోషక దాణా కోసం...దాణామృతం: ఆదినారాయణ రెడ్డి

విశాలాంధ్ర-అమరావతి: రాష్ట్రంలో పశుగణాభివృద్ధితో పాడిపరిశ్రమను గణనీయంగా వృద్ధిలోకి తీసుకువచ్చేందుకు వీలుగా పశువులకు బలవర్ధక పోషకాహారాన్ని చౌక ధరకు అందించేందుకు వీలుగా సబ్సిడీ ఇచ్చి దాణామృత తయారీ యూనిట్లను ఏర్పాటుచేయిస్తున్నట్లు రాష్ట్ర మార్కెటింగ్, గిడ్డంగులు, పశుగణాభివృద్ధి, పాడిపరిశ్రమ,మత్స్యశాఖ, సహకార శాఖల మంత్రి సి. ఆదినారాయణ రెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 యూనిట్లు ఏర్పాటుకు ముందుకు వచ్చిన పారిశ్రామికవేత్తలకు మంత్రి మంగళవారం సచివాలయంలో సబ్సడీ పత్రాలను అందచేశారు. రూ. 61.01 కోట్ల వ్యయంతో ఏర్పాటవుతున్న ఈ యూనిట్లకు యాభై శాతం సబ్సిడీని పశుసంవర్ధకశాఖ అందచేస్తోంది. పశుసంవర్ధక శాఖ అభివృద్ధి 11 నుంచి 12 శాతంగా ఉందని దీన్ని 20 శాతానికి పెంచాలన్నది ముఖ్యమంత్రి ఆశయమని మంత్రి ఈ సందర్భంగా వివరించారు. అందుకు అనుగుణంగానే పశుసంవర్ధక శాఖ పశువులకు బలవర్ధక దాణాని తయారీని ప్రోత్సహించి పాడిరైతాంగానికి అందచేయాలని నిర్ణయించిందని అన్నారు. జిల్లాకు ఒక యూనిట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, ఇప్పుడు 12 యూనిట్లు ఏర్పాటుకు ముందుకు వచ్చారని తెలిపారు.

క్రమ'శిక్ష'ణ

తెలంగాణ అసెంబ్లీలో గలాభాపై కోమటిరెడ్డి, సంపత్ సభ్యత్వాలు రద్దు

17 మంది సస్పెన్షన్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: బడ్జెట్ సమావేశాల తొలిరోజు అసెంబ్లీలో నిరసనకు దిగిన కాంగ్రెస్ సభ్యులు సస్పెన్షన్‌కు గురయ్యారు. గవర్నర్ ప్రసంగం సందర్భంగా జరిగిన ఘటనను రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. సభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ మధుసూదనాచారి ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. దీనిని దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. 11 మంది కాంగ్రెస్ సభ్యులను ఈ బడ్జెట్ సమావేశాలు ముగిసేంత వరకు సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. అదే విధంగా మండలి చైర్మన్ స్వామిగౌడ్‌పై హెడ్‌ఫోన్ విసిరి గాయపర్చిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌ల శాసనసభ సభ్యత్వాలను రద్దు చేస్తున్నట్టు తెలిపారు. అలాగే, జానారెడ్డి, జీవన్‌రెడ్డి, గీతారెడ్డి, చిన్నారెడ్డి, ఉత్తమ్‌కుమార్, డీకే అరుణ, మల్లు భట్టి విక్రమార్క, పద్మావతిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వంశీచందర్‌రెడ్డి, మాధవరెడ్డిలనూ సస్పెండ్ చేయాలంటూ శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఆమోదించినట్టు స్పీకర్ వెల్లడించారు.

మండలిలో మరో ఆరుగురిపై వేటు : శాసనమండలి నుంచి ఆరుగురు కాంగ్రెస్ సభ్యులను సస్పెండ్ చేస్తున్నట్లు మండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ రావు ప్రకటించారు. షబ్బీర్ అలీ, పొంగులేటి సుధాకర రెడ్డి, సంతోష్, దామోదర్ రెడ్డి, ఆకుల లలిత, కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డిని సస్పెండ్ చేశారు. బడ్జెట్ సమావేశాలు ముగిసేంత వరకు వీరిపై సస్పెన్షన్ విధించాలంటూ మంత్రి కడియం శ్రీహరి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఆమోదించినట్టు విద్యాసాగర్ వెల్లడించారు.



అభివృద్ధి కోరితే అరెస్టులు చేస్తారా!

ప్రకాశం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నాలో మధు ప్రభృతులు

విశాలాంధ్ర - ఒంగోలు : ప్రకాశం జిల్లా అభివృద్ధి కోసం ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులపై నాన్ బెయిల్‌బల్ కేసులు పెట్టి జైళ్లకు పంపటం హేయమైన చర్య అని, వారిపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేసి బేషర తుగా విడుదల చేయాలని వివిధ రాజకీయ పార్టీల నాయకులు డిమాండు చేశారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ఛలో కలెక్టరేట్ కార్యక్రమం సందర్భంగా 50 మంది సీపీఎం నాయకులపై కేసులు పెట్టి అరెస్టు చేసి జైళ్లకు పంపటానికి నిరసనగా మంగళవారం అన్ని రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు స్థానిక సుందరయ్య భవన్ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు మాట్లాడుతూ జిల్లాకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ ఆందోళనలు చేస్తే అరెస్టులు చేస్తారా.వీరు ఏమన్నా కోట్లకు కోట్లు బ్యాంకులు దోచుకున్నారా, ప్రజల పక్షాన నిలిచి జిల్లా అభివృద్ధికోసం ప్రజల పక్షాన నిలిచి పోరాటం చేయటమేనా వీరు చేసిన నేరం అని ప్రశ్నించారు. జిల్లా అభివృద్ధికి ఇచ్చిన హామీ ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. గత ఏడు సంవత్సరాలుగా జిల్లాను కరవు వెంటాడుతున్నా వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చకపోవటం దారుణమన్నారు. ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చేవరకు పోరాటం సాగుతుందని హెచ్చరించారు. ప్రకాశంజిల్లా అభివృద్ధి వేదిక నాయకులు గోపాలరెడ్డి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి కోసం పోరాటాలు చేస్తున్న నాయకులను అరెస్టు చేసినందుకు క్షమాపణలు చెప్పాలని డిమాండు చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని అన్నారు. రానున్న కాలంలో ప్రజాఉద్యమాలు మరింత ఉధృత రూపం దాలుస్తాయన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు పద్మ మాట్లాడుతూ అరెస్టు చేసిన నాయకులను బేషరుతుగా విడుదల చేయాలన్నారు. సీపీఎం నాయకులు పెంట్యాల హనుమంతరావు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు నాంచారయ్య, ఒంగోలు పట్టణ అభివృద్ధి వేదిక అధ్యక్షులు మారెళ్ల సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్య క్షులు ఈదా సుధాకరరెడ్డి, సీపీఐ నాయకులు ఎస్‌డి సర్దార్ మాట్లాడారు.

విభజన చట్టంలోని హామీలు అమలు చేసే వరకూ పోరాటం

- త్వరలో భవిష్యత్ కార్యాచణ ప్రకటిస్తాం
- ఉద్యోగ సంఘాల జేఏసీ ర్యాలీలో అశోక్‌బాబు



విశాలాంధ్ర-విజయవాడ : పార్లమెంట్ సాక్షిగా ప్రకటించిన విభజన చట్టంలోని హామీలను అమలు పరచలేకపోవడానికి గల కారణాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగు, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పి.ఆశోక్‌బాబు అన్నారు. విభజన హామీలను అమలు పరచే వరకు ప్రజల పక్షాన రాజీలేని పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన చెప్పారు. విభజన చట్టంలోని హామీలను అమలు విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణికి నిరసనగా ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యాన మంగళవారం సాయంత్రం విజయవాడలో ప్రదర్శనను నిర్వహించారు. బందురోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయం నుంచి ప్రారంభమైన నిరసన ప్రదర్శన ఆలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్ వరకు కొనసాగింది. అనంతరం ధర్నా చౌక్ వద్ద ఆశోక్‌బాబు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో విలువలను కాపాడాల్సిన ప్రభుత్వాలు చట్టాలను గౌరవించకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వాలే చట్టాలను గౌరవించనప్పుడు భవిష్యత్తులో ప్రజలకు వాటిపై నమ్మకం పోతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌పై కక్షసాధింపు ధోరణితో వ్యవహిస్తుందని ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో బీజేపీ ఆంధ్రుల నుంచి తీవ్ర నిరసన ఎదుర్కోవాల్సిన పరిస్థితులు వస్తాయన్నారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగా నడుచుకోవాలనే ఉద్దేశంతో తాము సమైక్యాంధ్ర ఉద్యమాన్ని చేపట్టామన్నారు. తిరిగి అదే ప్రజలు రాష్ట్రానికి అన్యాయం జరుగుతుందన్న భావనలో ఉన్నారని, కాబట్టి తమవంతు బాధ్యతగా కేంద్ర ప్రభుత్వానికి నిరసనను తెలియజేస్తున్నామన్నారు. విభజన చట్టంలోని హామీలను అమలు పరిచే వరకు తాము ప్రజల పక్షాన నిలిచి పోరాటం చేసేందుకు వేనుకాడేది లేదన్నారు. రాష్ట్ర రెవెన్యూ లోటు సమైక్యాంధ్ర ఉద్యమంలో ఉద్యోగ సంఘాల జేఏసీతోపాటు కలసి వచ్చిన ఇతర ప్రజా సంఘాలతో త్వరలో సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుంటామన్నారు. రాజకీయ పార్టీలు తమ జెండాను పక్కన పెట్టి రాష్ట్ర ప్రయోజనాలే ఎకైక ఎజెండాగా సమష్టిగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడే వారికి ఉద్యోగ సంఘాల జేఏసీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా రాష్ట్ర ప్రజలు, వారి ప్రయోజనాలే ముఖ్యమని, వాటిని కాపాడేందుకు ఉద్యోగులు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటారన్నారు. ఇప్పటికైనా ఆంధ్రప్రదేశ్‌కు విభజన చట్టంలోని హామీలను అమలు చేస్తామనే స్పష్టమైన ప్రకటన ఇవ్వాలనిడిమాండ్ చేస్తున్నామని ఆశోక్‌బాబు తెలిపారు. ఎన్ఆర్ఐ ఫోరం నాయకుడు శశిబాబు మాట్లాడుతూ విదేశాల్లో ఉన్న ఆంధ్రులు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టారని, రాష్ట్ర విభజన ద్వారా ఒకసారి మోసం చేశారని, విభజన హామీలు అమలు చేయబోమని ప్రకటించడం ద్వారా రెండోసారి మోసం చేశారని పేర్కొన్నారు. ఏపీఎన్‌జీవో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి, కోశాధికారి పి.వీరేంద్రబాబు, నాయకులు ఎ.విద్యాసాగర్, కృష్ణయ్య, శ్రీరాం, నరహరిశెట్టి శ్రీహరి, మట్టా జయకర్, డి.శ్రీను, మనోహర్, గోపీచంద్, భాస్కరరావు, కళ్లేపల్లి మధుసూదన రాజు, సాయిరామ్, కులాయప్ప, వంశీ, ఎం.రత్న కుమారి, కె.శివలీల, ఎం.సుజాత, లలితాంబ, తులసీరత్నం, ఏపీజేఎఫ్ నాయకుడు కృష్ణాంజనేయులు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

త్వరలోనే నిర్ణయం..విద్యుత్ ఉద్యోగులకు హామీ : కళావెంకట్రావు

విశాలాంధ్ర అమరావతి: విద్యుత్ ఉద్యోగుల సమస్యలను త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘం నాయకులకు మంత్రి కళావెంకట్రావు తెలిపారు.బీసీ ఉద్యోగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలాకి శ్రీనివాస రావు ఆధ్వర్యంలో మంగళవారం సచివాలయంలోని మంత్రి కార్యలయంలో విద్యుత్ శాఖ మంత్రి శ్రీ కిమిడి కళావెంకట్రావు గారిని విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించడం జరిగింది. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు నేరుగా జీతాలు చెల్లించుటకు, 1998 నుండి 2004 ఆగస్టు వరకు విద్యుత్ శాఖలో నియమింపబడిన ఉద్యోగులకు ఈ పీఫ్ నుండి జీపీఫ్ సౌకర్యం కల్పించేలా కృషి చెయ్యాలని విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు మంత్రి వినతిపత్రం ఇచ్చారు. ఉద్యోగుల పనిభారం అనుగుణంగా అదనపు పోస్టులు మంజూరు, పీఆర్సీ అమలు పై సంఘం నాయకులు మంత్రిని కలిసి త్వరగాఅమలు అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని సంఘం నాయకులు కోరారు. దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘం నాయకులకు మంత్రి కళా వెంకట్రావు తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరిశా వెంకటేశ్వరరావు, రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు యు.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు డివీ.రమణ, వి.గుణవంతుడు, ఈపీడీసియల్ అధ్య క్షులు కె.సాయిబాబు, వర్కింగ్ ఉపాధ్యక్షులు జి. సత్యనారాయణ, జెన్కో అధ్యక్షు, కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, హరిప్రసాద్, రాష్ట్ర పబ్లిసిటీ సెక్రటరీ జి.రంగారావుతో పాటు 13 జిల్లాల ట్రాన్స్ కో, జెన్కో, డిస్కం అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ కార్యదర్శిగా
రామాంజనేయులు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్రంలో ఇద్దరు ఐఏఎస్‌లకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం మంగళవారం జీవో జారీ చేసింది. పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్‌గా చేస్తున్న బి రామాంజనేయులును అదే శాఖలో ప్రభుత్వ కార్యదర్శిగా నియమించింది. ఎన్ఆర్‌జీఎ బ్యూపీ, నాబార్డ్, ఎస్డీఎస్, ఎస్సీ కాంపొనెంట్ ప్లాన్, ట్రైబల్ సబ్‌ప్లాన్, ఎంహెచ్‌పీ, స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్రా కార్పోరేషన్ తదితర అంశాలను కూడా ఆయన పర్యవేక్షిస్తారు. ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శిగా చేస్తున్న డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డికి పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ బాధ్యతలను అదనంగా అప్పగించింది. ఇంకా ఏపీ వాటర్ సప్లై కార్పోరేషన్, వాటర్‌గ్రిడ్, ఎస్టాబ్లిష్ మెంట్‌తోపాటు విజిలెన్స్ వ్యవహారాలను కూడా ఆయన పర్యవేక్షిస్తారు.

మహనీయుల విగ్రహాల కూల్చివేతకు నిరసనగా
24న విజయవాడలో ర్యాలీ, సభ


దళిత, గిరిజన, ప్రజాసంఘాల ఐక్యవేదిక నిర్ణయం



విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : అంబేద్కర్, పెరియార్, లెనిన్ వంటి మహనీయుల విగ్రహాల కూల్చివేతకు నిరసనగా ఈ నెల 24న విజయవాడలో పెద్దఎత్తున ఆందోళన నిర్వహించాలని దళిత, గిరిజన, ప్రజాసంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. 'మహనీయుల విగ్రహాలు కూల్చివేస్తున్న మనువాద మతోన్మాదులపై చర్యలు తీసుకోవాలి' అని డిమాండు చేస్తూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. 24న తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద అంబేద్కర్ విగ్రహం నుంచి లెనిన్ సెంటర్ మీదుగా ర్యాలీ, ధర్నా చౌక్ వద్ద సభ నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. ఈ సభకు ఐక్య వేదిక చైర్మన్ ఆంధ్ర మాల్యాద్రి అధ్యక్షత వహించారు. ముఖ్యవక్తగా విచ్చేసిన దళిత హక్కుల పోరాట సంఘం రాష్ట్ర కార్యదర్శి కరవది సుబ్బారావు మాట్లాడుతూ మనువాద సిద్ధాంతాలతో మతతత్వ శక్తులు దౌర్జన్యాలకు పాల్పడుతున్నాయన్నారు. దేశంలో, రాష్ట్రంలో దళితులు, గిరిజనులపై దాడులు చేస్తూ మహనీయుల విగ్రహాలను మతోన్మాదులు కూల్చివేస్తున్నారని విమర్శించారు. మతోన్మాదుల దుర్మార్గ చర్యల పై ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలన్నారు. ఆంధ్ర మాల్యాద్రి మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, హేతువాదులు, కమ్యూనిస్టులపై దాడులు చేస్తోందన్నారు. వారి దాడులను తిప్పికొట్టాలన్నారు. దళిత బహుజన ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు మేళా భాగ్యారావు మాట్లాడుతూ ఏ దేశంలోనూ లేనివిధంగా మన దేశంలో అన్ని కులాలు, మతాల వారు ఉన్నారని, వారిని విభజించి పాలించేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందన్నారు. హిందూ మతోన్మాదంతో దళితులు, హేతువాదులపై ఆర్ఎస్ఎస్ దాడులు పెరిగాయన్నారు. ఐక్యవేదిక చేపట్టే నిరసన కార్యక్రమానికి మద్దతు తెలిపారు. ఏఐడిఆర్ఎఫ్ నాయకులు ఎ. విజయ్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు కేఎస్సీ బోస్, గిరిజన సంఘం నాయకులు హనుమంత నాయక్ మాట్లాడుతూ దేశంలో భావప్రకటనా స్వేచ్ఛ పై దాడి చేసే, విగ్రహాలను కూల్చివేసే మతతత్వ వాదులకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. దేశంలో ప్రజలను కులాలు, మతాల పేరుతో విభజంచేందుకు బిజెపి కుట్ర పన్నుతోందని కాపునాడు నేత వై. శ్రీనివాసరావు అన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అఫ్సర్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప, కేవీపీఎస్ నాయకులు జి. నటరాజు, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎం. సూర్యారావు, దళిత, ప్రజాసంఘాల నాయకులు ఎస్. గ్రిటన్, ఎ. వంశీ కృష్ణ, అశోక్, ఎం. నాగేశ్వరరావు, రమణ కుమారి, డాక్టర్ అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏం జరిగినా ప్రభుత్వానిదే బాధ్యత

డీజీపీకి పవన్‌కళ్యాణ్



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : జనసేన ఆవిర్భావ సభ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, లేకుంటే ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వుంటుందని పేర్కొంటూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ మంగళవారం డీజీపీ మాలకొండయ్యకు లేఖ రాశారు. గుంటూరులోని ఆచార్య నాగార్జున వర్సిటీ ఎదురుగా బుధవారం జరిగే జనసేన ఆవిర్భావ సభకు భద్రత కల్పిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై దాడి జరిగితే ప్రజాజీవితంపై తీవ్రమైన ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. గతంలో భీమవరంలో ఫ్లెక్సీ చింపివేసినందుకే అభిమానులు ధర్నా చేశారని, శాంతిభద్రతల సమస్యగా మారిందని పవన్ గుర్తుచేశారు. ఇటీవల అనంతపురం పర్యటనలో తొక్కిసలాట ఘటన ద ృష్ట్యా తాను భద్రత కోరుతున్నట్లు లేఖలో పేర్కొన్నారు. రాష్ట్రంలో తన పర్యటన సందర్భంగా అనివార్యమైన సంఘటనలు ఏమైనా జరిగితే వాటికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని పవన్ స్పష్టంచేశారు. మార్చి 14 తర్వాత కూడా తనకు అందిస్తున్న వ్యక్తిగత భద్రతను కొనసాగించాల్సిందిగా పవన్ డీజీపీని కోరారు.

ఐపీఎల్ ప్రచార గీతం ఆవిష్కరణ

ముంబై : అభిమానులు ఎంతో ఆశగా ఎదురుచూస్తోన్న ఈ ఏడాది ఐపీఎల్ ప్రచార గీతాన్ని సోమవారం నిర్వాహకులు ఆవిష్కరించారు. 'బెస్ట్ వర్సెస్ బెస్ట్' పేరుతో విడుదలైన ఈ గీతం సామాజిక మాధ్యమాల్లో దూసుకుపోతోంది. ముంబైలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి ఈ పాటను విడుదల చేశారు. ఏటా టోర్నీ ప్రారంభానికి ముందు విడుదలయ్యే ఈ ప్రచార గీతానికి అభిమానుల్లో విశేష ఆదరణ ఉన్న విషయం తెలిసిందే. 1957లో సూపర్ డూపర్ హిట్ అయిన బాలీవుడ్ సినిమా 'నయాదౌర్' సినిమాలోని 'యే దేశ్ హై వీర్ జవానో క' పాటను స్ఫూర్తిగా తీసుకుని ఐపీఎల్ ప్రచార గీతాన్ని రూపొందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పాటను హిందీ, తమిళ్, బెంగాలీ, కన్నడ, తెలుగు భాషల్లో విడుదల చేశారు. దక్షిణాఫ్రికాకు చెందిన ఫిల్మ్ మేకర్ డాన్ మేస్, ముంబైకి చెందిన మ్యూజిక్ డైరెక్టర్ రాజీవ్ వీ భల్లా, ప్రముఖ వాయిద్య కారుడు సిద్ధార్థ్ బస్రూర్ ఈ గీతానికి పని చేశారు. విడుదలైన 12గంటల్లోపే ఈ ప్రచార గీతాన్ని 2 కోట్లకు పైగా వీక్షించారు. ఐపీఎల్ ఫ్రాంఛైజీలు, ఆటగాళ్లు ఈ గీతాన్ని అభిమానులతో పంచుకుంటున్నారు. ఇందులో ధోనీ కూడా ఉన్నాడు. రెండేళ్ల నిషేధం ఎదుర్కొని చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ తిరిగి ఈ ఏడాది టోర్నీలో ఆడుతున్న సంగతి తెలిసిందే.

అలా అవుటైన తొలి భారత క్రికెటర్ రాహుల్



కొలంబో: ముక్కోణపు టోర్నీలో భాగంగా సోమవారం శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో భారత ఆటగాడు కేఎల్ రాహుల్ ఓ చెత్త రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. అదేంటంటే అంతర్జాతీయ టీ20 క్రికెట్లో ఇప్పటి వరకు ఏ భారత ఆటగాడు హిట్ వికెట్ రూపంలో ఔటవ్వలేదు. సోమవారం శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో కేఎల్ రాహుల్ హిట్ వికెట్ రూపంలో వెనుదిరిగి భారత్ తరపున అంతర్జాతీయ టీ20ల్లో హిట్ వికెట్ రూపంలో వెనుదిరిగిన తొలి ఆటగాడిగా రికార్డులకెక్కాడు. 10వ ఓవర్లో కుశాల్ మెండీస్ వేసిన ఐదో బంతిని ఎదుర్కొనే క్రమంలో కాస్త వెనక్కి వెళ్లాడు. ఆ సమయంలో అతడి కుడి కాలు వికెట్లను తాకడంతో బెయిల్స్ కిందపడ్డాయి. దీంతో రాహుల్ హిట్ వికెట్ రూపంలో పెవిలియన్ బాట పట్టాడు. ఇప్పటి వరకు అంతర్జాతీయ టీ20 క్రికెట్లో 10మంది ఆటగాళ్లు హిట్ వికెట్ రూపంలో ఔటయ్యారు. వన్డే క్రికెట్లో ఇప్పటి వరకు 65 మంది హిట్ వికెట్ రూపంలో ఔటవ్వగా ఇందులో నలుగురు భారతీయులు ఉన్నారు. నయన్ మోంగియా(1995లో పాకిస్థాన్‌పై), అనిల్‌కుంబ్లే(2003లో న్యూజిలాండ్‌పై), సచిన్ టెండూల్కర్(2008లో ఆస్ట్రేలియాపై), విరాట్ కోహ్లి(2011లో ఇంగ్లండ్‌పై) వన్డే క్రికెట్లో హిట్ వికెట్‌గా వెనుదిరిగారు. అలాగే టెస్టుల్లో చూస్తే ఇప్పటి వరకు 158 మంది ఆటగాళ్లు ఇలా ఔటయ్యారు. భారత క్రికెట్ జట్టు మాజీ సారథి లాల్ అమర్‌నాథ్ చెన్నైలో వెస్టిండీస్‌తో 1949లో జరిగిన టెస్టులో హిట్‌వికెట్‌గా వెనుదిరిగాడు. భారత మాజీ ఆటగాడు మోహిందర్ అమర్‌నాథ్ అయితే ఏకంగా మూడుసార్లు ఇలా ఔటయ్యాడు. అటు టెస్టుల్లోనూ, వన్డేల్లోనూ హిట్ వికెట్ రూపంలో వెనుదిరిగిన ఒకే ఒక్క భారత ఆటగాడు విరాట్ కోహ్లి కావడం గమనార్హం.



ధోనీని దాటేసిన రైనా

కొలంబో: సుదీర్ఘ విరామం తర్వాత భారత జట్టులో చోటు దక్కించుకున్నాడు సురేశ్ రైనా. సఫారీ గడ్డపై దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌లో తనదైన ప్రదర్శన చేసి ఆ తర్వాత ముక్కోణపు టోర్నీకి ఎంపికయ్యాడు. తాజాగా రైనా.. భారత క్రికెట్ జట్టు మాజీ సారథి మహేంద్ర సింగ్ ధోనీని దాటేశాడు. అంతర్జాతీయ టీ20 క్రికెట్లో భారత్ తరపున అత్యధిక పరుగులు సాధించిన ఆటగాళ్ల జాబితాలో రైనా.. ధోనీని వెనక్కి నెట్టి మూడో స్థానంలో నిలిచాడు. ముక్కోణపు టోర్నీలో భాగంగా సోమవారం భారత్-శ్రీలంక మధ్య టీ20 మ్యాచ్ జరిగిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో రైనా 27 పరుగులు చేశాడు. దీంతో అతడి పరుగుల సంఖ్య 1,452కి చేరింది. ధోనీ 1,444పరుగులతో ఆ తర్వాతి స్థానంలో కొనసాగుతున్నాడు. విరాట్ కోహ్లి (1,983), రోహిత్ శర్మ(1,696) అగ్రస్థానాల్లో కొనసాగుతున్నారు. రైనా మరో 48 పరుగులు చేస్తే 1,500 పరుగుల క్లబ్‌లో చేరతాడు. ఈ ఏడాది జరిగే ఐపీఎల్‌లో ధోనీ, రైనా చెన్నై సూపర్‌కింగ్స్‌కు ప్రాతినిథ్యం వహించనున్న సంగతి తెలిసిందే. టీమిండియా త్వరలో విదేశీ పర్యటనలకు వెళ్లనున్న నేపథ్యంలో కోహ్లి, ధోనీతో పాటు పలువురు ఆటగాళ్లకు బీసీసీఐ ముక్కోణపు టోర్నీ నుంచి విశ్రాంతి కల్పించిన సంగతి తెలిసిందే. ముక్కోణపు టోర్నీలో భాగంగా భారత్ బుధవారం బంగ్లాదేశ్‌తో తలపడనుంది. ఆడిన మూడు మ్యాచుల్లో రెండు గెలిచిన భారత్ పాయింట్ల పట్టికలో ప్రస్తుతం అగ్రస్థానంలో కొనసాగుతోంది.



టెస్టు ర్యాకింగ్స్‌లో రబాద నెం.1

ముంబై : ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్ బౌలింగ్ విభాగంలో దక్షిణాఫ్రికా పేసర్ కగిసో రబడా మళ్లీ అగ్రస్థానాన్ని సంపాదించాడు. ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టెస్టు మ్యాచ్‌లో ఏకంగా 11 వికెట్లు పడగొట్టిన రబద దక్షిణాఫ్రికా విజయంలో కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. దీంతో రబద 902 పాయింట్లతో అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. భారత ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ నాలుగో స్థానానికి చేరగా రవీంద్ర జడేజా మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. 902 పాయింట్లు సాధించిన రబద ఈ మార్క్‌ను అందుకున్న 23వ బౌలర్‌గా గుర్తింపు పొందాడు. ఇక దక్షిణాఫ్రికా నుంచి నాలుగో బౌలర్‌గా రికార్డు నమోదు చేశాడు. ఫిలాండర్(2013లో 912), షాన్ పొలాక్(1999లో 909), స్టెయిన్(2014లో 909) పాయింట్లతో తనకన్నా ముందు వరుసలో ఉన్నారు. ఇక బ్యాటింగ్ విభాగంలో అంతగా మార్పులు చోటుచేసుకోలేదు. 943 పాయింట్లతో ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి 912 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. ఇటీవల అద్భుత సెంచరీతో మెరిసిన దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మన్ డివిలియర్స్ 5 స్థానాలు ఎగబాకి 778 పాయింట్లతో ఏడో ర్యాంకు సొంతం చేసుకున్నాడు. ఇక జట్ల ర్యాంకుల్లో ఎలాంటి మార్పు చోటు చేసుకోలేదు. తొలి రెండు స్థానాల్లో భారత్, దక్షిణాఫ్రికా జట్లు ఉండగా మూడో స్థానంలో ఆస్ట్రేలియా కొనసాగుతోంది.

ఆ బ్యాట్‌తోనే ఆడతా : డెనియల్లి



న్యూఢిల్లీ : ఇంగ్లండ్ మహిళా క్రికెటర్ డేనియెల్లి వాట్ గుర్తుండే ఉంటుంది కదా. అదేనండి 2014లో మన పరుగుల యంత్రం, రికార్డుల రారాజు విరాట్ కోహ్లికి ట్విటర్ ద్వారా పెళ్లి ప్రపోజల్ చేసింది తనే. ఇప్పుడు ఆమె గురించి ఎందుకంటే.. త్వరలో ముక్కోణపు టీ20 సిరీస్ కోసం ఇంగ్లండ్ జట్టు భారత్‌లో పర్యటించనుంది. భారత్‌కు వచ్చే ఇంగ్లండ్ జట్టులో డేనియెల్లి సభ్యురాలు. 2014లో టీ20 ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికాపై కోహ్లి ప్రదర్శన చూసిన డేనియెల్లి పీకల్లోతు ప్రేమలో పడిపోయింది. దీంతో ట్విటర్ వేదికగా 'కోహ్లి నన్ను పెళ్లి చేసుకో' అని ప్రపోజల్ కూడా చేసేసింది. అదే ఏడాది టీమిండియా ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లింది. అప్పుడు డెర్బీషైర్‌లో భారత్-ఇంగ్లండ్ మధ్య జరిగిన వార్మప్ మ్యాచ్‌కు వచ్చింది డేనియెల్లి. మ్యాచ్ అనంతరం కోహ్లిని కలిసింది. ఫొటో కూడా దిగింది. ఈ సందర్భంగా కోహ్లి తన దగ్గర ఉన్న ఒక బ్యాట్‌ను కానుకగా బహూకరించాడు. కోహ్లితో దిగిన ఫొటోలను, బ్యాట్‌ను కూడా డేనియెల్లి అప్పట్లో ట్విటర్ ద్వారా పంచుకుంది. ముక్కోణపు సిరీస్ కోసం భారత్ రానున్న డేనియెల్లి తాజాగా మీడియాతో మాట్లాడింది. 'భారత పర్యటనలో నేను కోహ్లి ఇచ్చిన బ్యాట్‌తోనే ఆడతాను. ఎందుకంటే నేను వాడే బ్యాట్ విరిగిపోయింది' అని తెలిపింది. భారత్-ఇంగ్లండ్-ఆస్ట్రేలియా మధ్య ముక్కోణపు టీ20 సిరీస్ మార్చి 23 నుంచి ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్ ఇంగ్లాండ్-ఆస్ట్రేలియా మధ్య జరగనుంది. ఆ తర్వాత మార్చి 25న భారత్.. ఇంగ్లండ్‌తో తలపడనుంది.

తెరపైకి షమీ భార్య మాజీ భర్త

కేసులో మరో కొత్త కోణం
హసీన్‌కు పెళ్లి.. ఇద్దరు పిల్లలు..?
మీడియాపై జహాన్ దాడి





కోల్‌కతా : టీమిండియా పేసర్ మహ్మద్ షమీ వివాహేతర సంబంధాల కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. షమీ భార్య హసీన్ జహాన్‌కు ఇదివరకే పెళ్లైనట్లు వార్తలు రావడం ఇప్పుడు సంచలనం రేపుతోంది. ఆమె మాజీ భర్తనంటూ షేక్ సైపుద్దీన్ అనే పశ్చిమ బెంగాల్ వాసి ఒకరు మీడియా ముందుకు వచ్చారు. స్థానిక చానెల్ (జీ24 గంటా)తో మాట్లాడుతూ.. హసీన్ జహాన్ తన మాజీ భార్య అని, ఆమెను 2002లో పెళ్లి చేసుకున్నాని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లోని బర్భుమ్, సియూరిలో కొంత కాలం కాపురం చేశామన్నారు. అయితే తమ వివాహాన్ని కుటుంబ సభ్యులు అంగీకరించలేదని, హసీన్‌ను తొలిసారి 2000లో కలిశానని, అనంతరం వివాహంతో ఇద్దరం ఒక్కటయ్యామన్నారు. ఆమె ఇద్దరి కూతుళ్లను 2003లో ఒకరిని, 2006లో మరొకరికి జన్మనిచ్చినట్లు సైపుద్దీన్ తెలిపారు. అనంతరం సమస్యలు మొదలయ్యాయని, ఆమె ఉన్నత చదువులు చదువుకొని స్వతంత్రంగా నిలబడాలని కోరుకుందని, మధ్య తరగతి కుటుంబం కావడంతో అది సాధ్యం కాలేదన్నారు. దీంతోనే 2010లో విడాకులు తీసుకున్నామని, ఇద్దరు పిల్లలు హసిన్ దగ్గరే ఉండాలని, ఆమె వివాహనంతరం తండ్రి దగ్గరకు వెళ్లాలని కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. షమీతో ఆమె వివాహనంతరం పిల్లలు తనవద్దకు వచ్చారన్నారు. షమీ, హసీన్ జహన్‌ల మధ్య వివాదం పరిష్కరమై ఒక్కటవ్వాలని సైపుద్దీన్ కోరుకున్నారు. హసీన్ కూతుళ్లు మాట్లాడుతూ.. తన తల్లి ఎక్కడున్నా సంతోషంగా ఉండాలన్నారు. సెలవుల్లో తన తల్లిని కలుస్తామని వారు తెలిపారు. ఈ నేపథ్యంలో రోజూ మీడియా ముందు ప్రశాంతంగా మాట్లాడిన హసీన్ మంగళవారం మీడియాపై అసహన వ్యక్తం చేయడం చర్చనీయాంశమైంది. అయితే ఆమెకు ఇదివరకే పెళ్లైందా లేదనే విషయం అధికారికంగా తెలియరాలేదు. ఇక షమీ వివాహేతర సంబంధాలు కలిగి ఉన్నాడని, తనను వేధిం చాడని హసిన్ జహాన్ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలతో షమీ క్రికెట్ కెరీర్ ప్రశ్నార్థకంగా మారింది. టీమిండియా పేసర్ మహమ్మద్ షమి భార్య హసీన్ జహాన్ మీడియాపై దాడికి దిగారు. కొన్ని రోజులుగా షమిపై సంచలన ఆరోపణలు చేస్తూ హసీన్ వార్తల్లో నిలిచిన సంగతి తెలిసిందే. తాజాగా హసీన్ కోల్‌కతాలోని సెయింట్ సెబాస్టియన్ పాఠశాల వద్ద మీడియాకు కనిపించింది. ఈ నేపథ్యంలో షమిపై తదుపరి చర్యలు తీసుకునేందుకు ఏ విధంగా ముందుకు వెళ్తున్నారని మీడియా ప్రశ్నించింది. దీంతో ఆగ్రహానికి గురైన ఆమె జర్నలిస్టు చేతిలో ఉన్న వీడియో కెమెరాను పగలకొట్టింది. ఆ తర్వాత వారిపై పెద్దగా కేకలు వేస్తూ కారులో అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఈ తతంగాన్నంతా స్థానికులు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో ఉంచారు. నిన్న మొన్నటి వరకు మీడియాతో తన గోడును వెళ్లబోసుకున్న హసీన్ ఇప్పుడు వారితోనే అలా ప్రవర్తించడంతో అవాక్కయ్యారు.

షమి ఫోన్లు సీజ్

హసీన్ ఫిర్యాదు మేరకు షమిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన కోల్‌కతా పోలీసులు ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించారు. షమి దక్షిణాఫ్రికా పర్యటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇవ్వాల్సిందిగా బీసీసీఐకు లేఖ రాశారు. తాజాగా షమి ఫోన్లను సీజ్ చేసి ఫొరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు. ఫోన్‌లోని ఆడియో క్లిప్పులతో పాటు మరికొన్ని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు ఇచ్చినట్లు వారు వివరించారు.

వారితో ఆడటం గౌరవం : కుల్దీప్



ముంబై : టీమిండియా మాజీ సారథి మహేంద్ర సింగ్ ధోనీ, ప్రస్తుత సారథి విరాట్ కోహ్లితో కలిసి ఆడటం ఆనందంగా ఉందని యువ చైనామన్ బౌలర్ కుల్‌దీప్ యాదవ్ అన్నాడు. ఒక క్రికెటర్‌గా, బౌలర్‌గా తన ఎదుగుదలలో ఎంఎస్ ధోనీ కీలక పాత్ర పోషించాడని తెలిపాడు. మైదానంలో వికెట్ల వెనకాల ఉంటూ మహీ ఇచ్చే ఆదేశాలు స్టంప్ మైక్ ద్వారా మనకు వినిపించే సంగతి తెలిసిందే. 'మహీ భాయ్ ఒక దిగ్గజం. టీమిండియా తరపున 300 పైగా వన్డేలు ఆడాడు. జట్టుకు ఏంతో సేవ చేశాడు. ఆయనతో కలిసి ఆడటం మాకు గర్వ కారణం. వికెట్ల వెనకాలే ఉంటూ మాకెంతో స్ఫూర్తి కలిగిస్తాడు. ప్రతిదీ చూసుకుంటూ అన్ని వేళలా మనకు మార్గదర్శిగా ఉంటాడు' అని కుల్‌దీప్ అన్నాడు. టీమిండియా ఆటతీరును కోహ్లి పూర్తిగా మార్చేశాడని కుల్‌దీప్ పేర్కొన్నాడు. 'విరాట్‌ను చూసి మనమెంతో నేర్చుకోవచ్చు. జట్టంగా కలిసికట్టుగా ఆడి గొప్పగా పోరాడాలని భావిస్తాడు. రెండేళ్లుగా సారథ్యం వహిస్తూ జట్టు దృక్పథాన్నీ, ఆటతీరునూ మార్చేశాడు. యువ ఆటగాళ్లను ప్రోత్సహిస్తున్నాడు. అతడు నన్నెంతో ప్రోత్సహిస్తాడు. సారథి మనల్ని విశ్వసిస్తే చాలా బాగుంటుంది. అప్పుడు మనం ఇంకా సులభంగా పనిచేయగలం' అని కుల్‌దీప్ అభిప్రాయపడ్డాడు.

షమీ ఎమోషనల్ ట్వీట్

న్యూఢిల్లీ : గృహహింస, హత్యాయత్నం ఆరోపణలు ఎదుర్కొంటున్న టీమిండియా పేసర్ మహమ్మద్ షమి తాజాగా ట్విటర్ ద్వారా ఓ ఫొటోను పంచుకున్నాడు. సామాజిక మాధ్యమాల్లో ఇప్పుడు ఇది కాస్త వైరల్‌గా మారింది. ఎందరో మంది అభిమానులు షమికి మద్దతుగా నిలిచారు. వారందరికీ షమి ధన్యవాదాలు కూడా తెలిపాడు. సోమవారం ట్విటర్ వేదికగా షమి తన కుమార్తె ఐరాకు సంబంధించిన ఫొటోను అభిమానులతో పంచుకున్నాడు. ఈ ఫొటోలో ఐరా ముందు బోలెడు చాక్లెట్లు కనిపిస్తాయి. ఇన్ని చాక్లెట్లు నా కోసమేనా అన్నట్లు ఐరా పెట్టిన పోజు నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఈ ఫొటోను పంచుకున్న షమి 'చాక్లెట్ లవర్.. మిస్ యు బెబో' అని పేర్కొన్నాడు. షమి చేసిన ఈ ఎమోషనల్ ట్వీట్ చూసి నెటిజన్లు మద్దతు పలికారు. 'ఎలాంటి ఆందోళన చెందకు, అంతా మంచే జరుగుతుంది, త్వరలో నీ సమస్యలన్నీ తీరిపోతాయి'అంటూ నెటిజన్లు కామెంట్లు పెట్టారు. షమి భార్య హసీన్ జహాన్ వారం రోజులుగా షమిపై సంచలన ఆరోపణలు చేస్తోన్న సంగతి తెలిసిందే. హసీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన కోల్‌కతా పోలీసులు ఇప్పటికే దర్యాప్తు ప్రారంభించిన విషయం తెలిసిందే.



ఆర్‌ఆర్ బ్యాటింగ్ కోచ్‌గా మజుందార్

న్యూఢిల్లీ : ఐపీఎల్‌లో ఎక్కువ ఫ్రాంఛైజీలు విదేశీ కోచ్‌ల బాట పడుతుంటే రాజస్థాన్ రాయల్స్ మాత్రం స్వదేశీ ఆటగాడినే బ్యాటింగ్ కోచ్‌గా ఎంచుకుంది. తాజాగా రాజస్థాన్ రాయల్స్ బ్యాటింగ్ కోచ్‌గా మాజీ క్రికెటర్ అమోల్ ముజుందార్‌ను ఎంపిక చేసినట్లు ట్విటర్ ద్వారా వెల్లడించింది. ఈనెల 13 నుంచి రాజస్థాన్ రాయల్స్ నిర్వహించే క్యాంపులో ముజుందార్ చేరతాడని ఫ్రాంఛైజీ తెలిపింది. రెండేళ్ల నిషేధం అనంతరం రాజస్థాన్ తిరిగి ఈ ఏడాది ఐపీఎల్‌లో పునరాగమనం చేయనుంది. ఆసీస్ సారథి స్టీవ్ స్మిత్‌ని కెప్టెన్‌గా ఎంచుకున్న విషయం తెలిసిందే. ఏప్రిల్ 7 నుంచి ఈ ఏడాది ఐపీఎల్ టోర్నీ ప్రారంభంకానుంది. ముంబైలోని వాంఖడే మైదానంలో డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్‌తో చెన్నై సూపర్ కింగ్స్ తలపడనుంది. ఏప్రిల్ 9న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో రాజస్థాన్ తన తొలి మ్యాచ్ ఆడనుంది. హైదరాబాద్ వేదికగా ఈ మ్యాచ్ జరగనుంది.



సెరెనాపై వీనస్ విజయం

కాలిఫోర్నియా: ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్ టోర్నమెంట్‌లో నల్ల కలువ సెరెనా విలియమ్స్‌పై అక్క వీనస్ విలియమ్స్ విజయం సాధించింది. మహిళల సింగిల్స్‌లో భాగంగా మూడో రౌండ్ పోరులో వీనస్ విలియమ్స్ 6-3, 6-4 తేడాతో సెరెనాపై గెలుపొందింది. సుమారు గంటకు పైగా సాగిన మ్యాచ్‌లో సెరీనా 41 అనవసర తప్పిదాలు చేసింది. దీంతో వీనస్ విలియమ్స్‌ను విజయం వరించింది. గతేడాది సెప్టెంబరులో పండంటి బిడ్డకు జన్మనిచ్చిన సెరెనా.. ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ నుంచి తప్పుకుంది. అనంతరం ఇటీవల అబుదాబిలో జరిగిన ఎగ్జిబిషన్ టోర్నీలో మళ్లీ రాకెట్ చేతబట్టింది. అయితే ఈ టోర్నీలో సెరెనా తొలి రౌండ్‌లోనే ఓడిపోయింది. వీరిద్దరి మధ్య ఇప్పటివరకూ జరిగిన 28 మ్యాచ్‌ల్లో సెరెనా 17 మ్యాచ్‌ల్లో విజయం సాధించగా, వీనస్ 11 మ్యాచ్‌ల్లో గెలుపొందారు. అక్కా చెల్లెళ్ల మధ్య జరిగిన తొమ్మిది మ్యాచ్‌లకు గాను ఎనిమిది మ్యాచ్‌ల్లో సెరెనా విజయం సాధించింది. 1998 ఆస్ట్రేలియా ఓపెన్‌లో వీరిద్దరూ ముఖాముఖి పోరులో తొలిసారి తలపడగా, 2014 తర్వాత సెరెనాపై వీనస్ విజయాన్ని సాధించడం ఇదే తొలిసారి.



వైసీపీకే కేంద్రమంత్రుల దర్శనం..?

విశాలాంధ్ర బ్యూరో-న్యూఢిల్లీ : కేంద్రం-టీడీపీల మధ్య దూరం పెరిగిపోతుంది. పొమన్నలేక కేంద్రం టీడీపీకి పొగ పెట్టిందనే వార్తలు కూడా వినిపిస్తున్న నేథప్యంలో దేశ రాజధాని ఢిల్లీలో మంగళవారం చోటు చేసుకున్న ఒక పరిణామం కేంద్రం టీడీపీని దూరం పెట్టిందనే వార్తలకు నిజమేనని రుజువైంది. విశాఖపట్నానికి రైల్వే జోన్ ఇవ్వలేమని కేంద్ర హోంశాఖ కార్యదర్శి రాజీవ్ చెప్పిన మరుసటి రోజే టీడీపీ ఎంపీలకు కేంద్రం వద్ద మరో చేదు అనుభవం ఎదురైంది. రైల్వేజోన్ విశాఖపట్నానికి ఇవ్వకపోవడానికి గల కారణాలపై చర్చించేందుకు టీడీపీ ఎంపీల బృందం కేంద్ర రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను అపాయింట్‌మెంటు అడిగారు. అయితే సాయంత్రం 4గంటలకు అపాయింటుమెంటు ఉంటుందని టీడీపీ పార్లమెంటరీ పార్టీ కార్యాలయం ప్రకటించింది. కానీ రైల్వే మంత్రితో అపాయింటుమెంటు ఖరారు కాలేదు. కానీ వైసీపీ ఎంపీ వరప్రసాద్‌కు మాత్రం కేంద్ర రైల్వే మంత్రి పీయూష్ గోయల్ అపాయింటుమెంటు ఇవ్వడం విశేషం. కేంద్రానికి టీడీపీకి మధ్య ఏర్పడిన పొరపొచ్చాల నేపథ్యంలో అడుగడుగునా టీడీపీకి కేంద్రంలో ఇబ్బందులే ఎదురవుతున్నాయి. టీడీపీ మంత్రులకు కేంద్రం అపాయింటుమెంటు ఇవ్వకూడదని నిర్ణయించుకున్నట్లు సమాచారం. కేంద్రం నుంచి ఇద్దరు టీడీపీ మంత్రులు రాజీనామా చేసిన నేపథ్యంలో కేంద్రం చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తోంద. బీజేపీపై టీడీపీ బురద జల్లడమే ధ్యేయంగా పెట్టుకుందని, ఆ మేరకు తాము ఏం చేయాలో తెలుసని బీజేపీ నేత ఒకరు వ్యాఖ్యానించారు. ఇద్దరీ మధ్య కూడా కోల్డ్‌వార్ జరుగుతున్న నేపథ్యంలో ఇదే అదనుగా బీజేపికి మరింత దగ్గరయేందుకు వైసీపీ ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం.

బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా చక్రవర్తి



విశాలాంధ్ర- రామచంద్రపురం : ఏపీ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా గన్నమనేని చక్రవర్తి ఎంపికయ్యారు. చిత్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశంలో ఈ నియామకం జరిగింది. రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షులుగా డాక్టర్ చెలికాని స్టాలిన్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎం.నాగేంద్రలను నియమించారు. వీరు 2018 నుంచి 2023 వరకూ పదవుల్లో కొనసాగుతారు. రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ అసోసియేషన్‌కు ఎన్నికైన వీరిని పట్టణ ప్రముఖులు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు అభినందించారు. ఈ సందర్భంగా చక్రవర్తి మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించి ఆంధ్రప్రదేశ్ జట్టును దేశంలో నెంబర్ 1 స్థానానికి తీసుకెళ్లేందుకు కృషిచేస్తానన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.